ఆదివారం
గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
22-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 260 పేజీలు: 10+4 వెల: 6.50

ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి: పిఎం
జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనాయ్ తకైచి 5లో


మంగళవారం తిరుమలలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

# మళ్లీ కుండపోత

- అల్పపీడనంతో మరో నాలుగు రోజులు భారీవర్షాలకు అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- చెరువుల్లా మారిన విజయవాడ రహదారులు

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయువ్యంగా కదిలి 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. ఈ కారణంగా ఏపీ వ్యాప్తంగా వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇవాళ ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల తర్వాత దక్షిణ మధ్య, పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడే అవ >>2

## తిరుమలలో భారీ వర్షం

**తిరుమల,అక్టోబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం, ఈశాన్యరుతుపవనాలురాకతో తిరుపతి జిల్లాలో తిరుమల, తిరుపతి,చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు ప్రాంతాల్లో రెండురోజులుగా ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. దీపావళి పర్వదినాన భారీగా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తిరుమలలోనూ ఆదివారం నుండి భారీగా వర్షం కురుస్తోంది. >>2

# పోలీసుల గౌరవం పెంచుతాం

## వారి కుటుంబ సంక్షేమ బాధ్యత మాదే..

### సోషల్ మీడియా నేరాలు పోలీసు శాఖకు ఓ సవాలు

### పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు నాయుడు

### రాజకీయ ముసుగులో చేసే నేరాలు కట్టడి చేయండి: సిఎం



మంగళవారం 'అమరులు వారు' చిరుపొత్తాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో హోంమంత్రి అనిత, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఉన్నారు

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ లాంటి దిగ్గజ ఐటి సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. వాటిని సంరక్షించటంలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషించాలని సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణదినం సందర్భంగా మంగళగిరిలోని ఎపిఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా దళాల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించారు.'అమరులు వారు' అనే శీర్షికతో పోలీసు అమరవీరుల చరిత్ర ఆధారంగా లిఖితమైన చిరుపుస్తకాన్ని సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. పోలీసు సంస్మరణ దినం ఫ్లాగ్ ధరించి.. ఫ్లాగ్ ఫండ్‌కు విరాళం ఇచ్చారు. పోలీసుల గౌరవం పెంచటంతోపాటు వారి కుటుంబాల సంక్షేమం చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎపి పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని.. దానికి మరింత వన్నెతెచ్చేలా పనిచేయాలని సిఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసులను ఉద్దేశించి ప్రసంగించిన సీఎం "దేశంలో శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. 1959 అక్టోబర్ 21న చైనాపై వీరోచిత పోరాటంలో సిఆర్పీఎఫ్‌కు చెందిన 10 మంది జవాన్లు అమరులయ్యారు. వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏటా అక్టోబర్ 21న, పోలీస్ అమర వీరుల దినాన్ని నిర్వహించుకుంటున్నాం. వారి త్యాగాలను, బలి దానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నాం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. వీరికి నివాళులు అర్పిస్తున్నాను. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులు అంటే నాకెప్పుడూ గౌరవం. పోలీసులు చేసేది ఉద్యోగం కాదు..నిస్వార్థ సేవ." అని అన్నారు. సంస్మరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నానన్నారు. వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుణ్ని కోరుకుంటున్నానన్నారు.ఈ సంవత్సరం విధినిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారన్నారు. వీరికి నివాళులు అర్పిస్తున్నాను అన్నారు. పెట్టుబడులు పెట్టే వారు తమ పెట్టుబడులకు రక్షణ కోరుకుంటారన్నారు. పెట్టుబడులు పెడితే ఇబ్బంది ఉండదన్న నమ్మకం ఉంది కాబట్టే గూగుల్ సంస్థ వచ్చిందన్నారు. 15 బిలియన్ డాలర్ల అతి పెద్ద పెట్టుబడివచ్చింది. ఎఐ డేటా విశాఖకు వచ్చిందన్నారు.ఎపి పోలీసులు అంటే ఒకబ్రాండ్. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంను అణిచివేయడంలో మీరు ఎంతో పేరుతెచ్చుకున్నారన్నారు. విధులకోసం కుటుంబాలు వదిలి >>2

# స్టార్‌బక్స్ తరహాలో అరకు కాఫీ మిల్లెట్ల అవుట్‌లెట్లు

## డాక్రా, మెప్మా విభాగాలు ఒకే గొడుగు కిందకు తెస్తాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబరు 21, ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్ని రంగాల్లో అవకాశాలు ఉంటే.. అన్ని రంగాలను ఉపయోగించుకోవాలని సిఎం సూచించారు. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు అన్ని రకాల చేయూత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సెర్ప్, మెప్మా విభాగాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే అంశంపైనా సిఎం చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..'రాష్ట్రంలోని మహిళలను శక్తిని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలి. డ్వాక్రా సంఘాల ఏర్పాటు తర్వాత వాళ్లల్లో చాలా చైతన్యం వచ్చిందని.. వారిలో ఉన్న ప్రతిభ వెలికి తీసేలా అధికారులు కసరత్తు చేయాలని సూచించారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తే... ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం


మెప్మా లబ్దిదారినికి రూ.1.25కోట్లు చెక్కును అందిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

సాధిస్తున్న వర్గంగా తెలుగువారు ఉన్నారు. డ్వాక్రా, మెప్మా మహిళల్లో ఉన్న టాలెంట్ గుర్తించాలి. డ్వాక్రా సంఘాలు పొదుపు చేసే మొత్తాలను..వాళ్ల బ్యాంకులోన్ల ద్వారా తీసుకునే రుణాలను ఏ విధంగా వినియోగించుకోవచ్చు... వాటిని మరింత సద్వినియోగం ఎలా చేయవచ్చనే అంశంపై గైడ్ చేయడానికి అవసరమైతే ఫండ్ మేనేజర్‌ను ఏర్పాటు చేసుకునే అంశాన్ని కూడా పరిశీలించాలి." అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**స్టార్ బక్స్ తరహాలో అరకు కాఫీమిల్లెట్ల అవుట్ లెట్లు..**


అరకు కాఫీమిల్లెట్లు ఈ రెండింటి కాంబినేషన్లో అవుట్ లెట్లు ఏర్పాటుచేసే ఆలోచన చేయండి. స్టార్ బక్స్ తరహాలో ఈ అవుట్ లెట్ల డిజైనింగ్ ఉండాలి.మహారాష్ట్ర బ్యాంబూ మిషన్ పాలసీ తెచ్చింది. దీనిపై అధ్యయనం చేయండి.. డ్వాక్రా మహిళలతో ఈ ఉత్పత్తులు చేయిద్దాం. ఆక్వా రంగంలో రాష్ట్రానికి ఎక్కువ అవకాశాలుఉన్నాయి. గుర్రపు డెక్కతో ఉత్పత్తులు చేయవచ్చు. డ్వాక్రా సంఘాల్లో కూడా పీహెచ్డీ చేసిన మహిళలు ఉన్నారు. వారి సేవలను కూడా ఉపయోగించుకోవచ్చు. వీటిల్లో డ్వాక్రా సంఘాలు వచ్చేలా చూడండి." అని సిఎం చెప్పారు.

# ఒక్క దీపమైనా వెలిగించారా?

## మాట తప్పిన కూటమి ప్రభుత్వం: జగన్

**విజయవాడ,అక్టోబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటింటా దీపాలు వెలిగిస్తాం అన్న కూటమి ప్రభుత్వం ఈ 18 నెలల కాలంలో ఒక్క దీపం అయినా వెలిగిందా? అని వైఎస్ జగన్ విమర్శించారు. ఈ మేరకు చంద్రబాబును ఉద్దేశిస్తూ సోషల్ మీడియా "ఎక్స్" వేదికగా పోస్టు చేశారు. 'మీరూ,మీ కూటమి ఇంటింటా వెలిగిస్తాం అన్న దీపాల్లో ఏ ఒక్క దీపం అయినా, మీ ఈ 18 నెలల కాలంలో వెలిగిందా? ఆ సంతృప్తి ఎవరికైనా ఉందా? నిరుద్యోగులందరికీ నెలకు రూ.3వేల చొప్పున భృతి, ప్రతి అక్కా చెల్లెమ్మకూ నెల నెలా రూ.1500, సంవత్సరానికి రూ.18,000, 50 యేళ్లకే పెన్షన్, నెల నెలా రూ.4వేలు. ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20,000, పిఎం కిసాన్ కాకుండా ఇస్తానంటూ మీరు ఇచ్చిన మాట ఎంతమంది పిల్లలు ఉన్నా, ఆ పిల్లలందరికీ, ప్రతి ఒక్కరికీ యేటా రూ.15,000, ప్రతి ఇంటికీ యేటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఈ రెండేళ్లలో 6 >>2

# ఆక్వా ఎగుమతుల్లో ఎపి టాప్


మంగళవారం సిడ్నీలో 'సీ ఫుడ్ ఇండస్ట్రీ' ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న మంత్రి లోకేష్

## సిడ్నీలో 'సీ ఫుడ్ ఇండస్ట్రీ' ప్రతినిధులతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

### ఆస్ట్రేలియా, ప్రపంచ వ్యాప్త కొనుగోలుదారులతో ఎపిని అనుసంధానించే యత్నం

### న్యూ సౌత్ వేల్స్ పరిశ్రమలు ఎపిలో పెట్టుబడులకు చర్చలు

**విజయవాడ,అక్టోబరు 21.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి భారీగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన బిజిబిజీగా సాగుతోంది. ప్రముఖ పెట్టుబడిదారి కంపెనీలు, ఇతర వ్యాపార,వాణిజ్యసంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమవుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి.వారి నుంచి సానుకూల స్పందన సాధిస్తున్నారు. సిడ్నీలోని సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా ప్రతినిధులు, ఆ సంస్థ సిఇఒ వెరోనికా పాపకోస్టా, ఎస్ఐఎ ఎంగేజ్ మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్లేలతో భేటీ అయ్యారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ భారత్‌లో అగ్రగామిగా ఉందని లోకేష్ వారికి వివరించారు. దేశం మొత్తం మీద ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో ఎపి 60 శాతానికి పైగా వాటా కలిగి ఉందని 2024-25లో 7.4 బిలియన్ డాలర్ల (రూ.66 వేల కోట్లు) విలువైన 16.98 మిలియన్ టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎపి నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యాయని అన్నారు. ఆస్ట్రేలియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో ఎపి సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులను అనుసంధానించేందుకు ట్రేడ్ మిషన్లు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలను చేపట్టాలని మంత్రి లోకేశ్ కోరారు.

భారత సముద్ర ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ కోసం ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమదారులు, ఆస్ట్రేలియా దిగుమతి దారుల మధ్య భాగస్వామ్యాలను సులభతరం చేయాలని అన్నారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత, నిల్వ కాలాన్ని పెంచేందుకు ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునాతన సాంకేతిక >>2

# నేటి నుంచి సిఎం యుఎఇ పర్యటన

## పలువురు పారిశ్రామిక వేత్తలతో 3 రోజులు భేటీలు

**విజయవాడ, అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం యుఎఇలో ముఖ్యమంత్రి బృందం ఈ నెల22 నుంచి పర్యటించనున్నది. విశాఖలో వచ్చే నెల 14, 15వ తేదీల్లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించనున్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి దుబాయ్ సిఎం చంద్రబాబు వెళ్లనున్నారు. 3 రోజుల్లో వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో వన్ టూ వన్ మీటింగులకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు.

పారిశ్రామికవేత్తలతో పాటు యుఎఇకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోను భేటీలు జరుపుతారు. రేపు దుబాయ్‌లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొననున్నారు. దుబాయ్‌లో మూడవ రోజు ఎపి ఎన్ఆర్‌టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొననున్న సిఎం చంద్రబాబు >>2

# లక్ష్మీ నాయుడు కుటుంబానికి పరిహారం ప్రకటించిన ప్రభుత్వం -హోంమంత్రి అనిత

**సచివాలయం, అక్టోబరు 21,ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దార్కానిపాడు గ్రామంలో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి ప్రభుత్వం పరిహారం ప్రకటించినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళవారం సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలసి ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తు సమగ్ర దర్యాప్తుకు ఆదేశించడం జరిగిందన్నారు.

ఈ ఘటనలో మరణించిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు భార్యకు 2ఎకరాల భూమి, రూ.5లక్షల నగదు పరిహారాన్ని ప్రకటించారన్నారు. వారిద్దరు పిల్లలకు 2ఎకరాల చొప్పున భూమి,రూ.5లక్షల చొప్పున పిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆ ఇద్దరు పిల్లలను చదివించే >>2



# భీమవరం డిఎస్పీపై నివేదిక ఇవ్వండి

## ఎస్పీని ఆదేశించిన డి.సిఎం పవన్

### డిఎస్పీ సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొంటున్నారని ఆరోపణ

**విజయవాడ.అక్టోబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డిఎస్పీ జయసూర్య వ్యవహారాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో భీమవరం డిఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు పెరిగిపోయినట్లు,సివిల్ వివాదాలలో సదరు అధికారి జోక్యం చేసుకుంటున్నారని, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నారనే తరహా ఫిర్యాదులు డిప్యూటీ సిఎం పవన్ దృష్టికి వచ్చాయి. ఇక ఈ విషయంపై పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఈ అంశంపై ఫోన్‌లో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులు ప్రస్తావించి డిఎస్పీ వ్యవహార శైలిపై నివేదిక పంపించాలని ఆదేశాలు జారీచేశారు. ఇక, అసాంఘిక వ్యవహారాలకు డిఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండటాన్ని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలన్నారు. ఈ తరహా వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియచేయాలన్నారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతి భద్రతలను పరిరక్షించాలని దిశా నిర్ధేశం చేశారు. అలాగే,భీమవరం డిఎస్పీపై వచ్చిన ఆరోపణలను రాష్ట్ర హోంమంత్రి అనితకు,రాష్ట్ర డిజిపికీ తెలియచేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జూదం ఆడటం, జూద కేంద్రాలు నిర్వహించడం, ప్రోత్సహించడం నేరం. ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్‌లో వీటిని నిర్వహించినా, ఆడినా ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 ప్రకారం శిక్షార్హులు అవుతారు అని చట్టం చెబుతోంది. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జూద కేంద్రాలు సాగుతున్నాయని >>2

డి.సిఎం ఆదేశిస్తే తప్పేంటి: హోంమంత్రి అనిత 2లో

# విశాఖలో అభివృద్ధి పరుగులు

## గ్రీన్ హైడ్రోజన్ కంపెనీతో మొదటి అడుగు

### సెమీ కండక్టర్ హబ్‌గా రాష్ట్రం: రాష్ట్ర బిజెపి చీఫ్ మాధవ్



**విశాఖపట్నం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** విశాఖ విస్తృతంగా అభివృద్ధి చెందుతుందని అందులో భాగంగాగ్రీన్ హైడ్రోజన్ కంపెనీతో మొదటి అడుగు పడిందని సెమీ కండక్టర్‌కి హబ్ గా ఎపి అవుతుందనిపి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు వివిఎన్ మాధవ్ తెలిపారు. మంగళవారం నగరంలో హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ముందుగా గూగుల్ ఎఐ డేటా సెంటర్‌పై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివి ఎన్ మాధవ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైజాగ్ అనేది ప్రపంచంలోనే ఒక గుర్తింపు నగరంగా వెలబడుతుందని చెప్పారు. 8665 కిలో మీటర్ల నేషనల్ హైవే తోపాటు 8 పోర్టులు 21821 కోట్లతో గ్రీన్ కారిడార్ ఉందని అన్నారు. 50 మిలియన్ డోలో ఇన్వెస్ట్ మెంట్ గూగుల్ చరిత్రలో అమెరికా వెలుపల పెట్టుబడిమన విశాఖలో పెట్టడం అంటే ఒక నమ్మకం అని చెప్పారు. సి కేబుల్, సబ్ సి కేబుల్ సిఫీ సంస్థ విశాఖ రావడం కర్ణాటకను వదిలి విశాఖ, ఎపి వైపు చూస్తున్నారు అని తెలిపారు. కేవలం కూటమిపై ఉన్న నమ్మకంతోనే కంపెనీలు వస్తున్నాయని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు వస్తుంటే ..జగన్మోహన్ రెడ్డి ఓర్వలేక పోతున్నారు అని గూగుల్ కంపెనీకి స్వాగతిస్తున్నట్లు ఒక ట్విట్ కూడా చేయలేదని ఆయన దుయ్యబట్టారు. గూగుల్ ఎఐ హబ్ విశాఖకు రావడం గొప్ప పరిణామం. అని అన్నారు. గూగుల్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తుంటే వైఎస్సార్సీ ఎందుకు స్వాగతించడం లేదో సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు.

ప్రపంచంలో దిగ్గజ సంస్థలకు 40 శాతం సర్వీస్ ప్రొవైడర్లుగా తెలుగు వారు ఉన్నారు అని విశాఖ కేంద్రంగా యువతకు మంచి అవకాశాలు రాబోతున్నాయి అని ఆయన పేర్కొన్నారు. సెమి కండక్టర్స్‌కు ఎపి కేపిటల్‌గా మారబోతుంది అనిగూగుల్ అమెరికా వెలుపల పెద్ద మొత్తంలో విశాఖలో పెట్టుబడులు పెడుతుంది. ఎన్ డి ఎ ప్రభుత్వం అభివృద్ధి నినాదంతో చేయడం వల్లే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాధవ్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

# చాయ్‌వాలా ఇంట్లో కోటి నగదు

## భారీగా బంగారం, వెండి స్వాధీనం

5లో



దీపావళి సందర్భంగా చిచ్చుబుడ్లను కాలుస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి

# మిన్నుముట్టిన దీపావళి సంబరాలు

## ఉండవల్లిలో వేడుకల్లో పాల్గొన్న సిఎం చంద్రబాబు దంపతులు

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోనూ దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్నారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా బాణసంచా కాల్చారు. పలుచోట్ల నరకాసురుడిని దహనం చేశారు. ఎపిలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. ఉండవల్లిలో సిఎం చంద్రబాబు నివాసంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఇంట్లో పూజ నిర్వహించిన చంద్రబాబు దంపతులు బాణసంచా కాల్చారు. కర్నూలులోని స్వగృహంలో మంత్రి టిజి భరత్ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి టీజీ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు దీపావళి వేడుకలను పాలకొల్లులోని మానసిక దివ్యాంగ పాఠశాలలో నిర్వహించారు. కుటుంబ సమేతంగా దీపావళి పండుగను చేసుకున్నారు. తెనాలిలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మీపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బాణసంచా కాల్చారు. రంగురంగుల బాణసంచా వెలుగుల మధ్య అమ్మవారి ఆలయం మెరిసిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గుంటూరు జిల్లా ఉండవల్లి గ్రామంలో చిగురు చిల్డ్రన్స్ హోంలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా అక్కడ ఉన్న పిల్లలకు స్వీట్లు, టపాసులు పంచారు. అనంతరం వారితో కలిసి బాణసంచాకాల్చారు. ఆ తర్వాత పిల్లలకు భోజనాలు వడ్డించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. సింహాచలంలోని శ్రీలక్ష్మీ నారసింహస్వామి దేవాలయంలో నరకాసురవధ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం ప్రభుత్వ బాలికల వసతిగృహంలో విద్యార్థులతోకలిసి ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పండుగ జరుపుకొన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం జంగాల కండ్రిగ, బ్రహ్మదేవం గ్రామాల్లోని గిరిజనులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకొన్నారు. విశాఖలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. అపార్ట్‌మెంట్లలో నివసించేవారు ఒకే కుటుంబంలా మారి వేడుకలు జరుపుకొన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తుమ్మలకుంట గ్రామంలో 20అడుగుల పొడవైన నరకాసురుడి ప్రతిమను దహనంచేశారు. తిరుపతిలోని బాలాజీ దివ్యాంగుల పునరావాస, పరిశోధన కేంద్రంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



తాడేపల్లి నివాసంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న మాజీ సిఎం వైఎస్ జగన్ దంపతులు

# ఐఎన్ఎస్ విక్రాంత్ పేరు వింటేనే పాక్‌కు నిద్రకరవు

## గోవాలో నౌకాదళ సిబ్బందితో మోడీ దీపావళి వేడుకలు

**పనాజి, అక్టోబరు 21:** ఐఎన్ఎస్ విక్రాంత్ పేరు వింటే శత్రువులకు (పాకిస్థాన్) నిద్రపట్టదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గోవా తీరంలోని ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నౌకాదళ సిబ్బందితో ప్రధాని మోదీ దీపావళి వేడుకలు జరుపుకున్నారు. సిబ్బంది అందరితోనూ కరచాలనంచేసిన ప్రధాని అందరికీ మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ నౌకాదళ సిబ్బందితో కలిసి దీపావళి పర్వదినాన్ని జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ దృశ్యం తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. తనకు ఒకవైపు మహాసముద్రం మరోవైపు భారత సైన్యం నిల్చోవడం గర్వంగా అనిపిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. సముద్ర జలాలపై మెరుస్తున్న సూర్యకిరణాలు.. సైనికుల చేత వెలిగిన దీపాల కాంతి వలె దివ్యంగా కనిపిస్తున్నాయని కొనియాడారు. ఐఎన్ఎస్ విక్రాంత్ భారత సైనిక సామర్థ్యాలకు సాక్ష్యమని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కొన్ని రోజుల్లోనే పాకిస్థాన్‌ను మన మోకాళ్లమీద పడేలా చేసిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ కేవలం యుద్ధ నౌక మాత్రమే కాదని ఇది 21వ శతాబ్దపు భారత కృషికి, ప్రతిభకు, నిబద్ధతకు ప్రతీక అని వెల్లడించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిగా మే 7వ తేదీన భారత దళాలు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌లో భారత త్రివిధ దళాలు సమన్వయంగా పనిచేసి పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని అనేక ఉగ్ర స్థావరాలను విజయవంతంగా దెబ్బతీశాయని మోదీ గుర్తుచేశారు. త్రివిధ దళాల సమన్వయం పాక్‌ను ఓటమి ఒప్పుకునేలా చేసిందని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని మోడీ ఏటా సరిహద్దుల్లోని సైనికులతో దీపావళి వేడుకలు జరుపుకుంటున్నారు. సైనికదుస్తులుధరించి, దళాలతో సరదాగాగడిపి వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు. 2014లో తొలిసారిగా సియాచిన్ సైనికులతో కలిసి మోడీ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.

# తిరుమలలో భారీ వర్షం

>> సోమవారం ఉదయం నుండి మంగళవారం సాయంత్రం కూడా ఎడ తెరపిలేని వానకురుస్తోంది. తిరుమల కొండను వరుణదేవుడు ముంచెత్తుతున్నాడు. ఓ వైపు వర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా మూడురోజులు సెలవులు రావడం, వారాంతం కావడంతో తిరుమలలో భక్తులసంఖ్య విపరీతంగా ఉంది. గోవిందనామస్మరణ చేస్తూ వర్షాలకు భక్తులు షెడ్లలోనే తలదాచుకున్నారు. భారీగా కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. మంగళవారం ఉదయం కూడా భారీ వర్షం కురవడంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డువితరణశాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు తలదాచుకునేందుకు షెడ్లవద్దకు పరుగులు తీస్తున్నారు. భారీ వర్షాలకు భక్తులు జాగ్రత్తలు పాటించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. వర్షం తగ్గుముఖం పట్టేవరకు భక్తులు తిరుమలలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరుతున్నారు. తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే,తిరుగుప్రయాణమయ్యే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్ళుతొక్కుతూ ప్రవహిస్తున్నాయి. తిరుమలకొండలను తెల్లటిపొగమంచు కమ్మేసి ఆహ్లాదకరంగా ఊటీని తలపింపజేస్తోంది. కాగా బంగళాఖాతంలో మంగళవారం మరో అల్పపీడనం ఏర్పడటంతో తిరుపతి జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాలతోబాటు తిరుపతి చిత్తూరుజిల్లాలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆరంజ్ అలర్ట్ చేశారు.

# మళ్లీ కుండపోత

>> కాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది మంగళవారం నాటికి అల్పపీడనంగా బలపడి, అ తర్వాత వాయుగుండంగా మారే అవకాశం ఉందనిచెప్పింది. ఈప్రభావంతో నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ విభాగం పేర్కొంది. ఈనెల 21న పశ్చిమ గోదావరి,ఏలూరు,కృష్ణా,ప్రకాశం,శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు,చిత్తూరు,తిరుపతి, 22న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి.పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, గుంటూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య,చిత్తూరు,జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వానలు కురుస్తాయని తెలిపింది.ఇక ఇప్పటికి అందుబాటులో ఉన్న సమాచారాన్ని అనుసరించి గత 48గంటల్లో వర్షానికి మచిలీపట్నం, పెడనలో రహదారులతో పాటు పల్లపు ప్రాంతాలు కూడా జలమయమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. రోడ్లపై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వాహనాలు ఆగిపోయి అవస్థలు పడ్డారు. కొన్ని ఇళ్లల్లోకి నీరు చేరడంతో నివాసితులు అవస్థలకు గురయ్యారు. విజయవాడలో నగరంలోని వర్షం తెరిపిస్తూ కురుస్తుంది.వర్షం తగ్గిందనుకునే లోపే మళ్ళీ వాన ముసురుకుంటుంది.గత రాత్రి బెంజిసర్కిల్, నిర్మలాకాన్వెంట్ రోడ్డు, పాలిక్లినిక్ రోడ్డు, రామవరప్పాడు కూడలి నుంచి ఎనికేపాడు వరకు రహదారులు చెరువులను తలపించాయి.

**నెల్లూరు జిల్లాలో అన్నదాతకు గుండెకోత**

గత నాలుగురోజుల నుండి కురుస్తున్న వర్షాలకు తోడుగా బంగాళాఖాతంలో అల్పపీడనం పుణ్యమా అని కుండపోత వర్షంతో అన్నదాతకు గుండె కోత మిగిల్చింది. చేజర్ల మండలంలో భారీగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పొలాలు పూర్తిగా నీట మునిగి సముద్రం ను తలపిస్తున్నాయి. దీంతో చేతికి వచ్చిన పంట నీట మునిగడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతం అయ్యారు. అన్నదాతల వివరాలు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల మండలంలోని కాకివాయి గ్రామంలో సుమారు 100 ఎకరాలు వరి పంట పూర్తిగా నీట మునిగింది. సన్న చిన్న కారు రైతులు ఎకరానికి 30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికి వస్తుందన్న సమయానికి ఆకాల వర్షాంతో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన పంట పొలాలను పరిగణలోకి తీసుకోని ఉదారంగా ఆర్థికంగా సాయం అందిస్తే తప్ప ఇబ్బందులునుండి కోలుకోలేమని, అన్నదాతలు ప్రభుత్వం సాయం కోసం నిరీక్షిస్తున్నారు.

# పోలీసుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తి

## డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసుల త్యాగాలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.వారి సేవలను ఎన్నటికి మరువరాదన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు వీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు."విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన వీర పోలీసు సైనికులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను" అని పవన్ పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న పోలీసు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. పోలీసుల సేవలు, వారి త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. ప్రజా భద్రత, శాంతి పరిరక్షణ విషయంలో పోలీసులు అలుపెరగకుండా పనిచేస్తున్నారని పవన్ ప్రశంసించారు. నేరాల రేటును తగ్గించేందుకు పోలీసులు అనుసరిస్తున్న వ్యూహాలు, ప్రణాళికలు అభినందనీయమని ఆయన అన్నారు. విధి పట్ల అంకితభావంతో పనిచేసే పోలీసుల త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# భీమవరం డిఎస్పీపై నివేదిక ఇవ్వండి

>> ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. పేకాట క్లబ్బుల నిర్వహణపై ఆ ఫిర్యాదుల్లో తెలిపారు. కొందరు పెద్దలు పేకాట కేంద్రాలను నిర్వహిస్తూ, నెలవారి మామూళ్లను అధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు, పోలీసు అధికారులకు దీనిపై ఉన్న సమాచారం తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై ఆరా తీశారు. ఒకవేళ పోలీసు అధికారుల దృష్టికి వచ్చిన వివరాలు, దానిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర డిజిపికి స్పష్టం చేశారు.

# ఆదేశిస్తే తప్పేంటి: హోంమంత్రి అనిత

**విజయవాడ,అక్టోబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** భీమవరం డిఎస్పీ జయసూర్య వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. డిఎస్పీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి నివేదిక కోరారు. దీనిపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందిస్తూ 'డిప్యూటీ సిఎం ఆదేశిస్తే తప్పేంటి?' అంటూ స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడడం, చట్టం అమలు చేయడం పోలీసుల బాధ్యత. సివిల్ వివాదాల్లో తలదూర్చడం సరికాదని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

అదే విధంగా భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణలను హోంమంత్రికీ, డిజిపికి తెలియచేయాలని తన కార్యాలయ అధికారుల్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.ఈ అంశంపై హోంమంత్రి వంగలపూడి అనితను విలేకరులు ప్రశ్నించారు. ఆమె స్పందిస్తూ, "డిప్యూటీ సిఎం పవన్ ఆదేశాలు ఇస్తే అందులో తప్పేముంది?" అని ప్రశ్నించారు. 'మంత్రుల మధ్య సమన్వయం ఉంటే ఓ వర్గం మీడియాకు బాధ ఎందుకు అవుతోంది?' అని ప్రశ్నించారు. 'మాకు లేని ఇబ్బందులు కొంతమంది మీడియా వర్గాలకు ఎందుకు?' అని అనిత నిలదీశారు.

# పోలీసుల గౌరవం పెంచుతాం

>> వస్తున్న మీకు, సంతోషాలను త్యాగంచేస్తున్న మీ కుటుంబాలకు నమస్కారాలు చెపుతున్నా అన్నారు. నేరాల తీరుమారుతోంది క్రిమినల్స్ అప్ డేట్ అవుతున్నారన్నారు. వారిఆటకట్టించాలంటే మీరు మరింతఅప్‌డేటెడ్ వెర్షన్‌తో ఉండాలన్నారు. అందుకే సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నామన్నారు.

**రాజకీయ ముసుగు వేసుకుని వస్తున్నారు..**

"సమాజంలో అశాంతి సృష్టించి...లబ్ధి పొందడం కోసం రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు తయారయ్యారు . వీళ్ల అసలు క్రిమినల్స్ కంటే ప్రమాదం. మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు. సమాజంలో అశాంతిని సృష్టించడానికి రాజకీయ కుట్రలు చేస్తున్నారు. ఫేక్ ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో పోలీసులు మరింత అలెర్ట్‌గా ఉండాలి. పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని మతాల మధ్య చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. దీనికి రాజకీయాన్ని జోడించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో సిసి కెమెరాలతో వాస్తవాలు బయట పెట్టగలిగాం. జిడి నెల్లూరు మండలంలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి వేరే వారిపై నెపం నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు. సిసి టీవీలు ఉండటంతో నేరస్తులు దొరికారు. లేదంటే జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని రచ్చ చేసేవారు. కల్తీ మద్యంపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దోషులు ఏ పార్టీ వారైనా చర్యలు తీసుకోవాలని చెప్పాం. రాష్ట్రంలో ఎవరు చనిపోయినా మద్యంతోనే అని భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న దుష్ప్రచారం, నేరాలు పోలీసులకు అతి పెద్ద ఛాలెంజ్. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో పెట్టే అసభ్యకర పోస్టుల విషయంలో చాలా మంది కుమిలిపోతున్నారు. శాంతి భద్రతలకంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఆడబిడ్డలపై అరాచకం చేస్తే.. అదే చివరి రోజు అనిపించేలా పోలీసులు కఠినంగా ఉండాలి. ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి.. ప్రభుత్వం పోలీసులకు అండగా ఉంటుంది." అని సీఎం స్పష్టం చేశారు. "శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అప్పుడే సంక్షేమం అందరికీ అందుతుంది. ఉపాధి ఉద్యోగావకాశాలులభిస్తాయి. అప్పుడే కుటుంబంలో, సమాజంలో సుఖ శాంతులు ఉంటాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమాజంలో అలజడి ఉంటే పెట్టుబడులు రావు. అందుకే నేను ఎప్పుడూ లా అండ్ ఆర్డర్‌పై ఖచ్చితంగా ఉంటాను. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతో పరిశ్రమలు, కంపెనీలు వస్తాయి. అదే నమ్మకంతో విశాఖలో గూగుల్ పెట్టుబడులు పెట్టింది. విశాఖలో గూగుల్ పెడుతున్న పెట్టుబడులు దేశంలోనే అతిపెద్ద పెట్టుబడి. 15 బిలియన్ డాలర్లతో ఏఐ డేటా హబ్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది. అప్పుడే ఎపి అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుందన్నారు. శాంతి భద్రతల విషయంలో నేను ఏనాడూ రాజీపడలేదు. అందుకే నాపై నక్సలైట్లు క్లైమోర్ మైన్లతో దాడి చేశారు. మనం చేసే పనులే శాశ్వతం. మంచి పనులు చేస్తున్న పోలీస్ శాఖను అభినందిస్తున్నా. పోలీసుల వైద్య సేవలకు 16 నెలల్లో రూ.33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లుఅందించాం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నాం. ఒక డిఎ ఇవ్వాలని నిర్ణయించాం. పోలీస్ సోదరులకు ఒక సరెండర్ లీవ్ రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ నియామకాలను పూర్తి చేశాం. శాఖాపరమైన పదోన్నతులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి లక్ష్యం కావాలి. దీనికి శాంతి భద్రతలు చాలా ముఖ్యం. విపత్తులు, కరోనాలాంటి మహమ్మారి వంటివి వచ్చినా... ముందుండి ప్రజల కోసం పోలీసులు మొదటి అడుగులు వేశారు. పోలీసులు తమ విధుల కోసం కుటుంబాన్ని సుఖ సంతోషాలను త్యాగం చేస్తున్న పోలీస్ కుటుంబాలకు నమస్కారాలు."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సిఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆక్వా ఎగుమతుల్లో ఎపి టాప్

>> పరిజ్ఞానాలను పరిచయం చేయాలని అన్నారు.

పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తూ ఉత్పాదకతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన ఆక్వా కల్చర్, మత్స్య సంపద నిర్వహణకు ఎపి ఆక్వా పరిశ్రమ దారులతో కలిసి నైపుణ్యాన్ని పంచుకోవాలని లోకేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ వంటకాలను ప్రోత్సహించి, కలినరీ టూరిజంను ఆకర్షించేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలని అలానే సముద్ర మట్టాల పెరుగుదల, తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేలా ఎపి సీఫుడ్ పరిశ్రమలో నిరోధకశక్తిని పెంచే ప్రాజెక్టులపై కలిసి పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు. అనంతరం సిడ్నీలోనే పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్‌తో మంత్రి లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పారమట్టాలో స్థానిక వ్యాపారాలను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించి గ్లోబల్ సిటీగా మార్చడంలో జైటర్ కృషిని లోకేశ్ ప్రశంసించారు. ప్రజారవాణా, గ్రీన్ స్పేసెస్ ను అభివృద్ధి చేయడంలో చొరవ చూపిన జైటర్, పారమట్టా స్క్వేర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. గత 20 ఏళ్లుగా లోకల్ గవర్నెన్స్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. స్టార్టప్ స్టేట్‌గా ఉన్న ఎపిలో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం హారిస్ పార్కులో లిటిల్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన రివర్ సైడ్ ఫుడ్‌కోర్టును మంత్రి లోకేష్ సందర్శించారు.ఇక సిడ్నీలో హెచ్ఎస్‌బిసి బ్యాంక్ సిఇఓ ఆంటోనీ షా నేతృత్వంలోని బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌ల బృందంతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అత్యంత అనుకూల వాతావరణం నెలకొంది.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ పాలసీలతో రాష్ట్రం వేగంగా ఎదుగుతోంది,' అని ఆయన చెప్పారు. 'కేవలం 16నెలల్లోనే రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. ఒకసారి ఎంవోయూ కుదిరితే, ఆ పరిశ్రమను మాది అని భావించి అవసరమైన అన్ని అనుమతులు అందిస్తాం.' అని పేర్కొన్నారు.

**న్యూసౌత్ వేల్స్ పరిశ్రమలు ఎపిలో పెట్టుబడులు పెట్టాలి**

ఎపిలో అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫాక్చరింగ్,స్టార్టప్‌లు,గ్రీన్ టెక్నాలజీలో సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఎపి న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్,ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా న్యూసౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్నోవేషన్,వాణిజ్యం,నైపుణ్యాభివృద్ధి రంగాల్ల ఎపి, న్యూ సౌత్ వేల్స్ ప్రభుత్వాల మధ్య ఒప్పందాన్ని సులభతరం చేయాలని కోరారు. న్యూసౌత్ వేల్స్ ఇన్నోవేషన్ క్లస్టర్లను ఎపిలో రాబోయే ఇన్నోవేషన్,స్టార్టప్ హబ్‌లతో అనుసంధానించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రెన్యూవబుల్ ఎనర్జీ, మెడిటెక్, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్న న్యూ సౌత్ వేల్స్ కంపెనీలు ఎపి పరిశ్రమ కారిడార్లలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని మంత్రి కోరారు. క్లీన్‌టెక్,కృత్రిమ మేధస్సు,(ఎ1),సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో పరిశోధన,అభివృద్ధి కోసం న్యూసౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల మధ్య సహకారానికి ప్రోత్సాహం అందించాలని కోరారు.

## వారం - వర్జ్యం

22-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
శు.పాడ్యమి రా.8.18
స్వాతి రా.1.52
వర్జ్యం : ఉ.8.09-9.57
దు.ఉ.11.29-12.16
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

- **మేషం :** నూతన పెట్టుబడులు సమకూర్చుకుంటారు. వస్తువులు కొనుగోలు.
- **వృషభం:** బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వాహనయోగం.
- **మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.
- **కర్కాటకం :** ఎదుటి వారికి మీ సహాయాన్ని అందిస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి.
- **సింహం:** మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోనికి వస్తుంది.
- **కన్య :** కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.
- **తుల :** స్థిరాస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.
- **వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక రంగం వారికి పదవులు, హోదాలు లభిస్తాయి.
- **ధనుస్సు:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.
- **మకరం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలుగుతాయి.
- **కుంభం:** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.
- **మీనం :** అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి. సభలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేటి నుంచి సిఎం యుఎఇ పర్యటన

>> తొలి రోజు పర్యటనలో భాగంగా 22వ తేదీ ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సిఎం భేటీ అవుతారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో బుధవారం సిఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులుషిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చించనున్నారు.

పర్యటనలో పలు ప్రాంతాలను సందర్శించనున్న సిఎం చంద్రబాబు బృందం చంద్రబాబుతో పాటు దుబాయ్ పర్యటనలో పాల్గొననున్న మంత్రులు టిజి భరత్, బిసి జనార్థన్ రెడ్డి, సిఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఎపి ఇడిబి సిఇఒ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ ధాత్రి రెడ్డి ఉన్నారు.

# ఒక్క దీపమైనా వెలిగించారా?

>> సిలిండర్లు.అక్క చెల్లెమ్మలందరికీ ఎక్కడికైనా, ఏ బస్సులో అయినా ఉచిత ప్రయాణం.. ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలు, ఇవన్నీ వెలగని దీపాలో.. లేక చేశాం అంటే చేశాం అన్నట్టుగా వెలిగించిన అరకొర దీపాలా..? లేక మీరు రాకముందు వరకూ దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలను ఆర్పడమా? వీటితోపాటు స్కూళ్లు, ఆస్పత్రులు, విద్యా, వైద్యం, వ్యవసాయం, లా అండ్ ఆర్డర్, పారదర్శకత ఇవన్నీకూడా వెలగని దీపాలే కదా. మా ప్రభుత్వ పాలనలో 2019- 24 మధ్యఇంటింటికీ అందిన డిబిటి అనే ఇంధనం ద్వారా దేదీప్యమానంగా వెలిగిన దాదాపు 30 పథకాలు అనే దీపాలను మొత్తం ఆర్పేసిన మీరు, ఇంటింటా నెలకొన్న చీకటికి ప్రతినిధులు." అంటూ పేర్కొన్నారు.

# లక్ష్మీ నాయుడు కుటుంబానికి పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

>> బాధ్యతను కూడా ఈ హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని,విచారణ వేగవంతంగా జరిగేందుకై ప్రత్యేక పిపిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆమె తెలిపారు.ఈ హత్యకు కారణమైన నిందితునికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ రాకుండా చూడాలని,కఠినంగా శిక్షించేందుకు సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణిస్తూ వెంటనే రాష్ట్ర స్థాయి కమిటిని ఏరా ్పటు చేయడం జరిగిందని,అందులో తాను,రాష్ట్ర పట్టణాభివృద్ధి కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నట్లు ఆమె తెలిపారు.ఈ కమిటీ సభ్యులు హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి,ప్రభుత్వ పక్షాన పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఘటనకు కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరుగుతుందని భరోసా ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు.

పోలీసులు కథనం ప్రకారం నిందితుడు కాకర్ల హరిశ్చంద్ర ప్రసాద్ తన వాహనంతో తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు,పవన్,భార్గవ్‌లు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను రాళ్లపాడు సమీపంలో ఢీకొట్టడం జరిగిందన్నారు.ఈ ఘటనలో లక్ష్మీనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, పవన్, భార్గవ్‌లు తీవ్రమైన గాయాలు పాలవ్వడం జరిగిందన్నారు.బాధితుని సొంత తమ్ముడైన పవన్ వెను న్నపూస పూర్తిగా దెబ్బతిందని,నడవలేని స్థితిలో ఉన్నాడని ఆమె తెలిపారు.హరిశ్చంద్ర ప్రసాద్,లక్ష్మీనాయుడు మధ్య ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన తేడాల నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.సమావేశంలో రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ,కందుకూరు ఎమె ్మల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## 25న నాగులచవితి - రాత్రికి పెద్దశేషవాహనసేవ



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** దీపావళిపర్వదినం తరువాత నాల్గవరోజు శనివారం నాగులచవితి పర్వదినం జరుగుతుంది. శనివారం రాత్రి 7గంటలకు నాగులచవితి పర్వదినాన మలయప్పస్వామి ఏడుతలల పెద్దశేషుని వాహనంగా చేసుకుని ఊరేగనున్నారు. పెద్దశేషునిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగడం ప్రత్యేకత.

## రూపాయి హారతితో నూతన వస్త్రాల్లో మెరిసిన తిరుమలేశుడు

### - వేడుకగా దీపావళి ఆస్థానం



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమంప్రకారం పూజలందుకునే ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి దీపావళి ఆస్థానం ఆలయ అర్చకులు, అధికారులు వేడుకగా నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి విశ్వక్సేనుల ఉత్సవమూర్తులను ఆనంద నిలయంలో గరుడాళ్వార్ సన్నిధిలోఉంచి ఆస్థానం చేపట్టారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపించి కర్పూర మంగళహారతులతో ప్రసాద నివేదనలు చేశారు. మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేసి రూపాయి హారతితో ప్రత్యేక హారతులు నివేదించడంతో ఆస్థానం ముగిసింది. అనంతరం తీర్థం.శఠారితో అర్చకులు అధికారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## టిటిడిలో ప్రత్యేక విపత్తుల స్పందన కేంద్రం

### - ఫోన్‌నంబర్ కేటాయింపునకు అదనపు ఇఒ వెంకయ్య ఆదేశం



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఈశాన్యరుతుపవనాలు ప్రభావంతో ఎడతెరపిలేకుండా కురుస్తున్న జోరువానలకు ప్రత్యేక విపత్తుల స్పందన కేంద్రం ఏర్పాటుతోబాటు ఫోన్‌నంబరన్‌ను కేటాయించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. దాన్ని తిరుమల టిటిడి సిబ్బందికి ,భక్తులకు చేరే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. ఇటువంటి విపత్తు సమయాల్లో వాట్సాప్ సేవలను విభాగాల వారీగా విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. దిగువఘాట్(మొదటిఘాట్)రోడ్డులో అక్కగార్లగుడి, మాల్వాడిగుండం పక్కన జలపాతాల వద్ద భక్తులు గుమికూడి సెల్ఫీలు తీసుకోకుండా భద్రత సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. వర్షాలతో తిరుమలలో తలెత్తే సమస్యలు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు,చర్యలపై అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మంగళవారం సాయంత్రం వర్చువల్‌గా టిటిడి జెఈఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ ఇతర అధికారులతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. తిరుమలలో భారీ వర్షాలకు భక్తుల క్యూలైన్లు వెలుపలకు రాకుండా చూడాలని, వేడివేడిగా అన్నప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు. టైమ్‌స్లాట్ దర్శనం(ఎస్ఎస్‌డి)టోకెన్లు జారీని తగ్గింపు చేయాలని, తద్వారా సర్వదర్శనం భక్తులు నారాయణగిరి షెడ్లకు త్వరగా చేరుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. భారీ వర్షాలకు కొండ చరియలు ,చెట్లు విరిగిపడితే అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు జెసిబి వాహనాలతో తొలగించాలన్నారు. ఘాట్‌రోడ్లులో నిరంతరాయంగా పెట్రోలింగ్ వాహనాలు పహరాకాయాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలు ఎదురైనపుడు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్‌విభాగం, ఐటి విభాగం సమన్వయంతో భక్తులకు నిర్ధేశించిన ఆన్‌లైన్‌సేవల్లో ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూడాలని ,జంక్షన్‌ల వద్ద సరైన కంచె, సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

## వెంకన్న దర్శనంతో ఆనందం



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలి యుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడంతో మనసు ఆనందంగా ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ వి.సుజాత, హాస్య నటుడు రఘు తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబంతో కలసి వీరు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో మానవాళి సుభిక్షం

### - కంచిపీఠాధిపతి విజయేంద్రసరస్వతి



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉంటుందని, భగవన్నామస్మరణతోనే ముక్తికలుగుతుందని కంచికామకోటిమఠం పీఠాధిపతి విజయేంద్రసరస్వతిస్వామి అనుగ్రహభాషణం చేశారు. దీపావళి పర్వదినం సందర్భంగా మంగళవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా మహద్వారం వద్ద స్వాగతం పలికారు. జోరువానలోనూ స్వామివారు ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హోం మంత్రి పేరుతో మోసం

### - లక్షల రూపాయలు వసూలు చేసిన మోసగాడు అరెస్టు



**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** ఈవెంట్ నిర్వాహకుడుగా నటిస్తూ శ్రీవారి దర్శనాలు, ఆర్జితసేవలు ,గదులు బుకింగ్ పేరుతో ,హోంమంత్రి పేరుతో భక్తులను మోసగించిన దళారీని తిరుమల పోలీసులు అరెస్టుచేశారు. తిరుపతి చంద్రగిరి పాతపేటకు చెందిన మోసగాడు బురిగాల అశోక్ అనే అశోక్‌కుమార్‌రెడ్డి(30)ని మంగళవారం అరెస్టుచేసినట్లు తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ తెలిపారు. చంద్రగిరికి చెందిన ఇతను తిరుమలలో దర్శనాలు, గదులు పేరుతో భక్తులను నమ్మించి లక్షలరూపాయలు వసూలుచేశాడు. హైదరాబాద్‌కు చెందిన అమస్‌గోయల్, రాదికా అగర్వాల్, గోపాల్‌నత్మల్‌అగర్వాల్, బాలకృష్ణ తదితరులను 4.10లక్షలు రూపాయలు డబ్బులు తీసుకుని ఆర్జితసేవలు ఇవ్వకపోగా పరారయ్యాడు. బాధితులు టిటిడి విజిలెన్స్‌వింగ్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుమల వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఏడాదిలోపు కోటిరూపాయలు కొంతవక్కువ డబ్బులు వసూలుచేసినట్లు తెలిపారు. ఇతనిని అరెస్టుచేసి అతని నుండి మొబైల్‌ఫోన్, ద్విచక్రవాహనం, నాలుగు బ్యాంకు పాసు పుస్తకాలు, స్వాధీనం చేసుకున్నారు.



# యూజర్ ఫ్రెండ్లీగా పౌర సేవలు

### - ఆర్టీజిఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు సమర్థంగా ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని సీఎం సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, సంక్షేమ పథకాలపై సీఎం చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సేవలు అందాలని, దీనికోసం టెక్నాలజీ సాయాన్ని తీసుకోవాలని సూచించారు. సమర్థంగా పౌర సేవలు అందినప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని సీఎం అన్నారు. ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారాన్ని డేటా అనలటిక్స్ తో విశ్లేషించుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు అందిస్తున్న సేవల విషయంలో టెక్నాలజీ ఆడిటింగ్ కూడా నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. వీటితో పాటు మంత్రులు, అధికారులు ఫైళ్ల క్లియరెన్సుకు ఎంత సమయం తీసుకుంటున్నారన్న అంశాన్ని కూడా బేరీజు వేస్తామని సీఎం తెలిపారు. తద్వారా ఏ స్థాయిలో ఎక్కువ ఫైళ్లు ఉండిపోతున్నాయన్న వివరాలను తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక సహా వివిధ సేవలు అందిస్తున్న వెబ్ సైట్లు, యాప్ లు ప్రజలకు సులభంగా సేవలందించేలా తీర్చిదిద్దాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని డేటా లేక్ ద్వారా త్వరలోనే అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, భూగర్భ జలాలు ఇలా వేర్వేరు రకాలుగా సేకరిస్తున్న సమాచారాన్ని సమర్థంగా వినియోగించుకోవటం ద్వారా ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని తగ్గించాల్సి ఉందని ముఖ్యమంత్రి సూచించారు. టెక్నాలజీ వల్ల వచ్చే ప్రయోజనంతో పాటు డేటా విశ్లేషణ ద్వారా ఫలితాలను అంచనా వేయాలని సీఎం సూచించారు. ఏపీలో ఇప్పటి వరకూ 2.10 లక్షల గంటల మేర డ్రోన్ల వినియోగం జరిగిందని... 77 శాతం మేర వ్యవసాయ అవసరాలకు వినియోగించిన రీత్యా రైతులకు ఎంతమేర వ్యయం తగ్గింది.. అధిక పురుగుమందుల వినియోగం ఏమేరకు తగ్గించారన్న విషయాన్ని కూడా అంచనా వేయాలన్నారు. నేరాల నియంత్రణ, విచారణల్లో సీసీ కెమెరాల వినియోగం ఎంతమేర జరుగుతుందన్న అంశంపైనా సీఎం ఆరా తీశారు. అవేర్ వంటి సాంకేతికత వ్యవస్థ ద్వారా ప్రకృతి విపత్తులతో పాటు వివిధ అంశాల్లో సేకరిస్తున్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై కూడా సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీ ప్రభుత్వంలోని ఏ శాఖ సమాచారం అయినా ప్రజలు తెలుసుకునేందుకు ఏపీ సెర్చ్ బార్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సీఎంకు అధికారులు వివరించారు.

# 11నెలల్లో రికార్డుస్థాయి విరాళాలు నమోదు

### -టిటిడి ట్రస్ట్‌లకు రూ.918.60కోట్లు రాక

**తిరుమల,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం అనేక ధార్మిక,విద్య,వైద్యసేవల కోసం పలు ట్రస్ట్‌లను నిర్వహిస్తోంది. ఈ ట్రస్ట్‌లను పూర్తిగా దాతల సహకారంతోనే టిటిడి నడుపుతూ ఇతోధికంగా పేదలకు సేవలందిస్తోంది. గడచిన 11నెలలకాలంలో రికార్డు సాయిలో తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు 918.60కోట్లు రూపాయలు విరాళాలు అందాయి. 2024 నవంబర్ 1వతేదీ నుండి 2025 అక్టోబర్ 16వతేదీ వరకు ఈ విరాళాలు పలు రకాలుగా ఆఫ్‌లైన్‌లోనూ, ఆన్‌లైన్‌లో దాతలు టిటిడికి అందజేశారు. ఆన్‌లైన్‌లోనే 11నెలల్లో 579.38కోట్లు రూపాయలు, ఆఫ్‌లైన్‌లో 339.20కోట్లు విరాళాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత టిటిడికి విరాళాలు వెల్లువెత్తాయి. టిటిడి ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు నేతృత్వంలో టిటిడి పూర్వ ఇఒ జె.శ్యామలరావు, ప్రస్తుత ఇఒఅనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దాతలను మరింతగా ప్రోత్సహిస్తూ భారీగా విరాళాలు రాబడుతున్నారు. టిటిడి ట్రస్ట్‌లకు విరాళాలతోబాటు పలు నిర్మాణాలు, యంత్రాలు కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం దాతలు అందిస్తున్నారు.అన్ని ట్రస్ట్‌లకంటే టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు భారీగా విరాళాలివ్వడం విశేషం. ఇప్పటికే 2,500కోట్ల రూపాయలు మేరకు అన్నప్రసాదాల ట్రస్ట్‌కు నిధులు చేరాయి. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియనీయకుండా ఉండేలా రుచిగా, శుచిగా నాణ్యతతో ఇప్పుడు అన్నప్రసాదాలు ఉచితంగా రోజుకు లక్షమందికిపైగా భక్తులు స్వీకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు అవసరమైన మేరకు ఉచిత వైద్యం, శస్త్రచికిత్సలు అందించడానికి శ్రీవేంకటేశ్వర ప్రాణదానట్రస్ట్, పేదవిద్యార్థులకు టిటిడి విద్యాసంస్థలు, కళాశాలలల్లో ఉచిత విద్య అందించడానికి ఎస్వీ విద్యాదానట్రస్ట్, భారత దేశం మొత్తం ఆలయాల నిర్మాణం, నిర్వహణ, ధూపదీపనైవేద్యాలకు శ్రీవాణిట్రస్ట్‌ను. దివ్యాంగులకు ఉచిత వైద్యచికిత్సలందించడానికి బర్డ్ ట్రస్ట్‌ను, గోమాతల సంరక్షణకుగాను వాటి బాగోగులు చూసేందుకు, గోశాలల్లో గోవులను సంరక్షణకు ఎస్వీ గోసంరక్షణట్రస్ట్, ధార్మిక కార్యక్రమాల్లో వేదాల సంరక్షణ, ప్రచారం కోసం ఎస్వీ వేదపరిరక్షణట్రస్ట్, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకుగాను ఎస్వీ సర్వశ్రేయస్‌ట్రస్ట్, సాంస్కృతిక వారసత్వ సంరక్షణ పేరుతో ఎస్వీ హెరిటేజ్ ప్రిజర్వేషన్ ట్రస్ట్‌ను(ఈ ట్రస్ట్‌కు నిధులుపెద్దగాలేదు), ఉచిత వైద్య సేవలందించడానికి స్విమ్స్ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పతకం, అనాధ పిల్లల పోషణ, విద్యకోసం ఎస్వీబాలమందిర్‌ట్రస్ట్, భక్తిప్రచార కార్యక్రమాలకు ఎస్వీబిసి ట్రస్ట్, స్విమ్స్‌ట్రస్ట్‌ను వైద్యవిద్య పరిశోధనలకోసం ఇలా అనేక ట్రస్ట్‌లను నిర్వహిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుత ధర్మకర్తలమండలి దాతల నుండి పలు పథకాలకు విరాళాలు సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ఏడాది నవంబర్ నుండి ఈ ఏడాది అక్టోబర్ వరకు 918.60కోట్లు రూపాయలు విరాళాలు పలు ట్రస్ట్‌లకు చేకూరడం రికార్డుస్థాయిగా టిటిడి పేర్కొంది. అత్యధికంగా అన్నప్రసాదం ట్రస్ట్‌కు 338.80కోట్లు విరాళాలు అందాయి. శ్రీవాణి ట్రస్ట్‌కు 252.83కోట్లు, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్ట్‌కు 97.97కోట్లు విరాళాలు, ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు 66.53కోట్లు, ఎస్వీ గోసంరక్షణట్రస్ట్‌కు 56.77కోట్లు, ఎస్వీవిద్యాదానట్రస్ట్‌కు 33.47కోట్లు, బర్డ్ ట్రస్ట్‌కు 30.02కోట్లు, ఎస్వీసర్వశ్రేయస్‌ట్రస్ట్‌కు 20.46 కోట్లు, ఎస్వీవేదపరిరక్షణట్రస్ట్‌కు 13.87కోట్లు విరాళాలు అందాయి. ఎస్వీబిసి ట్రస్ట్‌కు 6.29కోట్లు, స్విమ్స్‌కు 1.52కోట్లు, ఇలా విరాళాలను దాతలు విరివిగా అందించారు. దాతలకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించడంలో ఎక్కడా లోపం తలెత్తకుండా చూడాలని టిటిడి అధికారులకు ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

## దీపావళి వేడుకల్లో జగన్ దంపతులు

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరులోని యలహంకలో ఉన్న నివాసంలో ఈ ఏడాది దీపావళి వేడుకలు జరుపుకున్నారు. సరిగ్గా పండుగ రోజు ఉదయమే లండన్ నుంచి బెంగళూరుకు తిరిగి జగన్ వచ్చారు. దీపావళి వేడుకల్లో భార్య వైఎస్ భారతితో కలిసి పాల్గొన్నారు. దీపావళి సందర్భంగా భారీగా అలంకరించిన యలహంక నివాసంలో వైఎస్ జగన్, భారతి మాత్రమే విడిగా దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. బాణాసంచా కాలుస్తూ దట్టంగా అలుముకున్న పొగ మధ్యలో జగన్, భారతి కనిపిస్తున్న ఛాయా చిత్రాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ అభిమానులు సామాజిక మాధ్యమంలో ట్రెండ్ చేసారు.

## తిరుపతి ఎస్వీజూలో వృద్ధాప్యంతో తెల్లపులి మృతి

**తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి శ్రీవేంకటేశ్వరజంతు ప్రదర్శనశాలలో వృద్ధాప్యంతో తెల్లపులి "సమీర్"మృతి చెందింది. సుమారు 19 సంవత్సరాలు వయస్సున్న తెల్లపులి వృద్ధాప్యం ,అనారోగ్యంతో ప్రాణాలు విడచినట్లు జూ అధికారులు తెలిపారు. 2011లో ఐదేళ్ళవయస్సులో హైదరాబాద్ నెహ్రూజూలాజికల్ పార్కునుండి తిరుపతి జంతుప్రదర్శనశాలకు తీసుకువచ్చారు. 14 సంవత్సరాలు తిరుపతి జూలోనే సంరక్షకులతో సన్నిహితంగా ఉండేది. గత మూడునెలలుగా సమీర్ ఆరోగ్యపరిస్థితి మార్పుతో ద్రవ ఆహారంపైనే ఆధారపడింది. సమీర్‌కు ఎస్వీ వెటర్నరీ వైద్యకళాశాల పాథాలాజికల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి పోస్టుమార్టమ్ చేశారు.

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవ ఎన్నిక



**విజయవాడ, అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర నూతన రథ సారథిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ రోజు విజయవాడ దాసరి భవన్ లో జరిగిన సమితి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.సిపిఐ జాతీయ ప్రధాన కార్య దర్శి డి. రాజా జాతీయ కార్యదర్శి రామ కృష్ణ పాండా సమక్షంలో మొదట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 33 మంది నీ వ్యక్తిగతంగా అభిప్రాయ సేకరణ నిర్వహించి మెజార్టీ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర సమితి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ నూతన కార్యదర్శి గా గుజ్జుల ఈశ్వరయ్య ను ప్రతిపాదన చేయగా సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు ప్రతిపాదనను బలపరచగా 102 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

## అంబరాన్ని అంటిన దీపావళి సంబరాలు

**జగ్గయ్యపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** భారతీయ సంప్రదాయాలను పునర్జీవింపజేస్తూ, దుర్మార్గంపై మంచి సాధించిన విజయంగా ప్రమిదలు వెలిగించి దీపోత్సవాలను కన్నుల పండువ చేస్తుండగా ఇళ్ళ వాకిళ్ళముందు బాణాసంచా కాలుస్తూ ప్రజలు దీపావళి వేడుకలను జగ్గయ్యపేట ప్రాంతంలో వైభవంగా నిర్వహించారు.



## పోలీసుల త్యాగం మరువలేనిది

### - తిరుపతి కలెక్టర్, ఎస్పీ

**తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** పోలీస్ సిబ్బంది సమాజ భద్రతకు రక్షణ కవచంలాంటివారని, వారి కుటుంబం, వారి వ్యక్తిగత జీవితం పక్కనపెట్టి ప్రజల రక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. దేశ సేవలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయమన్నారు. ఏడాది కాలంలో తిరుపతి జిల్లాలో విధి నిర్వహణలో 25మంది పోలీసు సిబ్బంది అమరవీరులయ్యారన్నారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం తిరుపతి జిల్లా పోలీసుశాఖ ఏఆర్ మైదానంలో ప్రత్యేక స్థూపం వద్ద తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, వెంకట్రావు, నాగభూషణరావు, విమల కుమారి(ఏసిబి), డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, విశ్రాంత పోలీసు అధికారులు పాల్గొని అమరవీరులకు జోహార్లు జైహింద్ నినాదాలతో నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి, మెమొంటోలతో సన్మానించారు. ఆర్థిక సాయం అందజేశారు.

## గోవుల మృతిపై ఆధారాలతో రండి

### - వైసిపి నేత భూమనకు పోలీసులు నోటీసులు




**తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల మృతిపై చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలతో (రేపు) గురువారం 23వతేదీ ఉదయం హాజరుకావాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు ,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి పోలీసులు నోటీసులిచ్చారు.తిరుపతి యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌కు రేపు ఉదయం 11గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేశారు. గోవుల మృతిపై ఆధారాలు చూపాలన్నారు.

టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈయనపై గతంలో పలు కేసులు నమోదైన నేపధ్యంలో రేపు ఏం జరగనుందనేది వైసిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివి : విజయవాడ సిపి రాజశేఖరబాబు

### - వ్యాస్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్న వైనం



వ్యాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 21,ప్రభాతవార్త** విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేమని,సీనియర్ పోలీస్ కమీషనర్‌గా విధులు నిర్వహించి అమరులైన కెస్ వ్యాస్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని విజయవాడ సిపి రాజశేఖర బాబు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వ్యాస్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం 6వ ఏపిఎస్‌పి బెటాలియన్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన డిసిపిలు కెజి.ఐవి సరిత,ఎస్‌విడిప్రసాద్,ఇతర పోలీసు అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న వ్యాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులను అణచివేయడంలో వ్యాస్ కీలక పాత్ర పోషించారన్నారు. మన ఇళ్ళ ముందు నిత్యం ఏ కష్టం కలిగినా ముందుగా గుర్తొచ్చేది పోలీసు.నిత్యం పోలీసులు చేస్తున్న పోరాటాలు,వీరోచిత సాహస చర్యలను చేస్తుంటారు. వీరందరూ తమ కుటుంబాన్ని వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి దేశం లోని కోట్లాది మంది ప్రజల కోసం ఉద్యోగ నిర్వహణలో వారి జీవితాలను అంకితం చేసి అమరులైన ప్రతి ఒక్కరికీ నివాళు లర్పించడం జరిగిందన్నారు. పోలీసు విధి నిర్వహణలో అమరులైన ప్రతి ఒక్కరినీ స్మరించుకోవడం ఒక భాధ్యత అని తెలియచేశారు.

## పోలీసులు ధైర్యానికి ప్రతీకలు : హోంమంత్రి అనిత



**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీస్ ధైర్యానికి ప్రతీక.విధి నిర్వహణలో అమరలైన వారి కోసం కేవలం ఒక రోజు సంస్మరణ దినం కాదు నిరంతరం వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పోలీసు సంస్మరణ దినోత్సవం అనేది దేశ భద్రతకు,ప్రజా రక్షణకు పోలీస్ వ్యవస్థ చేసిన అపూర్వ త్యాగానికి చిహ్నమైన పవిత్రమైన రోజన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని అత్యంత క్లిష్ట వాతావరణంలో మంచు పర్వతాల మధ్య చైనా దురాక్రమణదారులను ఎదుర్కొని వీరమరణం పొందిన ఆ 10 మంది కేంద్ర సాయుధ పోలీసు అమరవీరుల స్ఫూర్తిని ఈ రోజు మనం గుర్తు చేసుకుంటున్నాం. మన పోలీస్ సోదరసోదరీమణులు ప్రతిజ్ఞ చేసిన రోజునే తమ జీవితాలను దేశానికి అంకితం చేశారు. ప్రతి పౌరుడు నిశ్చింతగా నిద్రపోవడానికి, ప్రతి కుటుంబం సురక్షితంగా జీవించడానికి గల ఏకైక కారణం పోలీస్ ఉన్నారు అనే ఆ భరోసా! ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యతలో భాగంగానే, మీరు కుటుంబ బంధాలకు అతీతంగా, సమాజ శ్రేయస్సునే ప్రథమ కర్తవ్యంగా భావించి నిరంతరం పోరాడుతున్నారు. మీ త్యాగాలు వెలకట్టలేనివి. ఈ సందర్భంగా విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా అమరులైన మరియు రాష్ట్రంలో ఈ ఏడాది నేలకొరిగిన వీరులకు మనమంతా శ్రద్ధాంజలి ఘటిద్దాం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని హామీ


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT SHORT TENDER NOTICE**

| | |
|---|---|
| NIT No. 93/MAU61-USI0HB(BG)/16/2025-HB, Dt.21.10.2025. | APCRDA- H&B (Housing)- "RFP for selection of Service Provider for House Keeping services and Security services for APCRDA project office building at Rayapudi, Amaravati capital city"-Tender Notice-Reg. |
| NIT No. 94/MAU61-USI0HB(BG)/17/2025-HB, Dt.21.10.2025. | APCRDA- H&B (Housing)- "RFP for selection of Service Provider for technical facility management services and IT operations & maintenance services for APCRDA project office building at Rayapudi, Amaravati Capital City."-Tender Notice-Reg. |

The bid can be downloaded on AP e-procurement portal from **22.10.2025 to 29.10.2025** up to **14.00 Hrs.** Pre-Bid Meeting Date **24.10.2025** Due date for submission of Bid **29.10.2025** up to **15.00 Hrs**, Technical bid opening **29.10.2025 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

NIT No. 95/MAU61-USI0US(OTH)/32/2025-IFR, Dt.18.10.2025

**E PROCUREMENT TENDER NOTICE**

**NAME OF WORK:** APCRDA - "RFP for Engagement of Consultant for the Preparation of a Comprehensive Disaster Risk Management & Resilience Plan for **Amaravati Capital City Area, Andhra Pradesh**".

The bid can be downloaded on AP e-procurement portal from **22.10.2025 to 12.11.2025** up to **14.00 Hrs.** Due date for submission of Bid is **12.11.2025** up to **15.00 Hrs**, Technical bid opening **12.11.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త


మంచి పనులు చేసి అపకారం పెంచుకున్న వాడికంటే పాపం చేసి పశ్చాత్తపడ్డ వాడు ముందుగా తరిస్తాడు.

-సిసిరో

# కాలుష్యం కరాళనృత్యం!

టపాసులకు ఢిల్లీ వాతావరణానికీ అసలే పడదని తేలిపోయింది. అంతకుముందు అందరూ అనుకున్నట్లు పంట వ్యర్థాలు కాల్చిన పొగ కాలుష్యానికి తాజాగా టపాసుల కాలుష్యం వచ్చి చేరింది. గత యేడాది దీపావళి నాటి కన్నా ఈసారి ఢిల్లీలో కాలుష్యం కరాళనృత్యం చేసింది. న్యూఢిల్లీలో దీపావళి వేడుకల సందర్భంగా వాయుకాలుష్యం పెరిగిపోయింది. బాణసంచా పేలుళ్లతో వాయు నాణ్యత బాగా తగ్గిపోయింది.దీపావళి మరుసటి రోజున అంటే మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచి ఐక్యూఐ 979గా నమోదైంది. ఈసారి ఢిల్లీ కాలుష్యస్థాయిపై గత అనుభవాల రీత్యా 'గ్రీన్ క్రాకర్స్'కు మాత్రమే సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అయినా కాలుష్య స్థాయిని స్థిరీకరించడం లేదా తగ్గించడం సాధ్యపడలేదు. గత యేడాది పండగ జరిగిన మరునాడు ఈ రీడింగ్ 296 క్యూఐతో పోల్చి చూసుకున్నప్పుడు తాజాగా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అతి ప్రమాదకరస్థాయిని చేరుకుందని కేంద్ర, కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. సోమవారం సాయంత్రానికి ఢిల్లీలో ఏక్యూఐ 345 వద్ద నిలబడి ఉందని సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రిసెర్చ్(సఫర్) వివరించింది.కాగా ఇలాంటి కాలుష్యం వల్ల ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదముందని హెచ్చరించింది కూడా. ఈ గాలిని ఏ మాత్రం పీల్చినా తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకుగురయ్యే అవకాశముంది. గత యేడాది ఇంతకన్నా తక్కువ రీడింగ్‌కే ప్రాణాపాయమున్నట్లు ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ సంస్థలు హెచ్చరించాయి. అయినా అనారోగ్యాల సంఖ్య తక్కువ స్థాయి నమోదై అప్పట్లో ప్రభుత్వాలు ఊపిరి పీల్చుకున్నాయి. కానీ ఈసారి అలా కాదు. టపాసుల వేడుక ఎలాంటి ప్రమాదం తెచ్చిపడుతుందోననే భయంతో సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా జోక్యం చేసుకొంది. గ్రీన్ దీపావళి కోసం చేయదగిన అన్ని సలహాలను, సూచనలనూ ఇచ్చింది. అయినా కాలుష్యం ఏ మాత్రమూ తగ్గలేదు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో సుప్రీంకోర్టు తీర్పు విషయంలో పర్యావరణ ప్రేమికులు కాస్త తత్తర పడ్డారు. కారణం ఢిల్లీవాసులకు టపాసులు కాల్చుకోడానికి మాత్రమే అనుమతినిచ్చింది. పెరిగే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న ఏ ప్రక్షాళన ప్రక్రియ ఢిల్లీ వాసులకు ఊరట కలిగించలేకపోయింది. దీపావళిని కేవలం బాణసంచా కాల్చుకోడానికే పరిమితం చేయరాదని అక్కడి ప్రభుత్వాలు ఎవరున్నా ఘోషిస్తుంటాయి. టపాసుల మీద గత ప్రభుత్వం విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు సడలించి గ్రీన్ కాకర్స్‌ను అనుమతించింది. గతంలోనూ ఇలాంటి సూచనలు సలహాలు ఉన్నప్పటికి ప్రజలు వాటిని పాటించలేకపోయారు. ప్రభుత్వం చతికిలపడిపోయింది. గాలి నాణ్య తను తగ్గించి, వాయుకాలుష్యం పెరిగే విషయంలో గతంలో ఎన్నడూ ప్రభుత్వ ప్రతిపాదిత పథకాలు కానీ కార్య క్రమాలు కానీ పూర్తిగా అమల్లోకి రాలేదు. దాంతో ఢిల్లీకి కాలుష్య బాధలు పెరిగిపోయాయి. దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కోర్టులు కూడా ఆరోగ్యంగా జీవించే హక్కు మాటున టపాసులకు అనుమతినివ్వడం మంచిదే. అయి నప్పటికీ ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే అయింది.తమ అనుభవంలోకి వచ్చేసరికి న్యాయకోవిదులకు సైతం కళ్లు తేలవేసే ప్రమాదం ఏర్పడింది. పర్యావరణ పరిరక్షణ,ప్రజా రోగ్యం ఈ రెండూ ఏ సమాజానికైనా ముఖ్యమే. ఈ నేపథ్యంలోనే ఈయేడాది అక్టోబరు 15న సుప్రీంకోర్టు తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే 'గ్రీన్ క్రాకర్స్'ను కాల్చుకో వచ్చని ఆదేశించింది. సాధారణ టపాసులతో పోలిస్తే గ్రీన్ క్రాకర్స్ 30 శాతం నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీ రింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసింది. వీటిలో అల్యూమినియం, బేరియం వంటి హానికర రసాయనాలు అతి తక్కువగా ఉంటాయి. కనుక ఢిల్లీ కాలుష్యానికి అడ్డుకట్ట వేయగలవని అందరూ భావించారు. ఇదే నమ్మకం తో అధికారుల అంచనాలతో ధర్మాసనం 'గ్రీన్ క్రాకర్స్'ను అనుమతించింది. హానికర రసాయనాలు తక్కువగా ఉండే గ్రీన్ క్రాకర్స్‌ను సుప్రీంకోర్టు అనుమతించి ఉండకపోతే సోమవారం నాటి రాత్రి బాణాసంచా పేలుళ్ల ప్రభావంతో ఎంతమంది ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యే వారో తలచుకుంటేనే ఆందోళన వ్యక్తమవుతోంది. టపాసుల కాల్చేందుకు నిర్దిష్ట సమయాలను కూడా సుప్రీంకోర్టు నిర్దేశించింది. సాధారణ అపాయకర క్రాకర్స్ స్థానే తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే 'గ్రీన్ క్రాకర్స్'నే వాడాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలయ్యే విషయంలో ప్రభుత్వ శాఖల వైఫ ల్యం ఉండటం వల్లనే పూర్తిస్థాయి ఫలితం దక్కలేదన్నది విమర్శ. తమ చుట్టూ ముంచుకొచ్చే కాలుష్య పొగలను తట్టుకునేందుకైనా ఢిల్లీ ప్రజలు గ్రీన్ క్రాకర్స్‌ను వినియోగించి ఉండాల్సిందే. వారే సహకరించకపోతే ఏ రీతిన ఢిల్లీ వాసులు కాలుష్య రహిత జీవనం సాగించగలరో ఆలోచించుకోవాలి. ఢిల్లీకి దరిదాపుల్లో ఉన్న పొరుగు రాష్ట్రాలలో పంట వ్యర్థాలను తగులబెట్టే అలవాటే ఆ ప్రాంతాన్ని కాలుష్యంతో ముంచెత్తుతోంది. ప్రస్తుతం పంట వ్యర్థాలను తగులబెట్టే సమయం కూడా కాదు. దీపావళి బాణసంచాపై నిషేధాలున్నా లేకున్నా ఢిల్లీలో కాలుష్యం బాగా పెరిగిపోయింది. పట్టపగలు కూడా ఇల్లు విడిచి బయటకు రాలేని పరిస్థితికి గాలి నాణ్యత దిగజారిపోయింది. తాజాగా ఢిల్లీలో కాలుష్యస్థాయి ఎక్యూఐ 979ఉంది. కోల్‌కత్తాలో కూడా కాలుష్య సూచిక ఎక్యూఐ 350 ఉంది. కాలుష్యం తగ్గించడానికి ఎన్ని చర్యలు తీసుకున్నా ఉపశమనం లభించలేదంటే ఏం చేయాలో అంతర్జాతీయ నిపుణుల సహాయం తీసుకోవాల్సిందే.

పుస్తకం విలువ దాని ఖరీదుతో వెలకట్టకండి. ఆ పుస్తకం ఇచ్చే అపార విజ్ఞానంతో వెలకట్టండి.



ఆస్కార్‌వైల్డ్

ప్రపంచాన్ని జయించిన వాడి కంటే తన మనస్సును జయించినవాడు వీరుడు, ధైర్యవంతుడు.



థామస్ ఫుల్లర్

# భారత్, చైనాల మైత్రి ప్రపంచాభివృద్ధి కోసమే

***25వ యస్.సి.ఓ (సింఘై కోపరేషన్ ఆర్గనైజేషన్) టిన్‌జిన్‌లో జిన్‌పింగ్ మోడీ సమావేశం గ్లోబల్ శాంతిస్థాపనకు, బహుముఖాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ సమ్మిట్‌లో గ్లోబల్ గవర్నన్స్ ఇనిషియేటివ్ (జిజిఐ) ప్రత్యేకస్థానం వహిస్తుంది. జిన్‌పింగ్ ప్రతిపాదించిన అయిదు సూత్రాలు మార్గదర్శకంగా ఉన్నాయి. సార్వభౌమాధికార సమానత్వం, ఇంటర్నేషనల్ రూల్ ఆఫ్ లా పాటించడం, బహుళపక్ష వాదం, ప్రజలను కేంద్రీకరించే ఏ విధానమైనా,నిజమైన ఫలితాలు రాబట్టాలి. జిజిఐ ప్రజల బాగుకోసం జిన్‌పింగ్ ప్రతిపాదించడం హర్షణీయం. మోడీ బలపర్చటం ఈ ప్రతిపాదనలకు మరింత ఊతానిచ్చింది. యస్.సి.ఓ, బ్రిక్స్ కీలక సభ్యులుగా చైనా, భారత్ గ్లోబల్ గవర్నెన్స్ కోసం శ్రమించాలి. అంతేగాదు అన్ని ప్రతిపాదనలు దేశాల స్థాయిలో ఆలోచించేలా చేయగలుగుతే భారత్, చైనా ఇతర దేశాల అభివృద్ధితోపాటు శాంతి స్థాపనకు కృషి చేసినవారవుతారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇతోధిక ప్రోత్సాహం అందించాలి. ప్రపంచపాలన సరైన దిశలో నడిచే విధంగా ఈ రెండు దేశాలు మరింత కృషి చేస్తే ప్రపంచశాంతికి అభివృద్ధికి తోడ్పడినట్లు అవుతుంది.***



రావులపాటి సీతారాం రావు

భారత్, చైనాల మైత్రి మీద ప్రపంచ శాంతి ఆధారపడి ఉందని ఒక విజ్ఞుడు అన్న మాటల్లోని నిజం తరచి తరచి చూడాల్సిన అవసరం లేదు. కొన్ని దశాబ్దాల కిందట రష్యా, అమెరికాల వైఖరిని అనుసరించే దేశాల్లో శాంతి, సుస్థిరత భాసిల్లుతుందని అనేవారు. ఆ చైనా, భారత్‌లు ఆ స్థాయిలో ఇప్పుడు నాయకత్వ దశకు చేరుకున్నాయన్న ఆలోచనను కొట్టిపడేయొద్దు. ఇప్పటికి చైనా భారత్‌ల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి డెబ్భైఐదేళ్లు నిండాయి. 1950 సంవత్సరం నుంచి ఏర్పడిన ఈ సంబంధం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. భాయీ-భాయీగా మెలగాలనుకున్న ఈ దేశాల నాయకులు విడిపోతూ, కలుస్తూనే ఉన్నారు. ఘర్షణలు పడ్డారు. అభివృద్ధిలో పోటీపడ్డారు. దౌత్య సంబంధాలు పూర్తిగా సత్సంబంధాల దిశగా అడుగులు వేయకపోయినా తొందరపడి తెగ తెంపులు చేసుకోలేదు. అవసరాన్ని బట్టి ఒకరు కోపాన్ని ప్రదర్శిస్తే మరొకరు తగ్గే విధంగా ప్రవర్తించారు. కుటుంబంలోని సోదరుల మాదిరే నడుచుకున్నారు. అంతమాత్రాన చైనా,భారత్ అక్కరకు వస్తుందని గట్టిగా ఎవరూ చెప్పలేరు. చైనా కోసం భారత్ ఇతర దేశాలతో స్నేహం తెంపుకోదు. చైనాను కాదని ఇతర దేశాలను దగ్గరకు తీయదు. దౌత్య సంబంధాలు నిర్వచించటం కష్టం. ఒక త్రాసులో దేశాల విలువలను తూచేందుకు తూనిక రాళ్లను ఎవరూ కనిపెట్టలేదు. 'వరల్డ్ ఈజ్ స్మాల్' అన్న నానుడి ఊరికనే ప్రాచుర్యం పొందలేదు. చిన్న దేశాన్ని పెద్ద దేశం పక్కన పడేసి పెద్ద దేశానికే పెద్దపీట వేసే స్థితిలో అంతర్జాతీయ వ్యవహారాలు లేవు. ఎవరి దారి వారిదే కానీ అంత మాత్రాన వారి దారులు కలవవని ఎవరూ బల్లగుద్ది చెప్పలేదు. ఈ మధ్య కాలంలో చైనా ప్రసిడెంట్ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోడీ ( 2014-2024) 18 సార్లు కలిశారు. 2014 సంవత్సరాన్ని చైనా, ఇండియా ఫ్రెండ్‌షిప్ సంవత్సరంగా ప్రకటించారు. అందుకనే జిన్‌పింగ్ అధికారికంగా భారత్‌లోని అహమ్మదాబాద్‌ను అంటే ప్రధాని స్వంత రాష్ట్రాన్ని సందర్శించి మరింత దగ్గరగా స్నేహసంబంధాలను పెంపొందించుకుంటామని ప్రకటించారు. మోడీ కూడా 2015లో చైనాను మొదటి సారిగా జిన్‌పింగ్ సొంత రాష్ట్రంలోనే చైనా పర్యటన మొదలు పెట్టారు. ఇన్నిసార్లు కలిసినా, ఇద్దరు నాయకులు 2024లో 16వ బ్రిక్స్ సమ్మిట్ సందర్భంగా కజాన్‌లో ప్రత్యేకంగా విడిగా కలుసుకొని ఇరు దేశాల స్నేహసంబంధాలను మరింత దృఢతరం చేసుకోవాలని మాట్లాడుకున్నారు. ఇన్నిసార్లు కలుసుకొని మాట్లాడుకున్నంత మాత్రాన, విభేదాలు తొలిగిపోతాయని, విద్వేషాలు రగులుకోవని భావించటం పొరపాటే. కానీ ఇలా కలుసుకోవటం ఒకరినొకరు అర్థం చేసుకొనే ప్రయత్నం చేయడం సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు విద్వేషాలను తొలగించుకొనేందుకే! ఇది తెలుసుకోవాల్సిన అవసరం పాకిస్థాన్, అమెరికా లాంటి దేశాలకు ఉన్నది. జాగ్రత్తపడే



దేశాలు ఈ దేశాల వైఖరిని చూసి వాస్తవికతను దౌత్యపరంగా అర్థం చేసుకొని మార్పులూ, చేర్పులకు చోటిచ్చే ప్రయత్నం చేయొచ్చు. ఈ సందర్భంగా యు.ఎన్.ఓ పాత్ర గమనార్హం. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ఏర్పడి 80 సంవత్సరాలయింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలతో యావత్తు ప్రపంచానికి సంభవించిన నష్టాలను అధిగమించి, ఫాసిస్ట్ చర్యలకు చరమగీతం పాడేందుకు ఏర్పడ్డ వ్యవస్థ ముఖ్యోద్దేశం ప్రపంచ శాంతితోపాటు అభివృద్ధిని సాధించడం. ఆ లక్ష్యంతో ఏర్పడ్డ ఈ సంస్థ మీద ఎన్నో ఆశలున్నాయి. కొన్నిసార్లు ఆ ఆశలు అడియాసలైనా దేశాల మధ్య ఏర్పడ ఘర్షణలను యుద్ధాలను నివారించడానికి, నిర్మూలించడానికి మధ్యవర్తిత్వం వహించే దిశగా చాలాసార్లు విజయాన్ని తాత్కాలికంగా అయినా సాధించగలిగింది. ఈ మధ్యకాలంలో అమెరికా ఐ.ఎమ్.ఎఫ్ లాంటి అనుబంధ వ్యవస్థలు బలహీనపడుతున్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. సెక్యూరిటీ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన దేశాలు వీటో ఆయుధాన్ని అడ్డగోలుగా వాడుతూ అసలుకేమోసాన్ని తలపెట్టడం యు.ఎన్.ఓను దెబ్బతీస్తున్నది. అగ్రదేశాలు యు.యన్.ఓను బలహీనపర్చటాన్ని వ్యతిరేకించి గట్టి చర్యలు తలపెట్టకపోతే ప్రపంచ శాంతి అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమవుతాయి. ఏకపక్షవాదం (యూనిలేటరలిజం) నుంచి (మల్టీ లేటరలిజం) బహుపక్షవాదం దిశగా అందుకే అడుగులు పడుతున్నాయి. కొందరు సభ్యులకు విటో పవర్, మారిన పరిస్థితుల్లో ధారాదత్తం చేయడం ఎంత మాత్రం సమంజసంగా లేదు. సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యత్వం విషయంలో సమగ్ర మార్పులు అవసరమనిపిస్తుంది. అన్ని దేశాలు సమానం అన్న సిద్ధాంత ప్రాతిపదిక మీద సెక్యూరిటీ కౌన్సిల్ విధానపర నిర్ణయాలను దృష్టిలో ఉంచుకొని శాంతి అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకోవాలి. అగ్రదేశాల నాయకత్వం, యు.ఎన్.ఓ వ్యవస్థను బలోపేతం చేయాలి. నిర్వీర్యం చేయకూడదు. ప్రస్తుతం కొన్ని దేశాల మధ్య ఘర్షణలూ, యుద్ధాల విషయాలలో నిర్ణయాలు పక్షపాతరహితంగా ఉండటం లేదన్న విమర్శ వినపడుతున్నది. కంటితుడుపు చర్యలతో యుయన్ఓ లక్ష్యాలు నెరవేరవు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్- పాలస్తీనా, పాకిస్థాన్- అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్- ఇండియాల మధ్య సరిహద్దు తగాదాలతో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న కాశ్మీర్ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయలేకపోతున్నది. పహల్గాం సంఘటన తర్వాత తీసుకున్నచర్యలు తీవ్రంగాలేవు. ముఖ్యంగా టెర్రరిజం అణచివేత విధానంలో స్పష్టతను దేశాలకు ఇవ్వలేకపోతున్నది. చైనా, భారత్ దేశాలు ప్రస్తుత పరిస్థితులలో బహుళపక్ష వాదంతో శాంతి, అభివృద్ధి సాధించడం కోసం ముందడుగు వేయాలి. 25వ యస్.సి.ఓ (సింఘై కోపరేషన్ ఆర్గనైజేషన్) టిన్‌జిన్‌లో జిన్‌పింగ్ మోడీ సమావేశం గ్లోబల్ శాంతిస్థాపనకు, బహుముఖాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ సమ్మిట్‌లో గ్లోబల్ గవర్నన్స్ ఇనీషియేటివ్ (జిజిఐ) ప్రత్యేకస్థానం వహిస్తుంది. జిన్‌పింగ్ ప్రతిపాదించిన అయిదు సూత్రాలు మార్గదర్శకంగా ఉన్నాయి. సార్వభౌమాధికార సమానత్వం, ఇంటర్నేషనల్ రూల్ ఆఫ్ లా పాటించడం,బహుళపక్ష వాదం, ప్రజలను కేంద్రీ కరించే ఏ విధానమైనా,నిజమైన ఫలితాలు రాబట్టాలి.జిజిఐ ప్రజల బాగుకోసం జిన్‌పింగ్ ప్రతిపాదించడం హర్షణీయం. మోడీ బలపర్చటం ఈ ప్రతిపాదనలకు మరింత ఊతానిచ్చింది. యస్.సి.ఓ, బ్రిక్స్ కీలక సభ్యులుగా చైనా, భారత్ గ్లోబల్ గవర్నెన్స్ కోసం శ్రమించాలి. అంతేగాదు అన్ని ప్రతిపాదనలు దేశాల స్థాయిలో ఆలోచించేలా చేయగలుగుతే భారత్, చైనా ఇతర దేశాల అభివృద్ధితోపాటుశాంతి స్థాపనకు కృషి చేసినవారవుతారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇతోధిక ప్రోత్సాహం అందించాలి. ప్రపంచపాలన సరైన దిశలో నడిచే విధంగా ఈ రెండు దేశాలు మరింత కృషి చేస్తే ప్రపంచశాంతికి అభివృద్ధికి తోడ్పడినట్లు అవుతుంది. •

# ప్రశ్నార్థకంగా మారిన మహిళల భద్రత!

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్య కాలంలో కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు ఈ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా నిలుస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇటీవల కాలంలో మహిళలపై జరుగుతున్న అమానుష దుర్ఘటనలు, లైంగిక వేధింపులు చూస్తూవుంటే కేంద్ర,రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రత ఇక ప్రశ్నార్థకమేనా అనే అనుమానం పెనుభూతమై మన హృదయాల్ని తీవ్రంగా కలిచి వేయకమానదు. ఎందుకంటే ఈ రోజుల్లో ఏ పేపర్ తిరిగేసిన ఏదో ఒక మూలన మహిళలపై, అభం, శుభం తెలియని చిన్నారులపై జరుగుతున్న దారుణాలకు సంబంధించిన వార్తలే మనకు తరచుగా కళ్లకు కడుతూ ఉంటాయి. దర్శనం ఇస్తూ ఉంటాయి. మన జాతి పిత, అహింసవాది గాంధీ మహాత్ముడు సెలవిచ్చినట్లుగా అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా స్వేచ్ఛగా తిరుగాడినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యంలభించినట్లు. అయితే ఎందరో మన స్వాతంత్ర్య సమరయోధులు తమ తమ ప్రాణత్యాగాలతో, ఎనలేని దేశభక్తితో మనకు బ్రిటిష్ వారి దాస్య శృంఖలాల నుంచి బంధవిముక్తులు గావించి స్వేచ్ఛ స్వాంతంత్ర్యాలు లభించేటట్లు చేసి నేటికి దాదాపు 78 వసంతాలు కావస్తున్నప్పటికీ ముఖ్యంగా ఇంకను మహిళలకు భద్రత అనేది గగన కుసుమంగా పరిణమించడం అత్యంత దిగ్భ్రాంతికరం, ఆందోళనకరమైన విషయం. కేంద్ర ప్రభుత్వం వారు మహిళల భద్రత కోసమని ఎన్ని కఠిన, దిశ చట్టాల వంటివి తీసుకువచ్చినా మహిళలపై జరుగుతున్న అత్యాచారాల పరంపర నిరంతరం కొనసాగుతుండటం ముఖ్యంగా ఆడపిల్లలు గల ప్రతి ఒక్క తల్లిదండ్రులలో అత్యంత తీవ్రస్థాయిలో భయాందోళన రేకెత్తించే విషయం అనే మాట సత్యదూరం కాదు. పోలీస్, న్యాయవ్యవస్థ వారు మహిళలపై జరుగుతున్న ఇలాంటి అరాచకాలు,దౌర్జన్యలకు అడ్డుకట్ట వేసేందుకు తమ శక్తి వంచన లేకుండా అవిరళ కృషి చేస్తున్నప్పటికీ, మహిళల జీవితాలతో ఆటలాడుకుంటున్న





మానవ మృగాలను చాలా తీవ్రస్థాయిలో కఠినంగా శిక్షిస్తున్నప్పటికీ అవి బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోతుండటం అత్యంత దురదృష్టకరం. ఏది ఏమైన కేవలం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, పోలీసుశాఖ, న్యాయవ్యవస్థ వారే కాకుండా ప్రతి ఒక్క మానవతావాదులు, మానవహక్కుల సంఘాల వారు, మహిళల భద్రతను కోరుకునే ప్రతిఒక్కరూ కూడా మహిళలపై జరుగుతున్న ఇలాంటి అమానుష అత్యాచారాలు, లైంగిక దాడులను నియంత్రించే విషయంలోతమవంతుగా భాగస్వాములై మహిళల మాన, ప్రాణాలకు ఒక రక్షణ కవచంలా నిలబడి తీరాలి. అంతేగాకుండా గ్రామ, గ్రామాన, నగరాలలోని వీధి వీధిన మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చాలా తీవ్రస్థాయిలో ఉద్యమించేలా మహిళ అభ్యున్నతి కోరే సంఘాలు ఏర్పడితే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, దౌర్జన్యాలకు, అరాచకాలకు కొంతలో కొంతైన అడ్డుకట్ట వేయవచ్చు. ఏమైనా రానున్న రోజుల్లోనైనా కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ చేకూరి,వారిలో నెలకొన్న అభద్రతాభావం తెరమరుగై వారి జీవితాలు సుఖ, శాంతి, సంతోషాలతో వర్ధిల్లాలని యావత్తు భారత దేశ ప్రజానీకం మనసా,వాచ కర్మణా కోరుకుందాం. అలాగే యావత్తు మహిళలోకం ఐకమత్యమే మహాబలం అనే మన పెద్దల నీతి సామెతకు లోబడి అత్యంత ధైర్య సాహసాలతో ఆనాటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సాహస నారిమణీ, వీరనారి అయిన ఝన్సీలక్ష్మీ బాయ్‌లా ముందుకు దూసుకెళ్లి ఈ సమాజంలో తమపై జరుగుతున్న దారుణ అకృత్యాలను పూర్తి స్థాయిలో నియంత్రించేలా,రక్షణ చేకూరేలా చేయమని ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై,పోలీసు,న్యాయ వ్యవస్థపై రాష్ట్ర మహిళా లోకం యావత్తు ఒకే త్రాటిపై నిలిచి చాలా తీవ్రస్థాయిలో వారిపై ఒత్తిడి తీసుకువచ్చి తమ హక్కులను కాపాడుకోవాలి.వాటి అమలుకు అత్యంత చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలి. జయ జయహో మహిళాలోకం, వారి హక్కులు మరో పది కాలాల పాటు వర్ధిల్లాలి. వారు తమ ఉనికిని చాలా గొప్పగా చాటాలి! •

# ప్రజావాక్కు



## మావోయిస్టు అగ్రనేతల కొత్త మార్గం

ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతలు అడవులను వీడి సాధారణ జనజీవన స్రవంతిలోకి అడుగుపెడుతున్నారు.ఏళ్లతరబడి ఆయుధ పోరాటం, రహస్య జీవనం, పోలీసు ఎదుర్కొళ్లతో గడిపినవారు ఇప్పుడు శాంతియుత మార్గంలో ప్రజలతో కలిసిపోవాలని నిర్ణయించుకోవడం ఒక సానుకూల పరిణామం. ఇది ప్రభుత్వం చేపడుతున్న పునరావాస విధానాలు, సంభాషణ ప్రయత్నాల ఫలితమని చెప్పవచ్చు. గతంలో ఆలోచనా వాదాల కోసం అడవుల్లోకి వెళ్లిన వీరు, ఇప్పుడు ఆ ఆలోచనలను ప్రజా ప్రగతికిఉపయోగించాలనే దిశగా మారుతున్నారు. విద్య, ఉపాధి, కుటుంబ జీవితం పట్ల ఆకర్షితులవడం, తమ పిల్లల భవిష్యత్తు కోసం శాంతి మార్గం ఎంచుకోవడం కూడా ప్రధాన కారణాలు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## శిథిలావస్థకు చేరువలో విద్యా కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలోని మండలాలలో మండల విద్యా వనరుల కేంద్రాలు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. అనేక మండల విద్యావనుల కేంద్రంలలో పై భాగములు పెచ్చులుఊడి సలాకులు సైతంబహిర్గతం కావడం వల్ల నిత్యం మండల విద్యావనాల కేంద్రానికి వచ్చే ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యా వనరుల కేంద్రాలు ఎప్పుడు కూలిపోతుందో అనేటువంటి ఆందోళనల మధ్య మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పని చేస్తున్నారు. వివిధ మండలంలో అనేక ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## కాలుష్యానికి కారణాలు వెతకాలి

దేశంలో జరుగుతున్న వాయు, ధ్వని, జల కాలుష్యానికి కారణాలు వెతకాలి. అందుకు ప్రభుత్వం నివారణా చర్యలు తీసుకోవాలి. దేశ రాజధాని ఢిల్లీలో వాయు శబ్ద కాలుష్యాలు అధికంగా నమోదు అవుతుండడం విచారకరం. ఢిల్లీతో పాటు దేశంలో అతిపెద్ద నగరాల్లో కూడా వాయు శబ్ద,జల,కాలుష్యాలు జరుగుతున్నాయి. కాలుష్యం ముఖ్యంగా మోటారు వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వంట చెరుకు కాల్చడం వల్ల జరుగుతుంది.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

ఇప్పుడు మన జీవితంలో ప్రతి పని ఆన్‌లైన్ ద్వారా జరుగుతోంది. డబ్బుబదిలీ,షాపింగ్,బిల్లులచెల్లింపు, సామాజిక మాధ్యమాల వాడకం. ఈఅవకాశాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు మన వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం,పాస్‌వర్డ్,ఓటీపీలు తెలుసుకొని మోసాలు చేస్తారు. వీరు ఫిషింగ్ లింకులు, ఫేక్ కాల్స్, సోషల్ మీడియా ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వంటి మార్గాల ద్వారా మనల్ని మోసం చేస్తారు. ప్రజలు జాగ్రత్తగా ఉండడం అత్యవసరం. ఎవరైనా బ్యాంక్ నుండి కాల్ చేశామని చెప్పి ఓటీపీ అడిగితే ఇవ్వకూడదు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదు. పాస్‌వర్డ్‌లు తరచూ మార్చడం, భద్రమైన వెబ్‌సైట్లు మాత్రమే వాడడం మంచిది. ప్రభుత్వం, పోలీసులు కూడా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలందరూ సైబర్ భద్రతపై చైతన్యంగా ఉండాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## భద్రతా వ్యవస్థల వైఫల్యం

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా బస్సుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలు ప్రజలను తీవ్రఆందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డు ప్రయాణాల్లో అత్యంత సురక్షితంగా భావించిన బస్సు ప్రయాణం, క్షణాల్లోనే మృత్యుశాలగా మారిపోవడం మన భద్రతా వ్యవస్థల వైఫల్యాన్ని బట్టబయలు చేస్తోంది. సాంకేతిక లోపాలు, నిర్లక్ష్యం, లాభదాహంతో చేసిన అనధికార మార్పులు, ఇవన్నీ కలసి ప్రాణాంతక దుర్ఘటనలకు దారితీస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన ఘోరఅగ్నిప్రమాదం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అక్టోబర్ 2025లో జరిగిన ఈ దుర్ఘటనలో 21మంది సజీవదహనమయ్యారు. దర్యాప్తులో తేలిన వివరాలు మరింత భయానకంగా ఉన్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పరీక్ష విధానాల్లో లోపాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత విప్లవాత్మకమైన మార్పు, తరతరాలుగా ఉన్న నల్లబల్లశుద్ధ ముక్కకు బదులుగా అండ్ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం, వాటికి ఇరువైపులా గ్రీన్‌బోర్డులు ప్రొవైడ్ చేయడం,ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేస్తూ అవసరమైన విద్యార్థులకు ట్యాబ్స్ డిక్షనరీస్ ప్రొవైడ్ చేస్తూ పాఠాలు చెప్పించడం. అయితే పాఠ్య పుస్తకాలు పరీక్ష విధానాల్లో ఇంకా లోపాలున్నాయి.

- వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

# ఉద్యోగ కల్పనతోనే ఆర్థిక వృద్ధి సాధ్యం!



డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

అధికారం చేపట్టక ముందు ఎన్నికల ప్రచారంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని ప్రధానిగా మోడీ గద్దెనెక్కినారు. ఇప్పుడు 11 ఏళ్ల తర్వాత నిరుద్యోగ సమస్యపై దృష్టి పెట్టి జాతీయ కార్మిక ఉద్యోగ విధానం శ్రమశక్తి నీతి 2025 పథకం ముసాయిదాయను రూపొందించడానికి నిర్ణయించాలంటే అధికారంలో ఉన్న ఈ 11 సంవత్సరాలు నిరుద్యోగం గురించి పట్టించుకోలేదా ?నేపాల్‌లో యువత తిరుగుబాటును చూసి నిరుద్యోగ సమస్య గుర్తొచ్చిందా? 2014లో నిరుద్యోగ రేటు 4.7 శాతంకాగా నేడు 6.1 శాతానికి పెరిగింది. 2014లో 89 మంది మాత్రమే ఉన్న డాలర్ బిలియనీయర్లు 2025 నాటికి 358 మంది మనదేశంలో పెరిగారు. ఈ బడా కార్పొరేట్లు ఉద్యోగాలు కల్పించలేదా? ఉద్యోగాలు కల్పించకనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎలామారింది. జిడిపి పరంగానా ? ఈ సంపద బిలియనీర్ల చేతుల్లో మాత్రమే ఉన్నదా? అంటే సంపద కేంద్రీకరణ జరిగిందా? పేద మధ్యతరగతి ప్రజలకు ఈ పెరిగిన జీడీపీ అందక ఉద్యోగాలు లేక కడు పేదరికంలో ఉన్నారు. బడా పారిశ్రామిక సంస్థలకు కారు చౌకగా ప్రకృతి వనరులను ధారదత్తం చేస్తున్నది ఎందుకు? వారికి రుణమాఫీలు, రాయితీలు ఇచ్చి ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచి పేదరికం నిరుద్యోగం పెరిగే విధంగా చేస్తున్న మన పాలకులకు అప్పుడప్పుడు నిరుద్యోగం గుర్తొస్తుంది. నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన తర్వాత అభివృద్ధి పేరు తో మన ప్రభుత్వాలు అధికారికంగా ప్రజల భూములను కార్పొరేట్లకు అప్పగించడం జరుగుతున్నది. పరిశ్రమలు పెడితే స్థానికులకు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని ప్రజలను మభ్యపెడుతూ వేలకువేల ఎకరాలు కార్పొరేట్లకు అప్పగించడం పరిపాటిగా మారింది. మన ప్రధానమంత్రులు ముఖ్యమంత్రులు పేర్లకన్నా మన కార్పొరేట్ల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కార్పొరేట్ల వల్ల ఎన్నిఉద్యోగాలు వచ్చాయోగాని ఎన్ని లక్షల ఎకరాల భూములను తీరాలను సముద్రాలను చివరకు ఆకాశాన్ని కూడా వారికి ఏ మేరకు అప్పగించారు ప్రజలకు తెలుసు. పరిశ్రమల పేరిటకార్పొరేట్లకు అప్పగించిన భూములతోనే ఉపాధి కల్పన జరిగిఉంటే ఈ దేశంలో నిరుద్యోగం సమస్య ఉండేది కాదు. మనదేశంలో జిడిపి పెరుగుతున్నది బిలియనీర్లు పెరుగుతున్నారు. బిలియనీర్ల పెరుగుదలకు జిడిపి పెరుగుదలకు సంబంధం ఉంటుందే గాని నిరుద్యోగ నిర్మూలనకు సంబంధంలేదని మన పాలకులకు తెలియదా?మనదేశంలో స్థూల జాతీయోత్పత్తి( జిడిపి)



పెరుగుదల అందరినీ కలుపుకొని పోయేవిధంగా సమ్మిళిత వృద్ధిగా జరగక నేడు దేశంలో 50 శాతం జనాభా ఈ జిడిపి పెరుగుదలకు దూరంగా ఉన్నారని అందరికీ తెలిసిన మన పాలకులు దీనిని పట్టించుకోక ఎంతసేపు జిడిపి పెరుగుదలనే కొలమానంగా భావించి దేశ ఆర్థిక అభివృద్ధి జరిగిపోతున్నదని భావిస్తున్నారు. జిడిపి పెరుగుదలతో ఉద్యోగ కల్పన గాని ప్రజల ఆదాయాలు పెరగడంగాని ప్రజా శ్రేయస్సు పెంపొందించడంగాని నామ మాత్రంగా ఉన్నాయని అందరికీ తెలిసిన విషయమే.1980-1990 మధ్యకాలంలో పెరుగుతున్న జీడీపీ రేట్లు ప్రతి ఒక్క పాయింట్ పెరిగిన శాతానికి రెండు లక్షల ఉద్యోగాలు సంఘటిత రంగంలో పెరిగాయని ఆనాడు భారత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియజేసింది.సంఘటిత రంగంలో అనగా ప్రభుత్వప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లెక్కలు అంచనా వేసింది 1980లో 14 శాతం జీడీపీ పెరిగితే తద్వారా 28 లక్షల ఉద్యోగాలు రాగా తర్వాత 1990-2000 మధ్యకాలంలో ఉద్యోగాల పెరుగుదల రేటు జీడీపీ పెరుగుదల రేటుకు సగానికి పడిపోయింది.2000-2010 మధ్యకాలంలో ఒక శాతం జీడీపీ పెరుగుదల రేటుకు 52,000 కొత్త ఉద్యోగాలు మాత్రమే వచ్చినాయి. ఇలా వరుసగా సగానికి సగం ఉద్యోగాలు పెరుగుదల రేటు తగ్గిపోతున్నది. కాబట్టిపెరుగుదల రేటు ప్రజాశ్రేయస్సు సూచిక కాదు. ఆ తర్వాత ఎందుకో ఆర్బిఐ ఉద్యోగ పెరుగుదల రేటు అంచనా వేయడం మానేసింది. భారత్‌ను బహిరంగ ఆర్థిక వ్యవస్థగా ఓపెన్ ఎకానమీగా విదేశీ పెట్టుబడిదారులకు తలుపులు తెరిచారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ సి రంగరాజన్ దేశంలో జరుగుతున్న జీడీపీ వృద్ధి రేటును లోతుగా విస్తృతంగా తర్కించి ఏడాదికి 6.5 శాతంగా ఉన్నదని నిర్ణయానికి వచ్చినారు. ఈ వృద్ధిరేటు సహితికంగా అధిక స్థాయిలో ఉన్నదని రంగరాజన్ చెప్పుతూనే ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ఈవృద్ధి రేటు సరిపోదని ఇంకా వృద్ధిరేటు అధికంగా జరగాలని భావించినారు.ఈ వృద్ధిరేటు వలన మన దేశం దిగువ మధ్యతరగతి ఆదాయ ఆర్థిక వ్యవస్థగానే ఉందనే తెలుస్తున్నది. ఇలా ఆర్థిక శాస్త్రవేత్తలు పాలకులు నిరుద్యోగ పెరుగుదల రేటును పరిగణలోకి తీసుకోకుండా వృద్ధి రేటును మాత్రమే దేశాభివృద్ధి సూచికగా పరిగణిస్తున్నారు. సెంటర్ ఫర్ ఇండియన్ ఎకానమీ ప్రకారం 2024సంవత్సరాల వయసు వారిలో 63శాతం నిరుద్యోగులు ఉన్నారు. యువతలో ప్రతి పదిమందిలోఆరుగురు నిరుద్యోగులు. సెప్టెంబర్ 2021లో 15-19 వయసు వాళ్లలో 67.21 శాతం 20-24 సంవత్సరాల వారిలో 46.28 శాతం 25-29 వయసు వాళ్లలో 13.24 నిరుద్యోగులు ఉన్నారు. దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉంటుంది అనేది తెలిసిందే.జనాభాలో యువత శాతం పెరగడంయువశక్తి పెరుగుదలకు చిహ్నం.ఆర్థికాభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేది దేశాన్ని ముందుకు నడిపించేదివారే.అటువంటిది వారే నిరాశనిస్పృహలతో పనిపాట లేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? 2010-2020 మధ్యకాలంలో ఉద్యోగావకాశాలు ఇంకా తగ్గిపోయాయి.మూలధన సాంద్రత పద్ధతుల ద్వారా ఉత్పత్తులు గణనీయంగా పెరిగి తద్వారా జీడీపీ గణనీయంగా పెరుగుతుంది.ఉపాధిఅవకాశాలుమాత్రం పెరగడంలేదనేది అక్షరసత్యం.యువతను ఉత్పత్తి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసుకొని తద్వారావారికి ఉపాధి కల్పించి మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారాలి.ఆదిశగా జాతీయ కార్మిక ఉద్యోగవిధానం పథకం రూపొందించుకోవాలి. •

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి ..

## దేశప్రజలకు ప్రధాని మోడీ లేఖ!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలను ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే ఇందుకు ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి.మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం. దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జిఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జిఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు.

# వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

## - బీహార్ సిఎం నితీశ్‌కుమార్ హామీ



**పాట్నా, అక్టోబరు 21:** బీహార్‌లో మళ్లీ ఎన్‌డియే విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ముజఫర్‌పూర్ జిల్లాలోని మినాపూర్‌లో ఎన్నికల బహిరంగ సభలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ, రానున్న ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు. 50 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మొత్తంగా వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాల కల్పిస్తామని నితీశ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఇరవై ఏళ్లుగా తమ ప్రభుత్వం నిరంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశాం. విద్య నుంచి శాంతిభద్రతల వరకు ఎంతో చేశాం. తాము అందరికోసం పనిచేశాం. ఇప్పుడు ఆ ఆటవిక పాలన నుంచి పూర్తిగా స్వేచ్ఛగా బయటపడ్డాం. రాష్ట్రంలో ప్రేమ, సోదరభావం, శాంతి వాతావరణం నెలకొంది. ఇది తమ ప్రభుత్వం ఘనత అని చెప్పుకొచ్చారు. లాలూప్రసాద్ అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ఏమీ చేయలేదని, దాణా కుంభకోణంలో చార్జిషీట్ ఆయన పదవి నుంచి తప్పుకునేలా చేసినప్పుడు భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రిని చేశారని విమర్శలు గుపినవంచారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, ఇందులో భాగంగా పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రారంభించి ఇటీవల ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున కోటి మందికి పైగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ చేశామని వివరించారు.

### మహాకూటమిలో కుదరని సీట్ల సర్దుబాటు

**- స్నేహపూర్వక పోటీ పేరుతో బరిలోకి**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మహాఘట్ బంధన్‌లో సీట్ల సర్దుబాటు కుదరలేదు. ఎవరికి వారు అన్నట్లు ఆయా పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నామినేషన్లు వేయించారు. దీంతో కూటమిలోని పార్టీల మధ్యే పోటీ నెలకొంది. దాదాపు 20 స్థానాల్లో స్నేహపూర్వక పోటీ చేస్తున్నట్లు ఇటు ఆర్‌జెడి, అటు కాంగ్రెస్ ప్రకటించాయి. ఇక సీట్ల సర్దుబాటుకు సంబంధించి అధికారిక ప్రకటన ప్రకారం, ఆర్‌జెడి 143 స్థానాల్లో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 61, సిపిఐఎంఎల్ 20, విఐపి 15, సిపిఐ 6, సిపిఐ(ఎం) 4 స్థానాల్లో బరిలో నిలిచాయి. ఐదు స్థానాల్లో ఆర్‌జెడి స్నేహ పూర్వక పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 12 సీట్లలో, వామపక్ష పార్టీలు కూడా ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తున్నాయి. విఐపి కూడా ఏడు నియోజక వర్గాలలో కాంగ్రెస్, ఆర్‌జెడి అభ్యర్థులతో స్నేహపూర్వక పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌ల మధ్య భేదాభిప్రాయాలతోనే ఈ సమస్య నెలకొందని ఆయా పార్టీల నేతలు పెదవి విరుస్తున్నారు. స్నేహపూర్వక పోటీతో ప్రత్యర్థి ఎన్‌డియే కూటమికి లబ్ధి చేకూరుతుందని కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బరిలో నుంచి జెఎంఎం నిష్క్రమణ**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లేదని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ప్రకటించింది. మహాఘట్ బంధన్ మిత్రపక్షాలు ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు సంకీర్ణ ధర్మాన్ని నిలబెట్టడంలో విఫలమయ్యాయని జెఎంఎం సీనియర్ నాయకుడు సుదీప్ కుమార్ సోను ఆరోపించారు. కూటమిలోని పార్టీలను సంప్రదించ కుండా సీట్ల సర్దుబాటు చేశారని దుయ్యబట్టారు. అందుకే పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు వివరించారు. అయితే, ఏ కూటమికి జెఎంఎం మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఆర్‌జెడిలతో కూడిన బీహార్‌లోని మహాఘట్ బంధన్ నుండి విడిపోయి, ఆరు స్థానాల్లో పోటీ చేస్తుందని జెఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య శనివారం ప్రకటన చేసిన రెండు రోజులకే ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది.

**అలా నామినేషన్.. ఇలా అరెస్ట్**

రోహ్‌తాస్ జిల్లా ససారాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్‌జెడి అభ్యర్థి సతేంద్ర సాహ్ నామినేషన్ దాఖలు చేశాడు. ఇలా ఇవో కార్యాలయం నుంచి బయటికి రాగానే పోలీసులు అరెస్టు చేశారు. సాహ్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ పెండింగ్‌లో ఉన్నందున జార్ఖండ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోహ్‌తాస్ జిల్లా ఎస్పీ కథనం ప్రకారం...

"ససారాం స్థానం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి సోమవారం సంబంధిత సర్కిల్ అధికారి కార్యాలయానికి సతేంద్ర సాహ్ చేరుకున్నాడు. అతనిపై పెండింగ్‌లో ఉన్న ఒక ఎన్‌బిడబ్ల్యూను అమలు చేయడానికి జార్ఖండ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతను తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయడానికి అనుమతించారు. తదనంతరం అతడిని అరెస్టు చేసి జార్ఖండ్‌కు తీసుకెళ్లారు" అని వివరించారు.

# హద్దుమీరితే హమాస్‌కు తీవ్రపరిణామాలు తప్పవు

## కాల్పుల విరమణపై ట్రంప్ మరోసారి హెచ్చరిక



**వాషింగ్టన్, అక్టోబరు 21:** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో హద్దులు దాటితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌ను తీవ్రంగా హెచ్చరించారు. ఒప్పం దాన్ని ఉల్లంఘిస్తే హమాస్‌ను తుడిచిపెట్టేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు రెండు వారాల క్రితం అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం పలుమార్లు ప్రమాదంలో పడింది. మృతదేహాల అప్పగింతలో హమాస్ జాప్యం చేస్తోందని, దాడులకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపి స్తున్న నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. హమాస్‌తో మేం ఒక ఒప్పందం చేసుకున్నాం. వారు మంచిగా, ప్రశాంతంగా ఉంటారని అను కుంటున్నాం. అలా జరగకపోతే, అవసరమైతే వారిని తుడిచిపెట్టేస్తాం. ఈ విషయం వాళ్లకూ తెలుసని ట్రంప్ తెలిపారు. ప్రత్యర్థులను బహిరంగంగా ఉరితీయడం వంటి చర్యలను వెంటనే ఆపాలని కూడా ఆయన హమాస్‌ను హెచ్చరించారు. అయితే, ఈ విషయంలో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకోదని ట్రంప్ స్పష్టం చేశారు. ఒకవేళ అవసరమైతే గాజాలో శాంతి స్థాపన కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దళాలు రంగంలోకి దిగుతాయని ఆయన తెలిపారు. నేను కోరితే ఇజ్రాయెల్ రెండు నిమిషాల్లో రంగంలోకి దిగుతుంది. కానీ ప్రస్తుతానికి మేం వారికి ఒక అవకాశం ఇస్తున్నాం. వారు హింసను ఆపకపోతే త్వర లోనే కఠిన చర్యలు తప్పవని ఆయన వ్యాఖ్యా నించారు. మరోవైపు తాము ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని హమాస్ చర్చల ప్రతినిధి ఖలీల్ అల్‌హయా తెలిపారు. మృతదేహాలను వెలికితీయడం చాలా కష్టంగా మారిందని, అయినప్పటికీ తాము తీవ్రంగా ప్రయత్నిస్తు న్నామని ఆయన ఈజిప్టు మీడియాకు వివరించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో అమె రికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇజ్రాయెల్ పర్యటనకు బయలుదేరారు. ఆయన ప్రధాని నెతన్యాహుతో సమావేశం కానున్నారు. అంతకుముందే ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, సలహాదారు జారెడ్ కుష్నర్ కూడా నెతన్యాహుతో భేటీ అయి, తాజా పరిణా మాలపై చర్చించారు.

# జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనాయే తకైచి

## - శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**టోక్యో, అక్టోబరు 21:** జపాన్ రాజకీయ చరిత్రలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ దేశ ప్రధానమంత్రిగా ఓ మహిళ బాధ్యతలు చేపట్టారు. జపాన్ ఐరన్ లేడీగా పేరుగాంచిన సనాయే తకైచిని దేశ ప్రధానిగా పార్లమెంట్ దిగువ సభ మంగళవారం ఎన్నుకుంది. 64 ఏళ్ల సంప్రదాయవాద నాయకురాలు, చైనాపై బహిరంగ విమర్శలకు ప్రసిద్ధి. 465 స్థానాలున్న దిగువ సభలో తకైచికి 237 ఓట్లు లభించాయని, తద్వారా ఆమె మెజారిటీ మార్కును సునాయాసంగా దాటారని దిగువ సభ సిబ్బంది తెలిపారు. ఎగువ సభ ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. జపాన్ ప్రధానమంత్రిగా సనాయే తకైచి ఎన్నికైె నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాజీనామా చేసిన షిగెరు ఇషిబా స్థానంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తకైచికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జమ్మూకాశ్మీర్‌లో సిఎం వదులుకున్న సీటుకు ముగ్గురు 'ఆగా'ల పోటీ!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 21:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో జమ్మూకశ్మీర్‌లోని బద్గాం నియోజకవర్గం ప్రముఖంగా వార్తల్లో నిలుస్తోంది. జమ్మూకశ్మీర్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ స్థానాన్ని ఖాళీచేయడం ఒక కారణమైతే ఇక్కడి నుంచి మూడు ప్రధాన పార్టీల తరఫున ముగ్గురు 'ఆగా'లు పోటీపడుతుండటం మరొకటి. ఈ ముగ్గురూ రాజకీయంగా శక్తిమంతమైన షియా వర్గానికి చెందినవారే కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. జమ్మూకశ్మీర్‌లో గత ఏడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గాందర్‌బల్, బద్గాం స్థానాల నుంచి పోటీ చేశారు. రెండు చోట్ల విజయం సాధించారు. ఈ క్రమంలోనే సిఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఆయన బద్గాం సీటును వదులుకున్నారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం ఈ పార్టీ నుంచి మాజీ మంత్రి ఆగా సయ్యద్ మహమూద్ బరిలో దిగారు. ఎన్సీ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొడుతున్నారు. అయితే ఈ పార్టీ నుంచి బద్గాం స్థానంలో గతంలో వరుసగా మూడు సార్లు విజయం సాధించి, ఇప్పుడు ఎంపిగా ఉన్న ఆగా సయ్యర్ రుహుల్లా మెహదీ మాత్రం తమ పార్టీ ప్రచారానికి నిరాకరించడం గమనార్హం. జమ్మూకశ్మీర్ మాజీ సిఎం మెహబూబా ముఫ్తీకి చెందిన పిడిపి నుంచి యువనేత ఆగా సయ్యద్ ముంతజీర్ మెహదీ పోటీ చేస్తున్నారు. ఆయన తన ప్రచారంలో సిఎం ఒమర్ అబ్దుల్లాను లక్ష్యంగా చేసుకుంటున్నారు. భారీ మెజారిటీతో గెలిస్తే ఇక్కడే ఉంటానని చెప్పి బద్గాం ప్రజలను ఆయన మోసం చేశారని ఆరోపిస్తున్నారు. కలుషిత జలాలు, ఆరోగ్యం, రోడ్ల సమస్యలను లేవనెత్తుతున్నారు. మహమూద్, ముంతజీర్‌లు వరుసకు తాతామనవళ్లు కావడం గమనార్హం. అయితే రాజకీయాలు రాజకీయాలేనని, తాము వేర్వేరు పార్టీలకు చెందిన నేతలమని మహమూద్ స్పష్టం చేశారు. బిజెపి తరఫున ఆగా సయ్యద్ మొహ్సీన్ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్సీ, పిడిపిలు బద్గాం అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తున్నారు.

# బంగీజంప్‌కోసం బ్రిటన్‌నుంచి వచ్చిన మహిళ సాహసం

**రిషీకేశ్, అక్టోబరు 21:** ఎనభైమూడేళ్ల వృద్ధురాలు చేసిన సాహసం ఇప్పుడు సోషల్ మీడియాలో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఎలాంటి భయం లేకుండా, ఎంతో ఉత్సాహంగా ఆమె ఇండియాలోనే అత్యంత ఎత్తైన బంగీ జంప్ చేయడం అందరిలో స్ఫూర్తిని నింపుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన 83 ఏళ్ల మహిళ రిషికేశ్‌లోని శివపురిలో ఉన్న భారతదేశపు అత్యంత ఎత్తైన బంగీ జంప్ చేయడానికి ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చారు. ఈ సాహసానికి సంబంధించిన వీడియోను హిమాలయన్ బంగీ అనే సంస్థ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. బంగీ జంప్ థ్రిల్ అనుభవించడం కోసమే 83 ఏళ్ల మహిళ యూకే నుంచి ఇక్కడికి వచ్చారు. ఇది ఆమె జీవితంలో తీసుకున్న ఉత్తమ నిర్ణయం కావచ్చని వారు ఆ పోస్టుకు



వ్యాఖ్యను జోడించారు. వైరల్ అయిన వీడియోలో, ఈ వృద్ధురాలు జంప్ చేయడానికి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ కనిపించారు. ప్లాట్‌ఫామ్ పై నుంచి దూకే సమయంలో ఆమెలో ఏమాత్రం భయం కనపడలేదు. పక్షిలా గాల్లో తేలుతూ, స్వేచ్ఛగా చేతులు కదిలిస్తూ ఆమె ఈ సాహసాన్ని పూర్తి చేశారు. నెటిజన్లు ఆమె ధైర్యాన్నిప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

# దళిత యువకుడిపై అమానుషం

## బూట్లు నాకమని బలవంతం చేసిన అగ్రవర్ణాలవారు

**హమీర్‌పూర్(యూపి), అక్టోబరు 21:** కుల వివక్షకు సంబంధించిన అమానవీయ ఘటన ఒకటిఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. హమీర్‌పూర్ జిల్లాలో ఒక దళిత యువకుడిపై అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు అత్యంత పాశవికంగా దాడి చేసి, అతడితో బూట్లు నాకమని బలవంతం చేశారు. ఈ దాడిలో బాధితుడి చెయ్యి విరిగింది. అయితే, ఘటన జరిగి 12 రోజులైనా స్థానిక పోలీసులు కేసు నమోదు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. చివరికి జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదైంది. సిమ్నోడి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఉమేష్ బాబు వర్మ అక్టోబర్ 5న మార్కెట్‌కు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మార్గమధ్యలో అభయ్ సింగ్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి ఉమేష్‌ను అడ్డగించాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను చించివేయడంపై ఉన్న పాత గొడవను మనసులో పెట్టుకుని వారు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. నన్ను కులం పేరుతో తిడుతూ, వాళ్ల బూట్లు నాకమని బలవంతం చేశారు. ఆ తర్వాత నాపై దాడి చేసి చేయి విరగ్గొట్టారని బాధితుడు ఉమేష్ స్థానిక మీడియాకు తన ఆవేదనను వివరించాడు. దాడి తర్వాత న్యాయం కోసం స్థానిక పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. చాలాసార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను, కానీ నా ఫిర్యాదును ఎవరూ స్వీకరించలేదని తెలిపాడు. స్థానిక పోలీసుల నుంచి స్పందన లేకపోవడంతో ఉమేష్ నేరుగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) డాక్టర్ దీక్షా శర్మను కలిసి జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఆమె ఆదేశాలతో పోలీసులు 12 రోజుల ఆలస్యంగా అభయ్ సింగ్, మరో ఇద్దరిపై దాడి, దళితులపై అకృత్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఫిర్యాదును నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## అమెరికాలో ఆస్ట్రేలియా రాయబారిపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్, అక్టోబరు 21:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సమక్షంలోనే, అమెరికాలో ఆ దేశ రాయబారిగా ఉన్న కెవిన్ రడ్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అసహనాన్ని తీవ్రస్థాయిలో వ్యక్తం చేశారు. నేను నిన్ను ఇష్టపడను. బహుశా ఎప్పటికీ ఇష్టపడకపోవచ్చని ఆయన ముఖం మీదే చెప్పడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైట్‌హౌస్‌లో జలాంతర్గాముల ఒప్పందంపై చర్చించేందుకు ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ సమావేశమయ్యారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరుగుతున్న సమయంలో, ఒక విలేకరి కెవిన్ రడ్‌ను ఉద్దేశించి ఒక ప్రశ్న అడిగారు. గతంలో రడ్ చేసిన విమర్శలపై మీరెలా భావిస్తున్నారని ట్రంప్‌ను ప్రశ్నించారు. ట్రంప్ స్పందిస్తూ, "ఆయనెక్కడ? ఇంకా మీ దగ్గరే పనిచేస్తున్నారా?" అని అల్బనీస్‌ను అడిగారు. ప్రధాని అల్బనీస్ ఇబ్బందిగా నవ్వుతూ ఎదురుగా కూర్చున్న రడ్‌ను చూపించారు. వెంటనే రడ్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ, అధ్యక్షా, నేను ఈ పదవి చేపట్టక ముందు చేసిన వ్యాఖ్యలవి అని చెప్పబోయారు. అయితే, అడ్డు తగిలిన ట్రంప్, నువ్వంటే నాకు ఇష్టం లేదు అని ఘాటుగా బదులిచ్చారు.

## కోటలోపల ముస్లిం నమాజ్.. గోమూత్రంతో శుద్ధిచేసిన బిజెపి కేడర్



**శనివార్‌వాడ(మహారాష్ట్ర), అక్టోబరు 21:** మహారాష్ట్రలోని పుణెలో ఉన్న చారిత్రక శనివార్‌వాడ కోటలో చోటుచేసుకున్న పరిణా మాలు తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీశాయి. కొందరు ముస్లిం మహిళలు కోట లో పల నమాజ్ చేసిన ప్రదేశాన్ని బీజేపీ ఎంపీ మేధా కులకర్ణి నేతృత్వంలోని బృందం గో మూత్రంతో శుద్ధి చేయడం పెద్ద వివాదంగా మారింది. శనివారం నాడు కొందరు ముస్లిం మహిళలు శనివార్‌వాడ ప్రాంగణంలో నమాజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నమాజ్ చేసిన గుర్తుతెలియని మహిళలపై కేసు నమోదు చేశారు.

# బాలీవుడ్ సీనియర్ కమెడియన్ అస్రానీ కన్నుమూత



ముంబయి, అక్టోబరు 21: బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అస్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జన్మించిన అస్రాని ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. అదే సమయంలో తన విద్యను పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో 1962లో ముంబయికి వెళ్లారు. అక్కడ దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. 1966లో విడుదలైన"హమ్ కహా జా రహే హై సినిమాతో వెండితెరపై తొలి అడుగుపెట్టిన ఆయన, 1967లో వచ్చిన"హరే కాంచ్ కీ చూడియాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే షోలే" సినిమాలో ఆయన పోషించిన జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350కిపైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. హీరో హిందూస్థానీ,డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో కూడా ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు.

# చాయ్‌వాలా ఇంట్లో కోటి నగదు

**- భారీగా బంగారం, వెండి స్వాధీనం**


**- 85 ఎటిఎం కార్డులు, 75 పాస్‌బుక్‌లు సీజ్**

**- ఇద్దరు అరెస్టు: సైబర్ క్రైమ్ డిఎస్పీ**



**పాట్నా, అక్టోబరు 21:** బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లో ఓ చాయ్‌వాలా ఇంట్లో పోలీసులు సోదాలు చేయగా, రూ.కోటికి పైగా నగదు, భారీగా బంగారు, వెండి ఆభరణాలు, డజన్ల కొద్దీ ఎటిఎం కార్డులు, పాస్‌బుక్‌లు బయటపడ్డాయి. సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ డిఎస్పీ అవంతిక దిలీప్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... గోపాల్‌గంజ్‌లోని టీ విక్రేత ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్ నడుపుతున్నాడు. అంతర్రాష్ట్ర సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పక్కా సమాచారంతో సైబర్ క్రైమ్ పోలీసులు చాయ్‌వాలా ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో రూ.1.05,49,850 నగదు, 344 గ్రాముల బంగారం, 1.75 కేజీల వెండి ఆభరణాలతోపాటు 85 ఎటిఎం కార్డులు, 75 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 28 చెక్‌బుక్‌లు, ఆధార్ కార్డులు, రెండు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక లగ్జరీ కారు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు అభిషేక్ కుమార్ ఒకప్పుడు ఓ చిన్న టీ స్టాల్ నడిపేవాడు. తర్వాత సైబర్ క్రైమ్ రాకెట్‌లో చేరాడు. దుబాయ్‌కెళ్లి సైబర్ క్రైమ్‌కు సంబంధించి సమన్వయం చేస్తుండగా, సోదరుడు ఆదిత్యకుమార్‌ను ఇండియాలో లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ప్రాథమిక దర్యాప్తులో ముఠా మోసపూరితంగా సంపాదించిన డబ్బును వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసి, తర్వాత దాన్ని నగదుగా మార్చిందని డిఎస్పీ అవంతిక దిలీప్‌కుమార్ వివరించారు. నెట్‌వర్క్ బీహార్ దాటి విస్త రించి ఉన్నట్లు గుర్తించామని, ఈ ముఠాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇద్దరినీ అదుపులోకితీసుకుని విచారిస్తున్నట్లు డిఎస్పీ తెలిపారు.

## జర్నలిస్టుపై నోరుపారేసుకున్న వైట్‌హౌస్ సెక్రటరీ



**వాషింగ్టన్, అక్టోబరు 21:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్, ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు అత్యంత వివాదాస్పద రీతిలో సమాధానమిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరగబోయే భేటీ వేదిక గురించి ప్రశ్నించగా, మీ అమ్మే నిర్ణయించారు అంటూ ఆమె బదులివ్వడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో త్వరలో సమావేశం కానున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ భేటీకి వేదికను ఎవరు ఎంపిక చేశారని హాఫింగ్‌టన్ పోస్ట్ రిపోర్టర్ ఎస్‌వీ డేట్ టెక్స్ట్ మెసేజ్‌లో ప్రశ్నించగా, లెవిట్ పైవిధంగా స్పందించారు. అనంతరం, జర్నలిస్టుతో జరిగిన సంభాషణ స్క్రీన్‌షాట్‌ను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఘటనపై కరోలిన్ లెవిట్ వివరణ ఇస్తూ, సదరు రిపోర్టర్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

## టేకాఫ్ అయిన కొద్దినిమిషాలకే వెనక్కి మళ్లిన విమానం

**లాస్‌ఏంజెల్స్, అక్టోబరు 21:** అమెరికాలో ఓ విమానంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లోకి ఎవరో బలవంతంగా చొంబడేందుకు ప్రయత్నిస్తున్నారని పైలట్లు తీవ్రంగా ఆందోళన చెందారు. దీంతో టేకాఫ్ అయిన 40 నిమిషాలకే విమానాన్ని వెనక్కి మళ్లించి, బయలుదేరిన విమానాశ్రయంలోనే అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అసలు విష యం తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ 6469 సోమవారం ఒమాహా నుంచి లాస్ ఏంజెలెస్‌కు బయలుదేరింది. విమా నం గాల్లోకి లేచిన కాసేపటికే పైలట్లకు కాక్‌పిట్ నుంచి ఒక రకమైన స్టాటిక్ శబ్దం వినిపించింది. ఎవరో దుండగులు కాక్‌పిట్ డోర్‌ను బద్దలుకొట్టి లోపలికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు అపార్థం చేసుకున్నారు. వెంటనే అప్రమత్తమై, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించింది.

# హెచ్ 1బి వీసా ఫీజులో ఊరట

## దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు మినహాయింపు!

**న్యూఢిల్లీ, అక్టోబర్:** అమెరికా ఉద్యోగం కోసం కలలు కనే వారికి ఊరట. హెచ్ 1 బి వీసా ఫీజు విషయంపై ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఈ ఫీజు చెల్లింపుల విషయంపై అమెరికా పౌరసత్వం, వలస సేవల సర్వీస్ కీలక ప్రకటన చేసింది. హెచ్1 బి వీసా కోసం పెంచిన లక్ష డాలర్ల ఫీజు దేశం బయటనుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే వరిస్తుందని స్పష్టం చేసింది. యుఎస్‌సిఐఎస్ ప్రకటన ప్రకారం అమెరికాలో చదువుకుని, ఉద్యోగాల కోసం హెచ్1బి వీసాకు దరఖాస్తు చేసుకునే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీని ప్రకారం అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీయులు ముందుగా కొన్నేళ్లు అక్కడ చదవాల్సి ఉంటుంది. ఇక, సెప్టెంబర్ 21న హెచ్1బి వీసాపై ప్రకటన వెలువడిన తర్వాత దాఖలైన దఖాస్తులకు మాత్రమే ఇది వరిస్తుందని తెలిపింది. ఈ ఫీజు చెల్లింపులకు ఆన్‌లైన్ ప్రారంభించినట్లు వెల్లడించింది.

# మస్కట్ నుండి ఇండియాకు...ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో తిరిగొచ్చిన కూలి

**తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో మస్కట్కు వెళ్లిన మహిళ తిరిగి తాడేపల్లిగూడెం చేరుకుంది. ఆర్థికంగా వెనుకబడిన ఈమె కుటుంబ పోషణ నిమిత్తం దేశం దాటి ఇతర దేశాలకు వెళ్ళింది ఈమె. బతుకు తెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లిన వారు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. తాడేపల్లిగూడెం కొబ్బరి తోట సీతారాంపేట కి చెందిన మన్నే ఆదిలక్ష్మి మస్కట్ లో కొంతకాలంగా కూలి పని చేస్తూ ఉండేది. ఈ మధ్యకాలంలో ఆదిలక్ష్మి కి అనారోగ్య సమస్య ఉత్పన్నం కావడంతో తాడేపల్లిగూడెంలో ఉంటున్న ఆదిలక్ష్మి తల్లి కి విషయం తెలియజేయడం జరిగింది. తల్లి ఆర్థికంగా దిక్కుతోచని స్థితిలో స్థానిక తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ని కలిసి విషయం విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మస్కట్ కు ఎమ్మెల్యే బృందాన్ని పంపించి ఆమె విమానం చార్జీలు ఇచ్చి ఇండియాకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మన్నే ఆదిలక్ష్మి ఎమ్మెల్యే బొలిశెట్టి



శ్రీనివాస్ కి రుణపడి ఉంటానని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# 4.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణకు

# పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి

- ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏ ఒక్కరైతు ఇబ్బందులు పడకూడదు
- పెదపాడు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ ...





**ఏలూరు ప్రభాత వార్త :** పెదపాడు మండలం వట్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సత్యకృష్ణ మోడ్రన్ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లును మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం జల్లెడ, ధాన్యం నాణ్యత, గోనె సంచులు, తేమ శాతం కొలిచే యంత్రాన్ని, డిజిటల్ వెయింగు స్కేల్ (తూనిక యంత్రాలు) ను పరిశీలించి, పనిచేసే విధానాన్ని స్వయంగా పరిశీలించి కొన్ని వివరాలను జిల్లా జాయింటు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైసుమిల్లుకి వెళ్ళి మిల్లులో మిషనరీ డ్రయ్యర్లు , ధాన్యం నుండి బియ్యం తయారయ్యే యంత్రాలను స్వయంగా పరిశీలించారు. రైసుమిల్లు యజమాని ఆళ్ల సతీష్ చౌదరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు జిల్లాలో సుమారు 105 రైసు మిల్లులు ఉన్నాయని, అందరూ ధాన్యం కొనుగోలులో రైతు సోదరులకు మా సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత వేగవంతం చేసి ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా రైసు మిల్లర్స్ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగాజిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల 50 వేలు మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణకు లక్ష్యం కాగా అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేశామని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చిన్నచిన్న పొరపాట్లు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతీ రోజు ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. . రైతులకు నుండి ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే వారి ఖాతాకు నగదు జమ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని, ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు, రైతులకు డబ్బుల చెల్లింపు విషయంలో అన్నదాతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. . ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించే రైతన్నలకు ఏటువంటి ఇబ్బందులు కలగనీయమని వద్దని సూచించామన్నారు. ధాన్యం సేకరణలో రైతుల ఇబ్బందులు సమస్యలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ నెంబరు:7702003584, ఏలూరు జిల్లా టోల్ ఫ్రీ నెంబరు 18004256453 రైతులు తమ సమస్యలు, సూచనలు తెలియజేయాలని జిల్లా జాయింటు కలెక్టరు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డియస్ వో విలియమ్స్, సివిల్ సప్లై జిల్లా మేనేజరు పి.శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ జేడి షేక్ హబీబ్ భాషా, డిసివో ఆరిమిల్లి శ్రీనివాసు, తహశీల్దారు ఏ.కృష్ణజ్యోతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి, టెక్నికల్ అసిస్టెంట్లు, రెవిన్యూ, సచివాలయ ఉద్యోగులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల విద్యార్థులతో మంత్రి నిమ్మల దీపావళి వేడుకలు......



**ప్రభాతవార్త పాలకొల్లు:** అభం శుభం తెలియని భగవంతుని స్వరూపులైన మానసిక దివ్యాంగులతో కుటుంబ సమేతంగా దీపావళి పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని తృప్తిని కలిగించిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సోమవారం రాత్రి పాలకొల్లులో అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో మానసిక విద్యార్థులతో కలిసి కుటుంబ సమేతంగా మంత్రి రామానాయుడు దీపావళి పండుగను జరుపుకున్నారు. విద్యార్థులందరికీ కొత్త దుస్తులను మంత్రి రామానాయుడు, ఆయన సతీమణి సూర్య కుమారి దంపతులు, ఇటీవల కొత్తగా వివాహమైన కుమార్తె శ్రీజ, అల్లుడు పవన్ లతో కలిసి అందజేశారు. స్వయంగా స్వీట్లు తినిపించారు. కొద్దిసేపు మానసిక పిల్లలతో సరదాగా గడిపారు. వారితో కలిసి బాణా సంచా ను కాల్చారు. అక్కడే ఉన్న గోశాలలో ఆవులకు దాణ తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా



దివ్యాంగుల మధ్య దీపావళి రోజున కుటుంబ సభ్యులు లేరు అనే లోటు లేకుండా కుటుంబ సమేతంగా వచ్చి వారి మధ్య పండుగ జరుపుకున్నామన్నారు. ప్రతి సంవత్సరం దీపావళి రోజున దివ్యాంగులతో గాని, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో గాని విద్యార్థులతో జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రసాద్, ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, దీప్తి అప్పారావు బొక్క రమాకాంత్, మండెల రాంప్రసాద్, మేడిశెట్టి కేశవ, కిలారు రామారావు, వందనపు ప్రసాద్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం సొమ్ములు నేరుగా జమా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

## - ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, అక్టోబర్-21, ప్రభాతవార్త: ఆచంట నియోజకవర్గంలో కౌలు రైతులకు ధాన్యం అమ్మిన సొమ్మును నేరుగా వారి ఖాతాలో జమ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని మాముడూరు లో "పల్లె పల్లెకు పితాని" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో గ్రామ ప్రజలతో, అధికారులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం కుల, మత, ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నదని పితాని తెలిపారు. గ్రామంలోని త్రాగునీటి సమస్య త్వరితగతిన



పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు, ఇప్పటికే నియోజకవర్గంలో 75కు పైగా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మాముడూరు గ్రామంలో కూడా వోల్టే సమస్యను కూడా పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తామని ఆయన అన్నారు. అలాగే హరిజన స్మశాన వాటిక సమస్యను గ్రామస్థాయిలో తక్షణమే పరిశీలించాలని తాసిల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు . డ్రైనేజీ, సీసీ రోడ్లను దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. మాముడూరు గ్రామంలోని మూడు ఎకరాల స్మశాన వాటికను పూర్తిగా సర్వే చేసి శుభ్రపరిచి సుందరంగా తీర్చిదిద్దాలని గ్రామ కార్యదర్శి కు తెలియజేశారు. గ్రామంలో హై స్కూల్ కు చెరువు వైపు కంచె నిర్మించాలని, పశువులు పాఠశాలలో ప్రవేశించకుండా కట్టడి చేయాలని ఆ శాఖ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు పంపిణీ.

**అత్తిలి -అక్టోబర్ 21( ప్రభాతవార్త):** అత్తిలి మానవత సంస్థ పేదలకు సహాయం చేయడంలో ముందుంటోందని ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ రావు అన్నారు. అత్తిలి కి చెందిన కొత్తపల్లి రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కోరిపల్లి విజయకుమార్, కార్యదర్శి కోరిపల్లి హరి ,ఉపాధ్యక్షుడు ముద్దుల జగదీష్ కుమార్,కోశాధికారి కె వి రామారావు, శరాజేంద్రప్రసాద్ కుమారుడు శేషగిరి, అప్పారావు, అనిల్ కుమార్, గోపాల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మావుళ్ళమ్మఆలయంలో చండీ హెూమం

భీమవరం అక్టోబర్ 21 ప్రభాతవార్త :భీమవరం పట్టణ ఇలవేలుపు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా మంగళవారం చండీహెూమం ఆలయ అర్చకులు మద్దిరాల రమణ శర్మ వేదపారాయణ దారులు నిర్వహించారు. 49 మంది దంపతులు హెూమం లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

# నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించండి

## - డెమోక్రటీవ్ పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు

**చాట్రాయి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** డీఎస్సీ ద్వారా నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు చాట్రాయి మండలంలో పనిచేయుచున్న ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కోరుతూ మండల విద్యాశాఖాధికారి -1 మాసగిరి శ్రీనివాసరావు న కలిసి 2025 డీఎస్సీ ద్వారా ఎంపిక కాబడి చాట్రాయి మండల పరిధిలోని పాఠశాలల్లో జాయిన్ అయిన ఉపాధ్యాయులకు త్వరితగతిన జీతాలు చేయుటకు అవసరమైన సి ఎఫ్ ఎం ఎస్ ఐ డి, హెచ్ ఆర్ ఎం ఎస్ ఐ డి, ట్రెజరీ ఐడి క్రియేట్ చేయుటకు అవసరమైన ఫారాలు, ఆన్లైన్ వర్క్ త్వరగా పూర్తి చేయించవలసిందిగా కోరినట్లు ఆయన వివరించారు. గతంలో వేరే ఉద్యోగం చేసి డీఎస్సీ 2025 లో ఎంపిక కాబడి చాట్రాయి మండలంలో జాయిన్ అయిన వారి ఎల్పిసి, ఎస్ఆర్ తెచ్చుకొనుటకు అవసరమైన రిక్వెస్ట్ లెటర్ త్వరితగతన ఇప్పించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని క్లస్టర్ కాంప్లెక్స్ నందు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి జాయింట్ సెక్రటరీలను నియమించుటలో కాంప్లెక్స్ చైర్మన్లు



అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి నిబంధనలు పాటించేలా చూడవలసిందిగా కోరినట్లు ఆయన తెలిపారు.చాట్రాయి మండల పరిధిలో పనిచేయు ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలన్న , ఆదేశాలు జారీ చేయాలన్నా, సమాచారం సేకరించాలన్నా సంబంధించిన మెసేజ్ లు ఉపాధ్యాయుల ద్వారా కాకుండా ఎంఈఓ ల ద్వారా మాత్రమే పంపాలని.మండల విద్యాశాఖ ఏర్పాటుచేసిన వాట్సాప్ గ్రూపులలో ఎంఈఓ లు మాత్రమే అడ్మిన్ గా ఉండాలని కోరుతూ డెమొక్రటిక్ పి ఆర్ టి యు చాట్రాయి మండల శాఖ తరఫున రిప్రజెంటేషన్ సెక్రటరీ తేరా రామారావుతో కలిసి వినతి పత్రం అందజేసినట్టుగా తెలియజేశారు.

# రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పోటీలు.

**అత్తిలి- అక్టోబర్2 1 (ప్రభాత వార్త):** నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఇవి వి నారాయణ తెలిపారు. పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు 21,22వ తేదీలలో ఎనిమిది నుండి పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో 24,25 తేదీలలోనూ, నియోజకవర్గం స్థాయిలో 29, 30 తేదీలలోనూ పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ నవంబర్ 24,26 తేదీలలో జరుగుతాయని ఇందు నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా 175 మందిని ఎంపిక చేస్తారని తెలిపారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# పోలీస్ కు సహకరించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది

# కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

**భీమవరం అక్టోబర్ 20 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా రాత్రింబవళ్లు సమాజ రక్షణకై కృషి చేసేదే పోలీసు వ్యవస్థఅని,విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందనికేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.దేశ అంతర్గత భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన వీర పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ "స్మృతి పోలీస్ పెరేడ్"కార్యక్రమం లో ముఖ్య అతిథిగా కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొని మాట్లాడారు. గౌరవ అతిథులుగా రాజ్యసభ



సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, భీమవరం శాసన సభ్యులు పులపర్తి రామాంజనేయులు , జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి , ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, కాపు కార్పొరేషన్ చైర్మన్ శ కొత్తపల్లి సుబ్బారాయుడు గ, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారాలు హాజరయ్యారు.

# మోదిగా ఆకుల అలంకరణలో శ్రీ అభయాంజనేయ స్వామి దర్శనం,

**పెనుమంట్ర-ప్రభాతవార్త :** మండలంలోని మార్టేరు జెడ్ వంతెన దగ్గర కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి మంగళవారం "మోదిగా ఆకుల" అలంకరణ లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు విజయ గోపాలచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీ కరించారు. కమిటీ సభ్యుల్లో ఒకరైన కర్రి అచ్చుతామారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకోవాలని కోరారు. అలాగే ఈ అలంకరణకు సహకరిస్తున్న భక్తులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# శ్రీ సూర్య కళాశాల అధ్యాపకులను ఘనంగా సత్కారం



ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం శ్రీ సూర్య కళాశాలలో నరసాపురంసుదీర్ఘకాలంగా తమ సేవలు అందిస్తున్న అధ్యాపకులను, ఉత్తమ అధ్యాపకులుగా గుర్తించి ఏపీజే ఎం ఏ (ఆంధ్రప్రదేశ్ జూనియర్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్) సూర్య కళాశాల సంస్కృత విభాగ అధ్యాపకులు జాస్తి సుబ్బారావు, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు కడలి లక్ష్మీనారాయణ తణుకు వేదికగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రెసిడెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం సూర్య కళాశాల మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఏపీజేఎంఏ వారి సన్మానం సందర్భంగా కళాశాల అధ్యాపకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు, చైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ ఉత్తమ అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.



# పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం

**మొగల్తూరు అక్టోబర్ 21 (ప్రభాతవార్త) :** ముత్యాలపల్లి గ్రామంలో ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించినారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు పాల్గొని ఆయన మాట్లాడుతూ పోలీసుల అమరవీరుల త్యాగాలను మరువలేని వాని, శాంతి భద్రతను కాపాడటంలో వారి పాత్ర ఎనలేనిదని తెలియజేశారు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడాల



తాతారావు బొక్క కోటేశ్వరి, గ్రామస్తుల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక విద్యార్థులు

**తణుకు, అక్టోబర్ 21(ప్రభాత వార్త):** ఈనెల 22, 23 తేదీల్లో పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తణుకు మండలం మండపాక జడ్పీ పాఠశా విద్యార్థులు పాల్గొనున్నట్లు ప్రధానోపాధ్యాయరాలు కె.ఫణిశ్రీ తెలిపారు. ఈ పోటీల్లో వి.సుష్మ, ఎం.సత్యశ్రీ, బి.దుర్గాప్రసాద్, వి.నాగదుర్గ, ఎం.అనిల్, ఎస్.కృష్ణలు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ సంకు సూర్యనారాయణను అభినందించారు. విద్యార్థులను గ్రామ సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షులు ఆత్మకూరి రామకృష్ణ, ఎస్ఎంసీ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మి అభినందించారు.



# కార్తీకమాసం సందర్భంగా ముస్తాబై న దేవాలయాలు.

**అత్తిలి- అక్టోబర్ 21 (ప్రభాత వార్త):** కార్తీకమాసం బుధ వారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా అత్తిలి మండలంలోని దేవాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. అత్తిలిలో ప్రసిద్ధి చెందిన ఉమా సిద్దేశ్వర స్వామి వారి ఆలయం ను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారికేడ్లు నిర్మించారు. నెలరోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహిస్తారని ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖర్ శర్మ తెలిపారు. ఆకాశ దీపాలు వెలిగిస్తారని తెలిపారు. ముఖ్యమైన పర్వదినాలలో స్వామివారికి విశేష హెూమాలు నిర్వహిస్తారని తెలిపారు. స్వామివారికి ఏక వార రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు కూడా నిర్వహిస్తారని చెప్పారు. మండలంలోని పలు దేవాలయంలో కూడా కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరుగుతాయని ఆయా దేవాలయాల నిర్వాహకులు తెలిపారు.



# దివ్యాంగులకు ట్రై సైకిల్స్

**భీమవరం అక్టోబర్ 21 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి -4 లో భాగంగా ఇద్దరు దివ్యాంగులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా ట్రై సైకిల్స్ ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని వికలాంగుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, పి -4 లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం, దిరుసుమర్రు గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు దాతల సహకారంతో ట్రై సైకిల్స్ ను అందించామని అన్నారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, యర్రంశెట్టి శివకృష్ణ, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము,



మాజీ కౌన్సిలర్ ఎండి నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

# డిఏ, ఏరియర్స్ బకాయిలపై అధికారుల స్పష్టత ఇవ్వాలి

## భూపతిరాజు రవీంద్ర రాజు,

పెనుమంట్ర–ప్రభాతవార్త,: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు దీపావళికి విడుదల చేసిన డి ఏ, ఏరియర్స్ బకాయిలపై అధికారులు రిటైర్మెంట్ తర్వాత ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రికి చెప్పే చేశారా లేదా? కొంతమంది అధికారులు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులను దూరం చేయాలని చేసారా? అనేది వెంటనే ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు కోరారు. ఈనెల 20వ తేదీన డీఏలకు సంబంధించి విడుదల చేసిన జీవోలపై వెంటనే సవరణ చేయాలని టీచర్ల సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు దీపావళి రోజున తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఈ జీవోలలో పెట్టిన కండిషన్స్ అధికారులు కావాలని పెట్టారా, లేదా ప్రభుత్వానికి తెలిసే జరిగిందా అనే విషయంపై స్పష్టత ఇవ్వవలసిన అవసరం ప్రభుత్వంపై ఉందని అన్నారు.

# శ్రీ వీరాంజనేయ స్వామి ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి అక్టోబర్ 21 : ప్రభాతవార్త :మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత, ఫలాభిషేకాలతో స్వామివారిని స్నపన అనంతరం సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతనామావళి, సహస్రనామార్చనలు, తోమాలా ఆర్చనలు నిర్వహించారు శ్రీ సీతా, రామ, లక్ష్మణ స్వామివారికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపారాధనతో ఆలయం నిండా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమాలను వేదపండితులు వేదాంతం శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటినదీపావళి సంబరాలు



ఆగిరిపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త :మండలంలో ప్రజలు సోమవారం దీపావళి పండుగను అత్యంత ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిలో శ్రద్ధాభక్తులతో లక్ష్మీ దేవికి విశేష పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. సాయంత్రం సమయానికి ఇళ్లను దీపాల వరసతో,రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగింది. పిల్లలు టపాసులు కాల్చుతూ ఆనందోత్సాహాలతో మురిసిపోగా, పెద్దలు మిఠాయిలు,పంచుకుంటూ బంధుమిత్రులతో కలిసి పండుగ జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారు కూడా స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి దీపావళిని ఘనంగా నిర్వహించారు.

# పెనుగొండలో కార్మికుల న్యాయ యుద్ధానికి

# సిఐటియు శంఖారావం



పెనుగొండ, అక్టోబర్ 21( ప్రభాత వార్త ):కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతున్న సిఐటియు (సీఐటీయూ) అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో పెనుగొండలో జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించనుంది. ఈ విషయాన్ని జిల్లా కార్యదర్శి పి.వి. ప్రతాప్ మంగళవారం సిఐటియు కార్యాలయంలో వెల్లడించారు. ఈ మహాసభల్లో గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన ఉద్యమాలు, పాలకుల వైఖరిపై సమగ్ర చర్చ జరగనుందని ఆయన తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఇది కీలక వేదికగా నిలవనుంది. కార్మికుల సమస్యలపై నిబద్ధతతో పోరాటం ప్రతాప్ మాట్లాడుతూ, వేతనాలు, పనిగంటలు, పిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు వంటి అంశాల్లో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికుల శ్రమను గౌరవించకుండా, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మహిళా కార్మికులపై ప్రత్యేక దృష్టి 13 గంటల పని, అర్ధరాత్రి షిఫ్టులు వంటి సమస్యలు మహిళా కార్మికులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై మహాసభల్లో సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నారు. సమాజం నుంచి సహకారం కోరుతూ పెనుగొండ ప్రాంతంలోని పెద్దలు, దాతలు, శ్రేయోభిలాషులు ఈ మహాసభలను విజయవంతం చేయడంలో భాగస్వామ్యం కావాలని సిఐటియు నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్. వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, శీలం ఏసు పాల్గొన్నారు.

# కూచిపూడి కళలో కిరీటధారులు

## - భాష్యం విద్యార్థుల జాతీయ విజయం!



పెనుగొండ అక్టోబర్ 21 (ప్రభాతవార్త): గోవా నేషనల్ డాన్స్ ఛాంపియన్షిప్‌లో కూచిపూడి నాట్యంతో మెరిసిన నాలుగో తరగతి విద్యార్థులు పెనుగొండ భాష్యం పాఠశాల విద్యార్థులు కొప్పర్తి యామిని, కొప్పర్తి భరద్వాజ్‌లు రిథమ్ డాన్స్ అకాడమీ, లిటరరీ కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్,( సి ఐ ఏ )ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్, పారిస్–ఫ్రాన్స్ ఆధ్వర్యంలో గోవాలో నిర్వహించిన నేషనల్ డాన్స్ ఛాంపియన్షిప్ సీజన్ 10 పోటీలలో కూచిపూడి విభాగంలో అద్భుత నృత్య ప్రదర్శనతో అందరి హృదయాలను ఆకట్టుకున్నారు. వారిద్దరూ ఆలమూరు శివాలయ అర్చకులు కొప్పర్తి రాఘవ సంతానంగా, సంప్రదాయ నాట్య కౌశల్యాన్ని ఆధునిక నృత్య శైలితో మేళవించి, ప్రేక్షకులను ఉయ్యాలలూపించిన తీరు ప్రశంసనీయం. పోటీల్లో విజేతలుగా నిలిచిన వీరికి ప్రశంసా పత్రము, మెమెంటోలు, మెడల్స్ లభించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి. అప్పారావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడతాయి. భవిష్యత్తులో వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆశిస్తున్నాం అని తెలిపారు. ఈ విజయోత్సవంలో భాష్యం జోనల్ ఇంచార్జ్ ఏ. శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజా, ఉపాధ్యాయ%–%ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభాస్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించిన అభిమానులు



నరసాపురం ప్రభాతవార్త : పాన్ ఇండియా స్టార్ రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని, నేడు నరసాపురం వై.ఎన్. కాలేజీ వద్ద అడ్వాన్స్ బర్త్‌డే సెలబ్రేషన్స్ అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభాస్ అభిమానులు భారీగా ఏర్పడి, శబ్దాలే స్వాగతం అంటూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అభిమానుల మధ్యలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు శ్రీ బొమ్మిడి నాయకర్ హాజరై, ప్రభాస్ అభిమానులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

## తణుకు పట్టణ సీఐ కొండయ్య- తణుకులో పోలీసు సంస్మరణ దినం



తణుకు, అక్టోబర్ 21(ప్రభాత వార్త): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని తణుకు పట్టణ సీఐ ఎన్.కొండయ్య అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తణుకు సర్కిల్ పరిధిలోని పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది తొలుత తణుకులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నరేంద్ర సెంటర్‌లో సంస్మరణ స్థూపం వద్ద విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ కొండయ్య మాట్లాడుతూ దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పోలీసులు చిరస్మరణీయులన్నారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను ప్రతిఒక్కరు స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ఎస్సై కె.ప్రసాద్, ఇరగవరం ఎస్సై జానా సతీష్, ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ, ఏఎస్సైలు సత్యనారాయణ, శ్రీధర్, రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి పట్టణంలో, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమర పోలీసులకు నివాళులు అర్పిస్తూ, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా ర్యాలీ నిర్వహించినారు. ఈ ర్యాలీని చింతలపూడి ఎమ్మెల్యే శ్రీ సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ ముఖ్య ఉద్దేశాలు ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు కింది విషయాలపై అవగాహన కల్పించారు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం యొక్క పుట్టు పూర్వోత్తరాలను (చారిత్రక నేపథ్యం) గురించి ప్రజలకు వివరించారు. దేశ సరిహద్దులలో, అంతర్గత భద్రతలో పోలీసులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో మరియు ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసులు అందిస్తున్న నిరంతర సేవలను కొనియాడారు. పోలీసులు ప్రజలకు కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాకుండా, ఆపదలో ఆదుకునే మిత్రులు అని తెలియజేశారు. డయల్ 112 వంటి అత్యవసర సేవలతో పాటు, సమాజంలో భద్రత, న్యాయం అందించడంలో పోలీసుల పాత్రను వివరించారు. ర్యాలీని ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ పోలీసులు లేకుండా ఏ సమాజం కూడా ప్రశాంతంగా ఉండలేదని, నిరంతరం 24 గంటలు శ్రమించే పోలీసుల కుటుంబాలకు అండగా నిలబడాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకోవడమే వారికి ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ఈ ర్యాలీ ద్వారా చింతలపూడి ప్రజలు పోలీసుల సేవ పట్ల తమ గౌరవాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

# రైల్వే స్టేషన్ లో సమస్యలు పరిష్కరించాలి

## సీనియర్ ఎడిఆర్ఎమ్ కు రవి అగర్వాల్ వినతి



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త : స్థానిక రైల్వే స్టేషన్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజయవాడ సీనియర్ ఎడిఆర్ఎం పి.ఎడ్విన్ కు జోనల్ కమిటీ మెంబర్ రవి అగర్వాల్ వినతిపత్రం సమర్పించారు. ఏలూరు రైల్వే స్టేషన్ లో అమృత్ సంవాదం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ డివిజన్ సీనియర్ ఎడిఆర్ఎం పి. ఎడ్విన్ , జోనల్ కమిటీ మెంబర్ రవి అగర్వాల్ , రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంలో ట్రైన్లు నిలుపుదల చేయాలని కోరారు. కాకినాడ నుండి విజయవాడ ప్యాసింజర్ లో 8 భోగీలకు బదులు 12 గాని 14 భోగి బోగీలతో నడపాలని కోరారు. విజయవాడ – రాజమండ్రి ప్యాసింజర్ టైం షెడ్యూల్ ప్రకారం నడపాలని కోరారు. తాడేపల్లిగూడెంలో రెండవ, మూడో నెంబర్ ప్లాట్ ఫామ్ లో ఫుడ్ ఓవర్ బ్రిడ్జి టూ టౌన్ వరకు పొడిగించాలని కోరారు. తాడేపల్లిగూడెంలో పలు ట్రైన్ల నిలుపుదల కోసం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే పనులు త్వరితగ తిని పూర్తి పూర్తి చేయవలసిందిగా కోరారు. తాడేపల్లిగూడెంలో పలు ట్రైన్ల నిరుపేదలతో పాటు ఒక ట్రైన్ కాకినాడ లేదా విశాఖపట్నం నుంచి గాని అయోధ్య , కాశీకు , అరుణాచలంకు తాడేపల్లిగూడెం , ఏలూరు మీదుగా ట్రైను ప్రారంభించవలసిందిగా కోరారు.

# ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో పెనుగొండ ప్రతిభకు గౌరవం



పెనుగొండ అక్టోబర్ 21 (ప్రభాత వార్త): పెనుగొండ గ్రామానికి చెందిన డాక్టర్ సబిత ఉమెన్స్ జూనియర్ కళాశాల, పాలకొల్లు లో ఫిజిక్స్ లెక్చరర్ మరియు వైస్ ప్రిన్సిపాల్ గా సేవలందిస్తున్న కూనపరెడ్డి వెంకట భరత్ కుమార్, 2025%–%2026 సంవత్సరానికి “బెస్ట్ లెక్చరర్ ఆఫ్ ది ఇయర్” అవార్డుకు ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా తణుకులో నిర్వహించిన ఘన సన్మాన సభలో, తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా భరత్ కుమార్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు. విద్యా రంగంలో ఆయన చేసిన విశేష సేవలు, విద్యార్థుల పట్ల చూపిన నిబద్ధత, మరియు ఫిజిక్స్ బోధనలో ఆయన చూపిన నైపుణ్యం ఈ గుర్తింపు పొందడానికి కారణమయ్యాయి. ఈ గౌరవప్రదమైన సందర్భంలో భరత్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ఆయన విద్యా సేవలు మరింత విస్తరించి, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాము.

# దీపాల వెలుగుల్లో మనసుల ఏకతా

## వడలిలో పండుగ సంబరాలు



పెనుగొండ అక్టోబర్ 21 (ప్రభాత వార్త): పెనుగొండ మండలంలోని వడలి గ్రామం దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంది. గ్రామంలోని ఒకే వీధిలో నివసించే ఆరు కుటుంబాలు, తమ బంధుమిత్రులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొని సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు పురాతన సాంప్రదాయ వంటకాలైన నూకల అన్నం, బెల్లం%–%నెయ్యి, కారం%–%గానుగ నూనె, ఆవకాయ%–%వెన్నపూస వంటివి వండి, వేడి వేడిగా వడ్డించారు. రకరకాల రుచులను ఆస్వాదిస్తూ, నవ్వులు పంచుకుంటూ, ఏకతా భావంతో పండుగను జరుపుకున్నారు. గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, “ఇలాంటి సాంప్రదాయ ఆచారాలు గ్రామ సమాజాన్ని మరింతగా ఏకతాటిపైకి తీసుకువస్తాయి” అని అభిప్రాయపడ్డారు. దీపావళి వెలుగులు వడలి గ్రామంలో కేవలం దీపాలకే కాదు మనసుల మధ్య వెలుగులకూ మార్గం చూపాయి.

# డి ఎ జీవో నెంబర్ 60 వెంటనే సవరించాలి

## - యుటిఎఫ్ మండల కార్యదర్శి వెంకట్రావు



చాట్రాయి, అక్టోబరు 21, ప్రభాతవార్త :రిటైర్మెంట్ బకాయిల ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీపావళి రోజున వెలుగులు నింపారని ఆయన ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇవ్వాల్సిన డిఏను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఉత్తర్వుల్లో పెరిగిన 3.64 శాతం కొత్త డిఏను చెల్లిస్తామన్నారని చెప్పారు. జనవరి 2024 నుంచి బకాయిలను ఉద్యోగి పదవీ విరమణ సమయంలో తర్వాత లేదా మరణానంతరం చెల్లిస్తామన్న డిఏ యుటిఎఫ్ మండల కార్యదర్శి గంప వెంకట్రావు నింపుతామని చెప్పి జీవో 60 ఇచ్చి చీకటి ప్రభుత్వం ఉద్యోగులకు 2024 జనవరి 1 నుంచి జి.వో.ఎంఎస్. నెం.60 జారీ చేసిందని ఈ అక్టోబర్ 2025 జీతంతో కలిపి సెప్టెంబర్ 2025 వరకు ఇవ్వాల్సిన డిఏ చెల్లించే విధంగా జీవో తీసుకువచ్చారని చెప్పారు. ఈ కొత్త డిఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డిఏ 37.31శాతం అవుతుందని మొత్తం నాలుగు డిఏ బకాయిలు ఉండగా ప్రభుత్వం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చిందని చెప్పారు. పెన్షనర్లకు పెరిగిన కరువుభత్యం 2024 జనవరి నుండి సెప్టెంబర్ 25 వరకు ఉన్న డిఏ మొత్తం 2027 మార్చి నుండి 12 సమాన వాయిదాల లో చెల్లించబడునని ప్రభుత్వం పేర్కొనడం సరికాదన్నారు. ప్రభుత్వం డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలని అయన డిమాండ్ చేశారు. ఈ జీవో పై ప్రభుత్వం పునర్ ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని అని చెప్పారు.

# పాఠశాలను తనిఖీ చేసిన విద్యాధికారి

ఆగిరిపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త: మండలం పరిధిలోని సింహాద్రి అప్పారావుపేట లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి వి.ఎస్. హేబేలు మంగళవారంఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల రాతపుస్తకాలను, పాఠ్యపుస్తకాల నిర్వహణను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు రూపొందించిన తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం వంటి పాఠ్యాంశాలకు సంబంధించిన సృజనాత్మక కృత్యాలను ు జంతువుల ముఖాకృతులు, కరపుత్లీలు , త్రిభుజాకృతుల బొమ్మలు వివిధ విద్యా నమూనాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాల శుభ్రత, మధ్యాహ్న భోజన (ఎండిఎం) వంటగది, కిచెన్ గార్డెన్‌లోని మొక్కలు, చెట్లను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గమనించి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బాజీ పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులు విద్యా సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తుండటానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయులు వి. పద్మశ్రీ, సిహెచ్. ఎస్. లక్ష్మి లను అభినంది ంచారు.

# తణుకులో విధులు బహిష్కరించిన పారిశుద్ధ్య కార్మికులు

## కార్మికులతో ఉన్నతాధికారుల చర్చలు విఫలం

తణుకు, అక్టోబర్ 21(ప్రభాత వార్త): తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమ మూడు నెలల వేతనబాకాయిలు చెల్లించాలని, 41 నెలల పిఎఫ్ బాకాయి సొమ్ము కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరుతూ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. అధికారులు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయకుండా మున్సిపల్ వర్కర్స్ తో ఆసుపత్రి పారిశుద్ధ్య పనులు నిర్వర్తింపచేయడం దురదృష్టకరమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. 41 నెలలుగా కార్మికుల పి.ఎఫ్ సొమ్ము కట్టకుండా కార్మికుల సొమ్ము దోచుకుంటున్న ఫస్ట్ ఆబ్జెక్ట్ కాంట్రాక్టరుకు వైద్య, ఆరోగ్య శాఖాధికారుల బిల్లులు ఎలా మంజూరు చేశారని భీమారావు ప్రశ్నించారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, పెదవేగి, దెందులూరు, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించవలెను.
ఫోన్:9704502377

## తుఫాన్ ప్రభావం వల్ల పేరుపాలెంబీచ్ కు

# పర్యాటకులకు అనుమతి లేదు




మొగల్తూరు అక్టోబర్ 21( ప్రభాతవార్త) :బంగాళాఖాతంలో ఏర్పడి... అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉన్నందున మొగల్తూరు మండల... పేరుపాలెం బీచ్లో పర్యాటకుల అనుమతి లేదని మొగల్తూరు స... ఇన్స్పెక్టర్ జి వాసు విలేకరులకు తెలిపారు. బంగాళాఖాతంలో తుఫా... హెచ్చరికలు రద్దు పరిచిన అనంతరం పర్యాటకులకు అనుమ... ఇస్తామని ఆయన తెలిపారు.

# పెనుమత్స రంగరాజుహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ



మొగల్తూరు అక్టోబర్ 21( ప్రభాతవార్త)ఇటీవల తణుకులో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో మొగల్తూరుశ్రీ పెన్మత్స రంగ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు మంగళవారం ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ అండర్ 17 విభాగంలో రన్నింగ్ 800 మీటర్ల పరుగు పందెంలో నంగనం శ్రీవిద్య, మూటూరి అంజలిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. జిఎస్టి 2.0 సూపర్ సేవింగ్స్ కు సంబంధించి జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో షేక్ చాందిని ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయుడు సర్కార్. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అప్పాజీ, సిబ్బంది అభినందించారు.

# గురుకుల పాఠశాలను పరిశీలించిన డిసిఓ



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త :తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం డిసిఓ ఉమా కుమారి సందర్శించారు. ఈ కాలేజీలోని అన్ని తరగతి గదులను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో ఉమా కుమారి మాట్లాడారు. అనంతరం కళాశాల, పాఠశాలల ఉపాధ్యాయులతో లెక్చరర్లతో డిసిఓ సమావేశమై కళాశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఆమె మాట్లాడారు. రానున్న పబ్లిక్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ థియరీ పరీక్షలు బాగా రాసి మంచి ర్యాంకులతో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఉపాధ్యాయులతో లెక్చరర్లతో డిసిఓ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో మంచి వాతావరణం ఉండాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా డి సి ఓ ఉమా కుమారి మాట్లాడుతూ పాఠశాల కళాశాల లో నెలకొన్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని చెప్పారు. ప్రిన్సిపాల్ సెలవులో ఉన్నందున ఆయన రాగానే సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డి సి ఓ ఉమా కుమారి విలేకరులకు తెలిపారు.

## బాల్యం నుంచే క్రీడలను ప్రోత్సహించాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం , ప్రభాతవార్త: బాల్యం నుంచే విద్యార్థులను వివిధ రకాల క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వెయిట్ లిఫ్టింగ్ లో మెడల్స్ సాధించిన విద్యార్థులను స్థానిక కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు గ్రామ ప్రజల ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తారని అన్నారు. అత్తిలి మండలం ఉరదాళ్ళ పాలెం గ్రామానికి చెందిన చవ్వాకుల తులసిదుర్గను సత్కరించారు. నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ లో ప్రథమ స్థానం తో 2 గోల్డ్ మెడల్స్, 1రజితం సాధించిన తులసి దుర్గ మరిన్ని విజయాలు సాధించాలని, రాష్ట్రానికి,దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

# తెర




## దీపావళి స్పెషల్ పోస్టర్
### 'మన శంకర వరప్రసాద్ రావు గారు'

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2026 సంక్రాంతికి బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లో ఒకటి. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రాన్ని అర్చన గర్వంగా సమర్పిస్తున్నారు. దీపావళి సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. చిరంజీవి అద్భుతమైన యంగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. లైట్ గ్రీన్ హుడ్ జాకెట్, వైట్ టీషర్ట్, మ్యాచింగ్ ట్రౌజర్స్‌లో స్టైలిష్‌గా అదరగొట్టారు. మెగాస్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ స్టైల్‌తో బ్లాక్ మోంటెన్ బైసికిల్‌పై సవారీ చేస్తూ కనిపించడం ఆకట్టుకుంది. స్టైలిష్ గ్లాసెస్, ట్రిమ్ చేసిన గడ్డం ఆయన లుక్‌కు మరింత యూత్‌ఫుల్ ఫీల్ ఇచ్చాయి. పోస్టర్ మొత్తం ఎనర్జీ, ఫెస్టివ్ వైబ్స్‌తో నిండిపోయింది. చిరంజీవి పక్కనే ఇద్దరు స్కూల్ పిల్లలు కూడా తమ సైకిళ్లపై సవారీ చేస్తూ కనిపించటం పోస్టర్‌కి మరింత ఫ్యామిలీ ఫ్రెండ్లీ టచ్‌ను జోడించింది. ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' ఇప్పటికే సూపర్ హిట్‌గా దూసుకెళ్తోంది. రికార్డ్ వ్యూస్ సాధించిన ఈ మెలోడియస్ సాంగ్ ప్రస్తుతం అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫార్మ్స్‌లో ట్రెండింగ్‌లోనే ఉంది. చిరంజీవి గ్రేస్, స్వాగ్‌ను అద్భుతంగా చూపించిన ఈ పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆదినారాయణ సహరచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీ గణేష్.



## ఓజీపై రూమర్స్‌కు చెక్ పెట్టిన సుజీత్



పవర్‌స్టార్‌పవన్‌కళ్యాణ్ నటించిన రీసెంట్ బ్లాక్‌బస్టర్ చిత్రం ఓజీ ఇటీవల రిలీజ్ అయి బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసింది .దర్శకుడు సుజీత్ ఈ సినిమాను ప్యూర్ మాస్‌యాక్షన్ ఎంటర్ టైనర్‌గా రూపొందిం చిన తీరు ప్రేక్షక ులనుమెప్పి ంచింది. ఇకపవన్ కళ్యాణ్ నిఅభి మానులు ఎలా అయితే చూడా లని కోరుకున్నారో, సుజీత్ అలా చూపెట్టడంతో ఈ సినిమాకు అభిమానులు పట్టం కట్టారు. బాక్సాఫీస్ దగ్గర ర్యాంపేజ్ చూపెట్టిన ఓజీ, ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతున్న ఈ సినిమాపై సోషల్ మీడియాలో పలు రూమర్స్ చక్కర్లు కొడుతున్నాయి. ఈ చిత్రా నిర్మాత, డైరెక్టర్‌కుమధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయనే వార్తు సినీ సర్కిల్స్‌లో రుగా చక్కర్లు కొట్టాయి. అయితే, ఈ పుకార్లకు దర్శకుడు సుజీత్ తాజాగా చెక్ పెట్టాడు. ఆయన ఓఓపెన్‌లెటర్‌తో ఈరూమర్స్‌కు ఫుల్‌స్టాప్‌పెట్టాడు. ఓజీ చిత్రాన్ని రూపొందించేందుకు చిత్ర యూనిట్ అందరూ తీవ్రంగా కష్టపడ్డామని.. తనకు అండదండగా నిలిచిన నిర్మాతలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని.. సినిమాను పూర్తి చేసేందుకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ అంటూ ఆయన లెటర్ రాశారు. దీంతో ఓజీ చుట్టూ వస్తున్న వార్తలకు ఫుల్ స్టాప్ పడింది .

## అట్లీ, చింగ్స్ దేశి చైనీస్ ధమాకేదార్ చిత్రం
### 'ఏజెంట్ చింగ్ దాడి'

రికార్డుబ్రేకర్ సినిమాలైన‌జవాన్, బిగిల్, మెర్సల్‌తో ప్రసిద్ధి చెందిన బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ, చింగ్స్ దేశి చైనీస్ యొక్క ధమాకేదార్ చిత్రం 'ఏజెంట్ చింగ్ దాడి'తోపెలుడుప్రకటనలలోతనమొదటి డెబ్యూని చేస్తున్నాడు. ఇదిఒకఅతి పెద్దప్రకటన క్యాంపెయిన్. చింగ్స్ మాస్కాట్, సెన్సేషనల్ రాణ్వీర్ సింగ్‌తో ఇప్పుడు సూపర్‌స్టార్లు శ్రీలీల, బాబీ డియోలు చేరారు. ఈ భారీ చిత్రం అట్లీ శైలిలో, ఎన్నడూ చూడని విజువల్ ఎఫెక్ట్స్, థ్రిల్లింగ్ యాక్షన్‌తో వస్తోంది. అద్భుతమైన క్రూ ఏకం అయి స్పెక్టాకిల్‌ను సృష్టించారు. దర్శకుడు అట్లీ మాట్లాడుతూ, నాకు ప్రేమే రహస్య పదార్థం. చింగ్స్ భారతదేశం ఇంతవరకు చూడనిది చూడాలని కోరుకుంది. అందుకే నేను నా మొదటి ప్రకటనకు అవును అని చెప్పాను. రాణ్వీర్ ఉన్మాదం, బాబీసర్ మ్యాజిక్, శ్రీలీల తాజాతనం మేము ఇదంతా చాలా హృదయపూర్వకంగా చేసాము. ఇప్పుడు ప్రేక్షకులు దానిని చూడాలి. కొత్తచింగ్స్ దేశి చైనీస్ ప్రకటన నిజంగానే ప్రకటన సినిమా మధ్య ఉన్న రేఖను తుడిచిపెట్టింది. ఇది 8నిమిషాల గూస్‌బంప్ అనుభవం, డ్రామా, కామెడీ, యాక్షన్, సంగీతం, మసాలాతో నిండినది. ఈ ప్రకటన శ్రీలీలతో గ్లామర్ కోట్‌ను పెంచి, లార్డ్ బాబీతో వేడిని పెంచింది! యానిమల్, దిబాడ్స్ ఆఫ్‌బాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్ కమ్‌బ్యాక్‌ల తర్వాత, బాబీ డీఓల్ తన స్వాగ్‌ను మళ్లీ చింగ్స్ యూనివర్స్‌కు తీసుకువచ్చాడు. టాటాకన్స్యూమర్ ప్రొడక్ట్స్ అధ్యక్షురాలుదీపికాభాన్ మాట్లాడు తూ, చింగ్స్‌లోప్రతి ప్రాజెక్ట్ ఒక బ్లాక్‌బస్టర్ అయిఉండాలని మేము ఎల్లప్పుడూ నమ్ముతునా ్నము. బోల్డ్, ఫ్లేవర్‌ఫుల్‌గా రాణ్వీర్‌చింగ్‌యాక్షన్‌లో తిరిగివచ్చాడు. ఉత్తేజం అందరిసమయంలో అత్యధికం .ఐదు చిత్రాల తర్వాత, అతనిఎనర్జీ ఇంకా ఇంటిపై కప్పును ఊపేస్తోంది. ఇదిమాఅతిపెద్ద, అతిబోల్డ్ దేశిచైనీ న్ ప్రాజెక్ట్. మసాలా, డ్రామా, ప్యూర్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పేలుతోంది. ఇదిఖచ్చితంగా అగ్‌లగాదే! ఈ చిత్రంలో శంకర్‌ఏషాన్‌లాయ్‌కంపోజ్‌చేసినఐకానిక్ ఆంథెమ్ మైనేమ్ ఇజ్‌రాణ్వీర్ చింగ్ సౌండ్‌ట్రాక్‌కూడా ఉంది. అరిజిత్‌సింగ్‌వాయిసెస్, లెజెండరీగుల్జార్ సాహెబ్ లిరిక్స్, ఇప్పుడుసాయి అభ్యంకర్ రీవర్షన్‌తో, ఇప్పటికే ప్రతిచోటాఎయిర్‌వేవ్స్‌లో తాకుతోంది. నిజమైన అర్థంలో, చింగ్స్ దేశి చైనీస్ యొక్క ఏజెంట్ చింగ్ దాడి అగ్‌లగాదే చేయడానికి సిద్ధంగా ఉంది.



## దీపావళి సందర్భంగా ప్రభాస్ హనుకాన్సెప్ట్ పోస్టర్ రిలీజ్



రెబెల్‌స్టార్ ప్రభాస్, క్రియేటివ్ డైరెక్టర్ హాను రాఘవపూడి, మైత్రి మూవీ మేకర్స్, టిసిరీస్ ప్రజెంట్స్ పాన్ ఇండియాప్రాజెక్ట్ ప్రభాస్ హను కాన్సెప్ట్‌పోస్టర్‌దీపావళి సందర్భంగా రిలీజ్, డీక్రిప్షన్ అక్టోబర్ 22న ప్రారంభం వరుస బ్లాక్‌బస్టర్‌లైన సలార్, కల్కి 2898 ఎడిచిత్రాలతో ఫుల్‌స్వింగ్‌లో ఉన్న రెబెల్‌స్టార్ ప్రభాస్ ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడిదర్శకత్వంలో బిగ్గెస్ట్ పాన్‌ఇండియా వెంచర్‌లో నటిస్తున్నారు.

ప్రఖ్యాతపాన్ ఇండియా నిర్మాణసంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. టిసిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్ సమర్పిస్తున్నారు. దీపావళి శుభ సందర్భంగా ఈచిత్రం కాన్సెప్ట్ పోస్టర్ విడుదలైంది. మ్యాసీవ్ రైఫిల్స్ ఒకక్లస్టర్‌లో అమర్చబడి, కొన్ని యాంగిల్స్ నిటారుగా, కాల్పులు జరుపుతూ, యుద్ధవాతావరణాన్ని చూపించాయి.

ఒంటరి బెటాలియన్‌లాగా నిలబడిఉన్నప్రభాస్‌సిల్హౌట్ అదిరిపోయింది. అతను పద్మవ్యూహాన్ని జయించిన పార్థుడు"అని పోస్టర్ పై రాసి వుండటం మహాభారతంలోని అర్జునుడిని పొయెటిక్ గా ప్రజెంట్ చేస్తోంది. ఈ హైస్టేక్స్ వార్ డ్రామాలో ప్రభాస్‌తోపాటు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ లాంటి వెటరన్ యాక్టర్స్ పవర్ ఫుల్ పాత్రల్లో నటిస్తున్నారు. ప్రభాస్ సరసన ఇమాన్వి మహిళా కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం ప్రభాస్, హను రాఘవపూడి, మైత్రి మూవీ మేకర్స్ ఫస్ట్ కొలాబరేషన్. ఈ త్రయం పరిశ్రమ అంతటా మ్యసీవ్ బజ్‌ను సృష్టిస్తుంది. ఆసక్తిని మరింత పెంచుతూ చిత్రబృందం అనే లైన్‌తో ఓ పెద్ద అప్‌డేట్ రాబోతోందని ఎక్స్‌యిట్ చేసింది. అంటే, అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు కంటే ఒక రోజు ముందే ఒక సిగ్నిఫికెంట్ రివీల్ ఉండబోతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. సినిమాటోగ్రఫీని సుదీప్‌చటర్జీ నిర్వహిస్తుండగా, సంగీతాన్ని విశాల్ చంద్రశేఖర్ అందిస్తున్నారు. ప్రొడక్షన్‌డిజైన్‌అనిల్‌విలాస్ జాధవ్ చేపట్టగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ ప్రాజెక్ట్‌ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. అద్భుతమైన విజన్, అత్యుత్తమ టెక్నికల్ టీం, ప్రముఖ నిర్మాణ సంస్థల మద్దతు, ఇంతకుముందు ఎప్పుడూ చూడని అవతార్‌లో నటిస్తున్న స్టార్ హీరో ప్రభాస్,, ఇవన్నీ కలగలిపి సినిమా థియేటర్లలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌గా నిలవబోతోంది. తారాగణం: ప్రభాస్, ఇమాన్వి, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ .సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: హను రాఘవపూడి బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్.

## 'రోలుగుంట సూరి' ఫస్ట్ లుక్ ఆవిష్కరణ




నటకిరీటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా విలేజ్ బ్యాక్ డ్రాప్‌లోరూపొందుతున్న రియలిస్టిక్ ఎమోషనల 'డ్రామా'రోలుగుంటసూరి'ఫస్ట్ లుక్‌పోస్టర్‌ను ప్రముఖ నటుడు నటకిరీటి రాజేంద్రప్రసాద్ ఘనంగా ఆవిష్కరి ంచారు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన..లిపిహీరో హీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్‌క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం రాజేంద్రప్రసాద్‌మాట్లాడుతూ ఇలాంటి సినిమాలు సైలెంట్‌గా వచ్చి పెద్ద సంచలనం సృష్టిస్తాయి. దర్శకుడు అనిల్ కుమార్ పల్లా హృదయాన్ని తాకే సబ్జెక్ట్‌ని చాలా అద్భుతంగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఫస్ట్ లుక్ చాలా ఇంప్రెస్ చేసింది. సినిమా కూడా అలాగే అద్భుతంగా ఉండబోతోందనే నమ్మకం ఉంది, చిత్రయూనిట్‌కు అభినందనలు" అని అన్నారు. దర్శకుడు అనిల్ కుమార్‌పల్లా మాట్లాడుతూ, మా సినిమా ఫస్ట్ లుక్‌నుఆవిష్కరించిన నటకిరీటి రాజేంద్రప్రసాద్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆయన అభినందనలు మాకు మరింత నమ్మకం, ఉత్సాహం ఇచ్చాయి. అదేఉత్సాహంతోసినిమాను మరింతాఅద్భుతంగా చిత్రించి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా కృషి చేస్తున్నాం" అని తెలిపారు. నిర్మాత సౌమ్యచాందినిపల్లా మాట్లాడుతూ, 'రోలుగుంటసూరి'ఒక రియలిస్టిక్ విలేజ్ డ్రామా. భావోద్వేగాలతో, జీవిత సత్యాలతో మిళితమైన ఈ కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. మా టీమ్‌లో ప్రతి ఒక్కరు అద్భుతంగా తమ ప్రతిభను చూపుతున్నారు. ఈ సినిమా తెలుగు సినీ చరిత్రలో నిలిచిపోయేలా అవుతుందనే నమ్మకం మాకు ఉంది, అని తెలిపారు. ఇలాంటి సినిమాలు గ్రామీణ జీవన శైలిని, భావోద్వేగాలను నిజ జీవితానికి దగ్గరగా చూపిస్తాయని యూనిట్ సభ్యులు తెలిపారు. రోలుగుంట సూరిప్రేక్షకుల హృదయాల్లో సుస్థిరమైన స్థానంసంపాదిస్తుందనేనమ్మకం వ్యక్తం చేశారు. సాంకేతిక విభాగం: నటీనటులు: నాగార్జున పల్లా , ఆధ్యారెడ్డి, భావన నీలిపి, బ్రహ్మానందరెడ్డి, సత్యనారాయణ, ఆయుషా, జ్యోతి, మహర్షి రమణ, ముకుందం శ్రీనునిర్మాత: సౌమ్య చాందిని పల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: ఊరికూటి తాతారావు, పల్లా సత్యనారాయణ, దర్శకుడు: అనిల్ కుమార్ పల్లా, సంగీతం: సుభాష్ ఆనంద్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్: సందీప్ చక్రవర్తి. ఎడిటింగ్: ఆవుల వెంకటేష్ కథ, డైలాగ్స్: మహ్మద్ సాయి ఫైట్స్: వాసు ఆర్ట్ డైరెక్టర్: రమేష్ కోడైరెక్టర్: సుభాష్ రెడ్డి పబ్లిసిటీ డిజైన్: ఇమేజ్ 7 అడ్వర్టైజింగ్‌పీఆర్వో: దయ్యాల అశోక్ ,కడలి రాంబాబు.

## 'కాగితం పడవలు' బ్యూటిఫుల్ గ్లింప్స్ రిలీజ్



ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ గి. శి. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. మేకర్స్ తాజాగా రిలీజ్ చేసిన గ్లింప్స్ హార్ట్ టచ్చింగ్‌గా ఉంది. డైలాగ్స్ ప్రేమకథలోని డెప్త్ ని తెలియజేస్తున్నాయి. తీరంలో ఓ జంట ప్రేమగా మాట్లాడుకోవడం, విజువల్స్, నేపథ్య సంగీతం అన్నీ అద్భుతంగా వున్నాయి. గ్లింప్స్ చాలా క్యూరియాసిటీ పెంచింది. దర్శకుడు ఎంజీఆర్ తుకారాం లవ్లీ ఎమోషన్స్, హృదయాన్ని తాకే కథ, అందమైన విజువల్స్ తో ఈ చిత్రాన్ని మలిచినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమోతోంది. ఈ చిత్రానికి .నౌఫల్ రాజామ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి జానా డీవోపీగా పని చేస్తున్నారు జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రచన దర్శకత్వం: ఎంజీఆర్ తుకారాంనిర్మాతలు: కీర్తన నరేష్, ,ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప సంగీతం : తి.శీ.నౌఫల్ రాజాడీవోపీ: రుద్రసాయిఎడిటర్: జెస్విన్ ప్రభు కాస్ట్యూమ్స్: కిరణ్‌ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం.హిమ బిందుసాహిత్యం: రెహమాన్‌పీఆర్వో: తేజస్వి సజ్జా.


## చార్మింగ్ స్టార్ శర్వా,అభిలాష్ రెడ్డి 'బైకర్ రగ్డ్' ఫస్ట్‌లుక్



చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్ రెడ్డి, గీజు క్రియేషన్స్ 'బైకర్' రగ్డ్ స్పోర్టీ ఫస్ట్ లుక్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వా తన 36వచిత్రంశర్వా36లో మోటార్ సైకిల్ రేసర్ పాత్రను పోషిస్తున్నారు. అభిలాష్‌రెడ్డి దర్శకత్వంలో గీజుక్రియేషన్స్ ప్రతిష్టాత్మకబ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యే దశలోఉంది. దీపావళి సందర్భంగా నిర్మాతలు ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకి 'బైకర్' అనే పర్ఫెక్ట్ టైటిల్‌ను లాక్ చేశారు, ఇది సినిమా నేపథ్యాన్ని సూచిస్తుంది. శర్వా ఇంటెన్స్ బైకర్ డ్రెస్ లో స్పోర్ట్స్ బైక్‌పై కనిపించడం అదిరిపోయింది. తన లుక్ సినిమా యాక్షన్‌ప్యాక్డ్ పల్స్ ప్రజెంట్ చేస్తోంది. బోల్డ్ రెడ్ టైటిల్ లోగో ఆకట్టుకుంది. 1990, 2000ల బ్యాక్ డ్రాప్ లో ఈ చిత్రం, రేసింగ్ డ్రీమ్స్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాగా ఉండబోతుంది. శర్వాసరసన మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జె యువరాజ్ సినిమాటోగ్రఫీని, జిబ్రాన్ సంగీతం సమకూరుస్తున్నారు, అనిల్ కుమార్ పి ఎడిటింగ్, రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్‌నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ఎపన్నీర్‌సెల్వం ఆర్ట్‌డైరెక్టర్. బైకర్‌యాక్షన్, ఎమోషన్, నోస్టాల్జియాతోకూడిన గ్రిప్పింగ్ రైడ్‌గా ఉంటుంది. తారాగణం:చార్మింగ్‌స్టార్‌శర్వా, మాళవికనాయర్, బ్రహ్మాజీ, అతుల్‌కులకర్ణి ,సాంకేతిక బృందం:రచన, దర్శకత్వం: అభిలాష్ రెడ్డి, నిర్మాతలు: వంశీప్రమోద్‌సమర్పణ: విక్రమ్‌బ్యానర్: యువి క్రియేషన్స్, సంగీతం: జిబ్రాన్‌డిఓపి: జె యువరాజ్ ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్‌ఎడిటర్: అనిల్ కుమార్ పిఆర్ట్ డైరెక్టర్: ఎపనీర్ సెల్వం, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

## ఆకట్టుకుంటున్న 'అనగనగ ఒక రోజు'




సంక్రాంతికి వినోదాల విందుని హామీ ఇస్తున్న ప్రోమోత్వరలో 'అనగనగా ఒక రాజు' మొదటి గీతం విడుదల తనదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉంది. నవీన్ యొక్క అద్భుతమైన హాస్య చతురత, అప్రయత్నమైన ఆకర్షణ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు కట్టిపడేసింది. ఈ దీపావళి ప్రోమో వినోదాల విందులా ఉంది. నవీన్ పొలిశెట్టి శైలి హాస్యాన్ని ప్రేక్షకులు ఎందుకు అంతలా ఇష్టపడతారో ఈ ప్రోమో మరోసారి గుర్తుచేసింది. రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని ఒక నవ్వుల అల్లరి, వినోదాల విందు, ..అసలైన పండుగ సినిమా.. అని పిలుస్తున్నారు. హాస్యం, తాజాదనంతో నిండి, ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె సరికొత్త వినోదాన్ని పంచనున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి, జె యువరాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న .అనగనగా ఒక రాజు.పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో, ఆ అంచనాలను రెట్టింపు చేసింది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా 'అనగనగ ఒక రాజు' చిత్రాన్ని నిలిపింది. సరదాల పండుగ మొదలవుతుంది. దీపావళి ప్రోమో ఆకట్టుకుంది. మొదటి గీతం రాబోతుంది. ..అనగనగా ఒక రాజు ఈ సంక్రాంతిని గుర్తుండిపోయేలా చేయడానికి సిద్ధమవుతోంది. చిత్రం: అనగనగా ఒక రాజు తారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి ఛాయాగ్రహణం: జె. యువరాజ్, సంగీతం: మిక్కీ జె. మేయర్ దర్శకత్వం: మారి నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సమర్పణ: శ్రీకర స్టూడియోస్‌పీఆర్ఓ: లక్ష్మీవేణుగోపాల్ .

## రష్మికమందన్న,రవీంద్రపుల్లె
### డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'మైసా'

రష్మిక మందన్న, రవీంద్ర పుల్లె, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పాన్ ఇండియా ఫిల్మ్ నేషనల్ క్రష్‌రష్మిక మందన్న రవీంద్ర పుల్లె డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్న మైసా అనే పవర్‌ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తోరాబోతున్నారు. ఈచిత్రం ఇప్పటికే ఆసక్తికరమైన టైటిల్, అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో బజ్‌ను సృష్టించింది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ మైసాను భారీ బడ్జెట్‌తో పాన్‌ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీపావళి సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రష్మిక ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. త్వరలో గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. మైసా గోండ్ తెగల బ్యాక్ డ్రాప్ లో హైఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. రష్మిక మందన్న ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవాతర్ లో కనిపిస్తుంది. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్‌మ్యూజిక్ అందిస్తున్నారు. సూర్య రెట్రోసినిమాకిపని చేసిన శ్రేయాస్‌పికృష్ణ డీవోపీగా పనిచేస్తున్నారు. యాక్షన్ నికల్కి2898 ఏ డీఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు. తారాగణం: రష్మిక మందన్న సాంకేతిక నిబ్బంది: రచన, దర్శకత్వం: రవీంద్ర పుల్లె నిర్మాతలు:అన్‌ఫార్ములా ఫిల్మ్స్, మ్యూజిక్:జేక్స్ బిజోయ్‌డీవోపీ: శ్రేయాస్ పి కృష్ణస్టంట్స్: ఆండీ లాంగ్‌డిఓపి: వంశీశేఖర్ డిజిటల్:హాస్టాగ్ మీడియా



# భగినీ హస్త భోజనం



భాయి దూజ్ లాగానే భగినీ హస్త భోజనం అనే సంప్రదాయం సోదరులు మరియు సోదరీమణుల మధ్య బంధాన్ని మరింతగా పెంచుతుంది. దీనిని ప్రధానంగా తెలుగు సమాజం ఆచరిస్తుంది. సోదరులు తమ సోదరీమణుల చేతుల నుండి తినే ఈ ఆచారం పరస్పర ప్రేమ, గౌరవం మరియు రక్షణను సూచిస్తుంది. సోదరీమణులు తమ సోదరులను పూజిస్తారు, తిలకం వేస్తారు మరియు వారి శ్రేయస్సు మరియు విజయం కోసం ప్రార్థనలు చేస్తారు. తమ సోదరులకు ఆహారం పెట్టడం ద్వారా, సోదరీమణులు ఆశీర్వాదాలు మరియు దీర్ఘాయువును ప్రసాదిస్తారు. ప్రతిగా, సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు అందజేస్తారు, కృతజ్ఞత మరియు ఆప్యాయతను వ్యక్తం చేస్తారు. ఈ మార్పిడి కుటుంబ సంబంధాలను బలపరుస్తుంది, ఐక్యత మరియు ఐక్యత యొక్క భావాన్ని పెంపొందిస్తుంది. తెలుగు సమాజంలో, భగినీ హస్త భోజనం అనేది సోదరులు మరియు సోదరీమణుల మధ్య పవిత్ర బంధాన్ని బలోపేతం చేసే గౌరవనీయమైన సంప్రదాయం. భాయ్ దూజ్ రోజున ఆచరించే ఈ ఆచారం తోబుట్టువుల మధ్య లోతైన అనురాగం మరియు పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. సోదరీమణులు తమ సోదరులను పూజిస్తారు, తిలకం వేస్తారు మరియు వారి శ్రేయస్సు మరియు దీర్ఘాయువు కోసం ప్రార్థనలు చేస్తారు, సోదరులు తమ సోదరీమణుల ఆశీర్వాదాలను కోరుకుంటారు. తమ సొంత చేతులతో తమ సోదరులకు ఆహారం పెట్టడం ద్వారా, సోదరీమణులు ప్రతీకాత్మకంగా వారిని పెంచి పోషిస్తారు మరియు రక్షిస్తారు. ఈ పరస్పర మార్పిడి కుటుంబ సంబంధాలను బలపరుస్తుంది, ఐక్యత మరియు కలిసికట్టుగా ఉంటుంది. భగినీ హస్త భోజనం తన సోదరి శ్రేయస్సును కాపాడతానని సోదరుడు ఇచ్చిన వాగ్దానాన్ని కూడా సూచిస్తుంది. ఈ ప్రతిష్టాత్మకమైన ఆచారం తెలుగు సంస్కృతికి మూలస్తంభం, తోబుట్టువుల సామరస్యం, విధేయత మరియు జీవితకాల సంబంధాన్ని నిర్ధారిస్తాయి. భగినీ హస్త భోజనం ఆచారాలు సోదరుడు తన సోదరి ఇంటికి వచ్చినప్పుడు, అక్కడ అతనికి సాదర స్వాగతం లభిస్తుంది. సోదరి తన ఆశీర్వాదం మరియు రక్షణను సూచిస్తూ అతని నుదిటిపై తిలకం (సింధ్ర గుర్తు) ఉంచు తుంది. తరువాత ఆమె తన సోదరుడి ముందు వెలిగించిన దీపాన్ని ఊపుతూ హారతి ఇస్తుంది. సోదరి ఒక ప్రత్యేక భోజనం తయారు చేస్తుంది, తరచుగా సాంప్రదాయ తెలుగు వంటకాలు, ఆమె తన చేతులతో తన సోదరుడికి వడ్డిస్తుంది. ఈ తినిపించే చర్య పవిత్రంగా పరిగణించబడుతుంది, ఇది సోదరి పెంపకం మరియు సంరక్షణను సూచిస్తుంది. సోదరుడు, తన సోదరికి బహుమతులు అందజేస్తాడు, ఇది అతని కృతజ్ఞత మరియు ఆప్యాయతకు ప్రతీక. ఈ పరస్పర మార్పిడి వారి భావోద్వేగ సంబంధాన్ని బలపరుస్తుంది. ఈ ఆచారం సోదరుడు తన సోదరి ఆశీర్వాదం కోరుతూ, గౌరవ చిహ్నంగా ఆమె పాదాలను తాకడంతో ముగుస్తుంది. సోదరి తన సోదరుడి శ్రేయస్సు, ఆనందం మరియు దీర్ఘాయువు కోసం ప్రార్థిస్తూ ఆశీర్వదిస్తుంది. భగినీ హస్త భోజనం ఆనందకరమైన కుటుంబ సమావేశంలో ముగుస్తుంది, తోబుట్టువుల బంధాన్ని బలోపేతం చేస్తుంది మరియు కుటుంబ సభ్యులలో ఐక్యతను పెంపొందిస్తుంది. ఈ ప్రతిష్టాత్మకమైన సంప్రదాయం తోబుట్టువుల ప్రేమ మరియు పరస్పర మద్దతు యొక్క శాశ్వత శక్తికి నిదర్శనం. □

# జపాన్‌లో కొత్తచరిత్ర సృష్టించిన సనా తకాయిచి

జపాన్ రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా కన్జర్వేటివ్ నేత సనా తకాయిచి (64) ఎన్నికై చరిత్ర సృష్టించారు. పార్లమెంట్ దిగువ సభలో జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. గత నెలలో ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ షిగెరు ఇషిబా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

పార్లమెంటులోని 465 స్థానాలున్న దిగువ సభలో జరిగిన ఓటింగ్‌లో సనా తకాయిచికి 237 ఓట్లు లభించాయి. దీంతో ఆమె మెజారిటీ మార్కును సునాయాసంగా దాటారు. ఎగువ సభ ఆమోదం కూడా పొందిన తర్వాత, ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో జపాన్ ఒకటి. అక్కడి రాజకీయాల్లో మాత్రం మహిళల పాత్ర చాలా తక్కువ లింగ సమానత్వంలో ప్రపంచవ్యాప్తంగా ఆ దేశ ర్యాంకు ఏకంగా 100కు పైమాటే! అలాంటి దేశ పగ్గాలను అందుకున్నారు సనై తాకాయించి. సనై పుట్టింది జపాన్‌లోని నారాలో. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ చేశారు. మోటార్ సైకిళ్లంటే ప్రాణం. హెవీ మెటల్ డ్రమ్మర్ కూడా. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం. అయినా అకస్మాత్తుగా రాజకీయాల మీద ఆసక్తి పెంచుకుని, పబ్లిక్ సర్వీస్‌లో కోర్సు నీ చేశారు. 1993లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన సనై.. ఎకనామిక్ సెక్యూరిటీ మినిస్టర్ సహా ఎన్నో కీలక పదవులను చేపట్టారు. బ్రిటన్ మాజీ ప్రధాని ఐరన్ లేడీగా పేరొందిన మార్గరెట్ థాచర్ ఆమెకు ఆదర్శం. ఆమెలాగే సనైది కూడా దృఢమైన నాయకత్వశైలి. పైగా సంప్రదాయవాది. జాతీయ రక్షణ విషయంలో కఠిన వైఖరి తప్పనిసరి అంటారు. అందుకే సనైనీ 'ఐరన్ లేడీ 2.0గా పిలుస్తుంటారు. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు ఎల్డీపీ ఎన్నికల్లో సనై.. వ్యవసాయశాఖ మంత్రి షింజిరో కోయిజుమిని ఓడించారు. అలా జరిగితే ఆ దేశ తొలి మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టిస్తారు సనై. ఈమె ఎంపికతో రాజకీయాల్లో ఆసక్తి పెరుగుతుందన్న ఆశ వారిలో వ్యక్తమవుతోంది. అయితే ఈమె సంప్రదాయ భావాలకు మహిళల్లో వ్యతిరేకత ఉంది. దీనికితోడు రాజకీయ అనిశ్చితి, ద్రవ్యోల్బణం, అమెరికా సుంకాలు, వలసలు వంటి ఎన్నో సవాళ్లు ఆమె ముందున్నాయి. వీట నాయికగా సమర్థంగా పరిష్క రిస్తూ... రాజకీయాల్లో మహిళా ప్రాధాన్యం పెంచుతానంటున్నారు 64ఏళ్ల సనై తకాయిచి. చక్రవర్తిని కలిసిన అనంతరం ఆమె అధికారికంగా బాధ్యతలు చేపడతారు. చైనా విధానాలపై తీవ్ర విమర్శలు చేసే వ్యక్తిగా గుర్తింపు పొందిన తకాయిచి, గతంలో హెవీ మెటల్ డ్రమ్మర్‌గా కూడా పనిచేశారు. అక్టోబర్ 4న అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్షురాలిగా ఆమె ఎన్నిక య్యారు. అయితే, ఆమె కన్జర్వేటివ్ భావాలు, పార్టీలోని నిధుల కుంభకోణం కారణంగా పాత మిత్రపక్షమైన కొమెయిటో పార్టీ సంకీర్ణం నుంచి వైదొలిగింది. ఈ పరిణామంతో ఎల్‌డీపీ.. సంస్కరణవాద, మితవాద పార్టీ అయిన జపాన్ ఇన్నోవేషన్ పార్టీ (జేఐపీ)తో సోమవారం సాయంత్రం కొత్త పొత్తు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా తకాయిచి మాట్లాడుతూ "జపాన్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని, భావి తరాలకు బాధ్యత వహించే దేశంగా జపాన్‌ను తీర్చిదిద్దుతా" అని హామీ ఇచ్చారు. ఆమె సొంత పట్టణమైన



నారాలో ఒక విశ్రాంత ఉద్యోగి మాట్లాడుతూ "ఆమె మహిళ అయినా చాలా గట్టి మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఏది ఒప్పో, ఏది తప్పో స్పష్టంగా చెప్పగలరు" అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సవాళ్లను అధిగమించి, దేశాన్ని ప్రగతి దిశగా నడిపిస్తారోనన్న ఉత్కంఠే అందరిలోనూ ఉంది. □

# అపురూప వస్త్రాభరణం !



గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌ను చుట్టేసిన వస్త్ర వైభవం. ప్రకృతిలో దృశ్య సౌందర్యానికి ఎంత పేరు ఉందో, బాహ్య సౌందర్యానికి అంతే ఆకర్షణ ఉంటుంది. అతి లోక సౌందర్యానికైనా, అతివల అంద చందాలకయినా అందం, ఆభరణం, అలంకరణలకు పెట్టింది పేరు. కానీ వినీ ఎరుగని అద్భుత విలాసాలకు ఫ్యాషన్ ప్రపంచంలో దుబాయ్‌కి ప్రత్యేకస్థానముంది. ఈసారి ప్రపంచంలోనే అత్యంత బరువైన బంగారు 10.5 కిలోల బరువుతో ఉండి, డ్రెస్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. దీని విలువ సుమారు 10.88 లక్షల డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 9.5 కోట్లన్న మాట. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ ఆభరణాల సంస్థ 'అల్ రోమైజాన్ గోల్డ్' ఈ అద్భుతమైన వస్త్రాన్ని తయారు చేసింది. పూర్తిగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ డ్రెస్లో అత్యంత విలువైన వజ్రాలు, కెంపులు, పచ్చలు, రత్నాలను పొదిగారు. మధ్యప్రాచ్య కళానైపుణ్యం ఉట్టిపడేలా, అందం, సాధికారతకు ప్రతీకలుగా నిలిచే డిజైన్లతో దీనిని అలంకరించారు. ఈ డ్రెస్ ధరిస్తే కేవలం కళాఖండమే మన ముందు సాక్షాత్కరించినట్లనిపిస్తుంది. ఈ బంగారు వస్త్రపు వన్నె చిన్నెలను గమనిస్తే నాలుగు భాగాలుగా వర్ణించు కోవచ్చు.. ఇందులో 398 గ్రాముల బరువున్న బంగారు కిరీటం (టియారా), ఏకంగా 8,810,60 గ్రాముల బరువున్న నెక్లెస్, 134.1 గ్రాముల చెవిపోగులు, 738.5 గ్రాముల బరువున్న "హియార్' అని నడుము ఆభరణం ఉన్నాయి. ఇటీవల షార్జాలో జరిగిన 56వ మిడిల్ ఈస్ట్ వాచ్ అండ్ జ్యువెలరీ షోలో దీనిని ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనలోనే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు దీనిని అధికారికంగా గుర్తించారు. ఫ్యాషన్, ఆభరణాల తయారీ రంగాలను ఏకం చేసి, ధరించ గలిగే కళను ప్రపంచానికి పరిచయం చేయాలన్న లక్ష్యంతోనే ఈ డ్రెస్సు రూపొందించినట్లు తయారీ దారులు వెల్లడించారు. ఈ అపురూప వస్త్రాన్ని కేవలం ఆభరణాభిలాషుల కోసమే. భవిష్యత్తులో యూరప్, ఆసియాలోని పలు ముఖ్య నగరాల్లో జరిగే ఫ్యాషన్, జ్యువెలరీ ప్రదర్శనల్లో దీనిని ప్రదర్శించ నున్నట్లు తయారీ దారులు తెలిపారు. □

# పండుగ కానుకలు

మనకెన్ని పండగలైనా ఉండనివ్వండి. దీపావళి మాత్రం ప్రత్యేకం కదూ ప్రతి ఇల్లూ దీపాల వెలుగులో కళకళలడుపోతుంది ఇక చిన్నా పెద్దా అంతాకలిసి చేసే సందడే వేరు. అసలు .షాపింగ్‌తో ఆనందం మొదలయ్యేది అక్కణ్నుంచే మరి. ప్రతి పండగకీ స్నేహితులు, బంధువులతో మిఠాయిలు పంచుకోవడం మామూలే! కానీ దీపావళికి మాత్రం నోరు తీపి చేసుకోవడమే కాదు.. బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం రివాజుగా వస్తోంది. అందుకే పండగకి ముందు నుంచే ఎవరికి ఏమిద్దాం అని సతమతమవుతాం కానీ.. ఈ హడావుడి మన మనసుని తేలికపరుస్తుంది. అదెలా అంటే షాపింగ్‌లో ఉన్న మహత్తే ఇది. మనసు పడే ఒత్తిడి, బాధ అంతటినీ తుడిచేయగలదు. ఎన్నో అధ్యయనాలూ చెబుతున్న మాటిది. బాధ, ఒత్తిడి ఎప్పుడు కలుగుతాయి. మని చేతిలో ఏదీ లేదు. అన్నకున్నట్లుగా జరట్లేదు అనుకున్నప్పుడే కదా! షాపింగ్ అంటేకలర్, మోడల్, ఖరీదు.. ఒకటా రెండా ఎన్నెన్ని చూసుకోవాలి? అన్నింటినీ దాటి చివరగా ఒకటి ఎంచుకుంటాం చూడండి. అప్పుడు కలగే సంతృప్తి మాటల్లోన చెప్పతరమా? ఈ షాపులోదొరుకుతుందేమో.. అక్కడ మన కళ్లను కట్టిపడేసేది కనిపిస్తుందేమో అన్న ఎదురుచూపు, ఆతృత.. సంతోషాన్నిచ్చే హార్మోన్లను విడుదల చేస్తాయి. పైగా ఆ క్లాత్, ఈ మెటల్ అంటూ వెతికేక్రమంలో వేరే ఆలోచనలే దరిచేరవు. ఇక మీరెక్కణ్నుంచి వచ్చారు. మీకా బంధువులకా? పాప వయసెంత అంటూ కొత్తవాళ్లతో మాటలు కలిపేస్తామా.. ఈ సరికొత్త పరిచయాలూ మరింత ఉత్సాహాన్ని నింపేస్తాయి. ఆన్‌లైన్‌నా ఆఫ్‌లైననైనా.. డిస్కౌంట్ కోసం పక్కాగా చేస్తాం. ఎంత తగ్గతే అంత ఆదా చేశామన్న ఉత్సాహం ఇదీ థెరపీనే! మన కోసం ఏమైనా కొనుక్కుంటే కొత్త సరదా ఓవైను అది చూశాక ఇతరులు ఎలాంటి ప్రశంసలు ఇస్తారోనన్న ఉత్సాహం. వాటి గురించి వివరిస్తోంటే మాటల్లో ఒకింత గర్వం.. ఇవన్నీ మనసును ఉత్తేజితం చేస్తాయి. ఇక స్నేహితులు, బంధువులకు కొంటోంటే వాళ్లకేమిష్టం అని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాం. దానిలో వారిపట్ల మన ప్రేమ, కృతజ్ఞతను జోడిస్తాం. ఎలా ఇవ్వాలి? ఇచ్చాక వాళ్ల స్పందన ఎలా ఉంటుంది. అన్న ఆలోచనలు ఉద్వేగానికి గురిచేస్తాయి. ఇక



అందుకున్నవారి కళ్లల్లో కనిపించే ఆనందం.. వారితో బంధానికి మనమిస్తున్న విలువకు గుర్తింపే అది ఆత్మసంతృప్తినీ కలిగిస్తుంది. ఇంటి కోసం కొన్నా.. అది చిన్నదే అయినా నా మార్పు కొత్త ఆశలకు దారితీస్తుంది. దీపావళి అంటేనే చెడును దూరం చేస్తూ మంచికీ ఆనందానికి పలికే ఆహ్వానం అందుకే వాటిని స్వాగతిస్తూ సరదాగా షాపింగ్ చేసేయండి.

**ఇంతకీ ఏం ఇస్తున్నారు.......**

ఫ్యాషన్ అంటే ఇష్టపడేవారికి దుస్తులు, స్టేట్‌మెంట్ నగలు ఇవ్వొచ్చు. మొక్కలంటే ఇష్టపడేవారికి వాజ్‌లే కాదు.. ప్లాంట్ యాక్సెసరీలూ ఉత్తమ ఎంపికే! ఇవైతే హోమ్ డెకార్‌గానూ పనికొస్తాయి. దీపావళి వేళ కదా..సరికొత్తవి ఇవ్వండి. సెలబిలిటీని ప్రోత్సహిస్తూ మెటల్,రాక్ దియాలు, ఇయా బౌల్స్, కుందన్,రంగోలీ దియా, స్టిక్కర్లనీ ఇవ్వొచ్చు. ఓ వైపు సంప్రదాయానికి విలువిస్తూనే మరోవైపు పర్యావరణానికీ ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుంది. పండగంటేనే మిఠాయిలు.. అవి లేకుండా ఎలా? సరికొత్త రుచులతో గిఫ్ట్‌ప్యాక్‌లు ఇవ్వొచ్చు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారికి షుగర్ ఫ్రీ, నట్స్‌తో మిల్లెట్స్‌తో చేసిన రుచులు ఉండేనే ఉన్నాయి. ఏమేం ఉండాలన్నవి మనమే ఎంచుకునే వీలు కల్పిస్తున్నాయి కొన్ని సంస్థలు. □



# ప్రతి ఇంటా ఓ దుర్గ !

దేశంలో ఆడపిల్లల పై జరుగుతోన్న ఆకృత్యాలు.. ఆమె ఆత్మరక్షణ విద్య నేర్చుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. నవరాత్రులు మొదలుకుని ప్రతి ఇంట్లో ఒక దుర్గ ఉండాలంటూ 'హర్ ఘర్ దురదగ అభియాన్' కార్యక్రమం ప్రారంభిం చింది. శక్తికి ప్రతీకగా, చెడుపై గెలిచిన దుర్గాదేవి విజయానికి గుర్తుగా జరుపుకొనే దసరా ఉత్సవాలతో వీటిని ప్రారభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వరంగ పారిశ్రామిక సంస్థల్లో (ఐటిఐ) చదువుతోన్న విద్యార్థినులకు ఉచితంగా సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్విహిస్తారు. ఏడాది పొడవునా, వారానికి రెండు రోజులు ఈ కార్యనక్రమాలు సాగుతాయి. అంతేకాదు. ఇది విద్యార్థులకోసమే రూపొందించినా ఆత్మరక్షణ విద్య నేర్చుకోవలనుకునే ఏ స్త్రీ అయినా నిరభ్యంతరంగా నేర్చుకోవచ్చు. అని చెబుతున్నారు ఆ రాష్ట్ర మంత్రి. ఈ స్ఫూర్తిని అందుకుని ప్రతి ఇంట్లోనూ చెడుపై పోరాడే ఓ శక్తి తయారవ్వాలని మనమూ కోరుకుందాం. ! □



# నచ్చేటట్లు తినిపించాలి..

పిల్లలకి అన్నం తినిపించడం తల్లులకు పెద్ద ప్రహసనమే. రంగూ, రుచీ, వాసన..కారణం ఏదైనా సరే! వారికి నచ్చేవి కొన్నే ఉంటాయి. కానీ, ఇలా వారు ఒకేరకం తింటుంటే మాత్రం శరీరానికి అన్నిరకాల పోషకాలు అందవు. మరి వారు అన్నీ తినాలంటే.. పిల్లలకు సరైన ఆకలి వేయాలన్నా,పెట్టిన పదార్థాలు ఇష్టంగా తినాలన్నా..ముందు వారి శరీరానికి తగినంత శ్రమ ఉండాలి. అప్పుడే వారు సమయానికి తినగలరు. అన్ని రకాల పదార్థాలూ రుచి చూస్తారు.

◆ ఏ కూర వండినా, ఏ వంటకం చేసినా దాని రంగూ, రుచీ, వాసనలతో చిన్నారులను ఆకట్టుకోవచ్చు. చక్కటి అంకరణతో కట్టిపడేయొచ్చు. అందుకే పిల్లల కోసంచేసే



వంటకాల్ని గార్నిష్ చేయడం మరచిపోవద్దు. సాధారణ ఇడ్లీలకు బదులు మసాలా ఇడ్లీ, క్రంచీ దోశ, కలర్‌ఫుల్ నువ్వుల లడ్డూలు.. ఇలా ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. కొన్నింటిని చూసినప్పుడు ఇష్టపడకపోయినా, రుచితో మెప్పించొచ్చు. వారు మెచ్చనివాటిని పౌడర్‌నో, జ్యూస్‌గానో ఇతర పదార్థాల్లోనో కలిపేయండి కచ్చితంగా తింటారు.

చిన్నారులకు ఆహారంపై ఇష్టం ఏర్పరచాలంటే..వాటితో అనుబంధమూ పెంచాలి. ఆయా పండ్లూ కూరగాయల గురించి కథలుగానో, పాటలుగానో మలచి చెప్పండి. సులువుగా పెరిగే టొమాటో, వంకాయ కొత్తిమీర, మెంతికూర.. వంటి వాటిని వారితో నాటించండి. అవి పెరిగాక కాయలు కోయించి కూరల్లో వాడేలా చూడండి. ఇదంతా వారికి ఎంతో ఆసక్తికరంగా ఉండా క్రమంగా వాటిపై ఇష్టమూ పెరుగతుంది.

◆ పెద్దల ఆహారపుటలవాట్లూ చిన్నారులపై ప్రభావితం చూపుతాయని తెలుసా? మీరేమో ఘుమఘుమలాడేలా మసాలాలూ, జంక్‌ఫుడ్..వంటివి తింటూ మీ పిల్లల్ని మాత్రం ఇవే మంచివి. వీటినే తినాలి అని నియత్రించలేరు. మీరు ఆరోగ్యకరమైన అవాట్లను పాటిస్తే వాళ్లూ మిమ్మల్ని అనుసరిస్తారు. □

# ఆకాశ దీపాలివిగో !

దామెదరాయ నభసి తులాయాం
దోలయా సహ!
ప్రదీపంతే ప్రయచ్ఛామి
నమో నంతాయ వేధసే !!

సూర్యుడు తులారాశిలో ఉన్నప్పుడు దామెదరుడైన శివకేశవులను ఆహ్వానిస్తూ దీపాన్ని వెలిగిస్తారు. ఈ దీపకాంతులు హరిహరుల తేజస్సును ప్రసరింపజేస్తాయని విశ్వసిస్తారు. కార్తిక మాసంలో ప్రతిరోజు గుడికి వెళ్లి ఆకాశదీపాన్ని దర్శించుకొని, దీపాలు వెలిగించిన వారికి జ్ఞానసంపద కలుగు తుందని స్కాంద పురాణ అంతర్గత మైన కార్తిక పురాణం చెబుతు న్నది. ఆకాశ మార్గంలో ప్రయాణించే పితృదేవతలకు ఇవి దారి దీపాలుగా వెలుగు నిస్తాయని శాస్త్రం చెబు తోంది. □

విష్ణుమూర్తి కోసం ఆకాశదీపాన్ని వెలిగించాలి అని శాస్త్ర వచనం. కార్తిక మాసంలో వైష్ణవాలయాల్లో ఆకాశదీపం ఏర్పాటుచేసే సంప్రదాయం ఉంది. మట్టితోగానీ, లోహంతోగానీ చేసిన చిల్లులు ఉన్న ప్రమిదలో ఆవునెయ్యితో గానీ, నువ్వులనూనెతో గానీ ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. దీన్ని ధ్వజస్తంభానికి వేలాడదీస్తారు. దామెదరమావాహయామి, త్రయంబకమావాహ యామి' అని



ఆధ్యాత్మికం

# అరటిపువ్వు పచ్చడి

అరటికాయ వేపుడూ, కూర, పులుసుల గురించి అందరికీ తెలుసు. ఇంకా అరటిదూటను ఆవపెట్టి కూడా వండుతుంటారు. ఒకసారి అరటిపువ్వుతో పచ్చడి ప్రయత్నించి చూద్దాం. ఒకసారి రుచి చూస్తే మీకూ బాగా నచ్చేస్తుంది. ఇంతకీ దీన్నెలా చేయాలంటే..

**కావలసినవి:** అరటిపువ్వు ఒకటి, ధనియాలు, మినపప్పు, జీలకర్ర, మెంతులు, నువ్వులు టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి పది, చింతపండు చిన్న నిమ్మకాయంత, నూనె తగినంత, ఉప్పు సరిపడా, ఇంగువ కొద్దిగా పోపు కోసం: ఆవాలు, శనగపప్పు, మినపప్పు టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి రెండు, వెల్లుల్లి రెబ్బలు నాలుగు, కరివేపాకు గుప్పెడు, ఇంగువ చిటికెడు



**తయారీ:** అరటిపువ్వును శుభ్రంగా కడిగి ముక్కలు కోసుకోవాలి. పైన చెప్పిన పదార్థాలు లేకుండా నూనె వేయించి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో కొద్దిగా నూనె పోసి ఎండుమిర్చి.. తర్వాత అరటిపువ్వును వేయించాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టాలి. కడాయిలో నూనె పోసి.. పోపు కోసం సిద్ధం చేసుకున్న దినుసులను వేసి వేయించి పచ్చడిలో కలపాలి. వేడి వేడి అన్నంలో ఈ పచ్చడి. ఆపైన కాస్త నెయ్యి వేసుకుని తింటే అద్భుతః అనకుండా ఉండలేరు. □



### ఆసియా యూత్ గేమ్స్‌లో..

## కనిష్కకు రజతం, ఖుషీ, అరవింద్ కాంస్యాలు

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025, భారత్ టీనేజర్లు కురాష్‌లో కనిష్క బిధురి రజతం, అరవింద్, ఖుషీ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. దీంతో భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరుకుంది. బహ్రెయిన్‌లో జరిగిన ఈ యూత్ గేమ్స్‌లో పద్నాలుగేళ్ల కనిష్క బిధురి, అరవింద్, ఖుషీ అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. బాలికల 52 కిలోల విభాగంలో పోటీ పడుతున్న కనిష్క, ఫైనల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన కరిమోవా ముబినాబోను చేతిలో 0-3 తేడాతో ఓడిపోయి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె అంతకుముందు ఎగ్జిబిషన్ వరల్డ్ బహ్రెయిన్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో థాయిలాండ్‌కు చెందిన ఖుండీ వారట్చాయను యోన్‌బోష్ చేతిలో ఓడించింది. అలాగే యువ భారత ఆటగాడు ఆధిపత్య ఫామ్‌ను ప్రదర్శించాడు. సెమీఫైనల్లో జలాలోద్దీన్ సెటాయేష్‌పై ఖలోల్ 10-0 తేడాతో విజయం సాధించి టైటిల్ పోరులోకి దూసుకెళ్లాడు. బాలుర 83 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లో దవ్లాట్‌జోడాపై 10-0 తేడాతో విజయం సాధించి అరవింద్ కాంస్య పతకాన్ని సాధించాడు. సెమీఫైనల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన గోలిబోవ్ షోహ్జహోన్ చేతిలో 0-10 తేడాతో ఓడిపోయాడు. కానీ యూత్ గేమ్స్ ఫార్మాట్‌లో కాంస్య పతక ప్లేఆఫ్‌లు లేనందున అతను ఇప్పటికీ పోడియం ఫినిషింగ్‌ను పొందాడు. అంతకు ముందు మహిళల 70 కిలోల విభాగంలో 15 ఏళ్ల ఖుషీ కాంస్య పతకంతో కురాష్‌లో భారత ఖాతా తెరిచింది, ఖండాంతర దశలో సాంప్రదాయ మార్షల్ ఆర్ట్‌లో భారత బృందానికి బలమైన ప్రదర్శన ఇచ్చింది.




## దక్షిణాఫ్రికా ఎదురీత

### 185 రన్స్ ఆధిక్యంలో పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో పర్యాటక దక్షిణాఫ్రికా ఎదురీదుతోంది. రెండో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 4 వికెట్లు నష్టానికి 185 పరుగులు చేయడంతో పాక్ స్కోరుకు ఇంకా 148 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ )32), ర్యాన్ రికెల్టన్ (14), టోనీ డి జోర్జి (55), డైవాల్డ్ బ్రెవిస్ (0) ఔట్ కాగా, ట్రిస్టన్ స్టబ్స్ (68), కైల్ వెర్రిన్ (10) క్రీజ్‌లో ఉన్నారు. పాక్ బౌలర్లలో ఆసిఫ్ ఆఫ్రిది 2, షాహిన్ ఆఫ్రిది, సాజిద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. అంతకు ముందు కేశవ్ మహారాజ్ (42.4-5-102-7) చెలరేగడంతో పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులకు ఆలౌట్ అయింది. అబ్దుల్లా షఫిక్ (57), షాన్ మసూద్ (87), సాద్ షకీల్ (66) అర్ధ సెంచరీలతో రాణించారు. సల్మాన్ అఘా (45) ఫర్వాలేదనిపించాడు. సైమన్ హార్మర్ 2, రబాడ ఒక వికెట్ తీశారు. ఇకపాక్‌ను ఓ మోస్తరు స్కోరుకు పరిమితం చేశాక తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆదిలోనే ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ వికెట్ కోల్పోయింది.



ఆ తర్వాత కొద్ది సేపటికే మార్క్రమ్ కూడా ఔటయ్యాడు. ఈ దశలో స్టబ్స, జోర్జి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే పనిలో వీరిద్దరూ 3వ వికెట్‌కు 113 పరుగులు జోడించారు. అయితే ఆట చివరి అర్ధ గంటలో దక్షిణాఫ్రికా తడబడబాటుకు లోనైంది. ఆసిఫ్ ఆఫ్రిది చెలరేగడంతో 4 రన్స్ వ్యవధిల సెట్ బ్యాటర్ జోర్జి, అప్పుడే నక్రీజులోకి వచ్చిన విధ్వంసకర ప్లేయర్ డెవాల్డ్ బ్రెవిస్ వికెట్లు కోల్పోయింది. స్టబ్స్, వెర్రిన్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి రెండో రోజు ఆటను ముగించారు.

## భారత్‌కు డూ ఆర్ డై

### మహిళల వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్ లాస్ట్ ఛాన్స్



**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025 సెమీఫైనల్ కోసం పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఈ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు భారత్ చేరే మార్గాలు మూసుకుపోతున్నాయి. టోర్నమెంట్ తజాగా జరిగిన 20వ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ భారత్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి, సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్‌కు అర్హత సాధించిన మూడవ జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. శ్రీలంక, పాకిస్తాన్‌లను ఓడించిన తర్వాత, భారత్ ఇప్పుడు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. విజయానికి దగ్గరగా వచ్చిన తర్వాత దక్షిణాఫ్రికాపై ఓటమి చెందింది. తదుపరి ఆస్ట్రేలియాపై 300 కంటే ఎక్కువ లక్ష్యాన్ని కాపాడుకోలేక పోయింది. తాజాగా భారత్ ఇంగ్లాండ్‌పై 4 పరుగుల తేడాతో పరాజయం చెందింది. ఈ ఓటమి భారతదేశం సెమీఫైనల్‌కు చేరుకునే మార్గాన్ని కష్టతరం చేసింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ తమ సెమీఫైనల్ బెర్తులను దక్కించుకున్నాయి. ఇక ఇప్పుడు, ఒకే ఒక స్థానం మిగిలి ఉంది. ఈ స్థానానికి భారత్, న్యూజిలాండ్ పోటీ పడుతున్నాయి. భారత్ తదుపరి మ్యాచ్ ఈ నెల 23న న్యూజిలాండ్‌తో జరుగుతుంది. ఆ తర్వాత అక్టోబర్ 26న బంగ్లాదేశ్‌తో వారి చివరి లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఈ రెండు మ్యాచ్‌లలో భారత్ గెలిస్తే, సులభంగా సెమీఫైనల్‌కు చేరుకుంటుంది. అయితే, భారత్ న్యూజిలాండ్ చేతిలో ఓడిపోతే, తదుపరి ఇంగ్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓటమి చెందాల్సి ఉంటుంది. తరువాత బంగ్లాదేశ్‌ను ఓడించినట్లయితే భారత్ సెమీఫైనల్‌కు చేరుకుంటుంది. భారత్ న్యూజిలాండ్‌ను ఓడించి బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోతే, న్యూజిలాండ్ ఇంగ్లాండ్‌ను ఓడిస్తే, మెరుగైన నెట్ రన్ రేట్ ఉన్న జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంటుంది. ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లు మరియు +0.526 నెట్ రన్ రేట్‌తో భారత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉంది. న్యూజిలాండ్ కూడా నాలుగు పాయింట్లను కలిగి ఉంది. కానీ దాని నెట్ రన్ రేట్ 0.245. దీని వలన న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్ భారత్‌కు డూఆర్‌డై పోటీగా మారింది. గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు చేరుకోవడం దాదాపు ఖాయం.

## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ గ్రీకోరోమన్ రెజ్లర్లు నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ -2025, అండర్ 23లో నలుగురు భారతీయ గ్రీకోరోమన్ రెజ్లర్లు ప్రారంభ రౌండ్‌లోనే నిష్క్రమించారు. సెర్బియాలోని నోవి సాడ్‌లో జరిగి ఈ ఛాంపియన్‌షిప్‌లో గ్రీకోరోమన్ విభాగంలో భారతదేశం యొక్క ప్రచారం నిరాశపరిచింది. పోటీలో ఉన్న నలుగురు భారతీయ రెజ్లర్లు వారి ప్రారంభ రౌండ్ పోటీల్లో ఓటమి చెందారు. గౌరవ్ (63 కిలోలు), అంకిత్ (77 కిలోలు), రోహిత్ బురా (87 కిలోలు), జోగిందర్ రథీ (130 కిలోలు)లతో కూడిన భారత జట్టు క్వాలిఫికేషన్, (రౌండ్ఆఫ్16) దశలను దాటలేకపోయింది. వారి ప్రత్యర్థులపై ఏకపక్ష పరాజయాలను చవిచూసింది. గౌరవ్ 63 కిలోల 1/8 రౌండ్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన కుట్టుబెక్ ఎ అబ్దురజాకోవ్‌తో తలపడ్డాడు. కానీ సాంకేతిక ఆధిపత్యం కారణంగా వెనుకబడ్డాడు. అలాగే 77 కిలోల విభాగంలో అంకిత్ సెర్బియాకు చెందిన జలన్ పెక్ చేతిలో ఓడిపోయాడు. మరో భారత్ రెజ్లర్ రోహిత్ బురా 87 కిలోల అర్హత రౌండ్‌లో అమెరికాకు చెందిన పేటన్ జె జాకబ్సన్‌తో 0-9 తేడాతో పరాజయం పాలయ్యాడు. హెవీవెయిట్ 130 కిలోల విభాగంలో జోగిందర్ రథీ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన డామిర్ఖోన్ రఖ్మాటోవ్ చేతిలో ఓడిపోయాడు. ఈ ముందస్తు నిష్క్రమణలతో, రెపిచేజ్ ద్వారా పోటీలోకి తిరిగి ప్రవేశించాలనే రెజ్లర్ల ఆశలు ఇప్పుడు వారి విజేతలు టోర్నమెంట్‌లో ఎంత దూరం ముందుకు వెళ్తారనే దానిపై ఆధారపడి ఉంటాయి.

## నంబర్ 1 బ్యాటర్‌గా స్మృతి

### మహిళల వన్డే బౌలింగ్ టాప్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ




**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌లో స్థిరమైన ప్రదర్శనల తర్వాత, భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళల వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఐసీసీ మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఇండోర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ, స్మృతి అద్భుతమైన 88 పరుగులు చేసింది. ఈ ఫామ్ ఆమె నంబర్ 1 ర్యాంక్ వన్డే బ్యాట్స్‌మన్‌గా తన ఆధిక్యాన్ని 83 పాయింట్లకు పెంచుకోవడానికి సహాయపడింది. ఇక ఆస్ట్రేలియా కెప్టెన్ అలిస్సా హీలీ ఒక స్థానం ఎగబాకి 3వ స్థానానికి చేరుకోగా, దక్షిణాఫ్రికా ఫామ్‌లో ఉన్న ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ ఒక స్థానం ఎగబాకి 9వ స్థానానికి చేరుకుంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 3 స్థానాలు ఎగబాకి 15, ఆస్ట్రేలియాకు చెందిన ఫోబ్ లిచ్‌ఫీల్డ్ ఐదు స్థానాలు ఎగబాకి 17, ఇంగ్లాండ్ అనుభవజ్ఞురాలు హీథర్ నైట్ 15 స్థానాలు ఎగబాకి 18వ స్థానానికి చేరుకున్నారు. అలాగే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో, ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ వన్డే బౌలర్ల జాబితాలో ఆధిపత్యం కొనసాగుతోంది. ఐదు ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీసిన తర్వాత భారత్‌కు చెందిన దీప్తి శర్మ 3 స్థానాలు ఎగబాకి 3వ స్థానానికి, ఆస్ట్రేలియా స్పిన్నర్ అలానా కింగ్ 2 స్థానాలు ఎగబాకి ఏడో స్థానానికి చేరుకుంది. ఆల్ రౌండర్లలో ఆస్ట్రేలియా ప్లేయర్ యాష్ గార్డ్నర్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. శ్రీలంక కెప్టెన్ చమరి అటపత్తు ఒక స్థానం ఎగబాకి ఏడో స్థానానికి చేరుకుంది.

## దసరా, దీపావళికి రూ.6 లక్షల కోట్ల వ్యాపారం!

వాణిజ్యం

### దేశ రిటైల్ చరిత్రలోనే సరికొత్త రికార్డు: కైయిట్



**న్యూఢిల్లీ, అక్టోబరు 21:** దసరా, దీపావళి పండగ సీజన్‌లో ఈ ఏడాది భారత రిటైల్ మార్కెట్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశవ్యాప్తంగా వస్తువులు, సేవల రూపంలో కలిపి ఏకంగా రూ.6 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. దేశ రిటైల్ చరిత్రలోనే ఒక పండగ సీజన్‌లో ఈ స్థాయిలో టర్నోవర్ నమోదు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) పరిశోధన విభాగమైన సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ మంగళవారం ఈ వివరాలను విడుదల చేసింది. ఈ ఏడాది నవరాత్రుల నుంచి దీపావళి వరకు జరిగిన మొత్తం వ్యాపారం సుమారు రూ.6.05 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇందులో వస్తువుల అమ్మకాలు రూ.5.40 లక్షల కోట్లు కాగా, సేవలరంగంలో మరో రూ.65,000 కోట్ల వ్యాపారం జరిగింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.4.25 లక్షల కోట్ల అమ్మకాలతో పోలిస్తే ఇది ఏకంగా 25 శాతం అధికం. పలు కీలక వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడం ఈ భారీఅమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. స్వీట్లు, గృహాలంకరణ వస్తువులు, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు వంటి వాటిపై పన్నుల భారంతగ్గడంతో ధరలు అందుబాటులోకి వచ్చాయని, వినియోగదారుల నుంచి కొనుగోలు శక్తి పెరిగిందని సర్వేలో తేలింది. జీఎస్టీ తగ్గింపు వల్లే తమ అమ్మకాలు పెరిగాయని సర్వేలో పాల్గొన్న 72 శాతం మంది వ్యాపారులు అభిప్రాయపడ్డారు. పండగ సీజన్ సృష్టించిన ఈ జోష్‌తో లాజిస్టిక్స్, రవాణా, ప్యాకేజింగ్, డెలివరీ వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా సుమారు 50లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక, మొత్తం అమ్మకాల్లో దాదాపు 85 శాతం వాటా రిటైల్ మార్కెట్ ద్వారానే జరగడం విశేషం. గ్రామీణ, ఒకమోస్తరు పట్టణ ప్రాంతాలనుంచి కూడా కొనుగోళ్ల మద్దతు లభించింది. మొత్తం అమ్మకాల్లో ఈ ప్రాంతాల వాటా 28 శాతంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో 2025 దీపావళి ఒక మైలురాయిగా నిలిచిందని సీఏఐటీ వెల్లడించింది. సంప్రదాయం, సాంకేతికత, భారతీయ వాణిజ్యంపై నమ్మకానికి ఈ విజయం ప్రతీక అని వ్యాఖ్యానించింది.

## మరోసారి పసిడిధరలు పైపైకి!



**ముంబయి, అక్టోబరు 21:** బంగారంధరలు మళ్లీ షాకిస్తున్నాయి. రెండురోజులు శాంతించినధరలు దీపావళి ముగియగానే తన పంథాను మళ్లీప్రారంభించింది. మళ్లీ జెట్ స్పీడ్‌తో ధరలు పెరుగుతున్నాయి. తులం బగారం మంగళవారం రూ.2080 పెరిగింది. వెండిమాత్రం కిలో వెండిపై రూ.2వేలవరకూ తగ్గింది. 24 క్యారెట్ల పదిగ్రాముల పసిడి ధర ఒక్కసారిగా 1,34,500 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాములధరపై రూ.1900 పెరిగి రూ.1,21,700 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 18 క్యారెట్ల పదిగ్రాములధరపై 1560పెరిగి రూ.99,580 వద్దట్రేడ్ అయింది. వెండిదరలు కూడా కిలో వెండి రూ.1,70లక్షల వద్దట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.88 లక్షల వద్దట్రేడ్అవుతుంటే ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తాల్లో రూ.1.70లక్షల వద్దట్రేడ్ అవుతోంది. సోమవారం 24 కేరట్లు రూ.1.31, 600 పలికితే మంగళవారం 1,34,500కి చేరింది. 22 క్యారెట్లు రూ.1.21 లక్షలుగా ఉంది. కిలోవెండి సోమవారం రూ.1,67,300కిచేరితే మంగళవారం రూ.1,71, 200కిపెరిగింది. గతవారంలోనే 1.85 లక్షలవరకూ పెరిగిన వెండికొంత మేర తగ్గుతూ వచ్చింది. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారం 4335 డాలర్లుగా ఉంది.ఔన్స్ వెండి 31 డాలర్లుగానే ఉంది. ఇదిలా ఉంటే 2027 నాటికి బంగారంధర తులం ఒక్కింటికి రూ.2 లక్షలుదాటే అవకాశం ఉందని అంచనా. ఇదేతీరు కొనసాగితే 2030 నాటికి పసిడిధర రూ.3 లక్ష లకు చేరుతుందని కూడా బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

## లాభాల్లోముగిసిన 'విక్రమ్ సంవత్ ట్రేడింగ్'




**ముంబయి,అక్టోబరు 21:** దీపావళి పర్వదినం, కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం 'విక్రమ్ సంవత్ 2082' ప్రారంభాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ప్రత్యేక మూరత్ ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లకు శుభం, సంపద కలుగుతాయన్న నమ్మకంతో ఏటా నిర్వహించే ఈ గంట ట్రేడింగ్‌లో సూచీలు స్వల్పంగా పుంజుకున్నాయి. దీంతో మార్కెట్లు వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 62.97 పాయింట్లు లాభపడి 84,426.34 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 25.45 పాయింట్లు పెరిగి 25,868.60 వద్ద ముగిసింది. అయితే, బ్యాంక్ నిఫ్టీ మాత్రం దీనికి భిన్నంగా 26 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 58,007.20 వద్ద ముగిసింది. ఈ సెషన్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడగా, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, మెటల్, ఫార్మా, ఆటో, ఎనర్జీ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. మరోవైపు బ్యాంకింగ్, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ సూచీలు స్వల్పంగా క్షీణించాయి.

మార్కెట్‌లో మిడ్‌క్యాప్ 100 సూచీ 0.11శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.52 శాతం మేర లాభపడ్డాయి. మార్కెట్‌లో ట్రేడింగ్ పరిమాణం తక్కువగా ఉన్నప్పటికీ, సూచీలు కీలక మద్దతు స్థాయిలపైన నిలదొక్కు కోవడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపుతోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సాంకేతికంగా నిఫ్టీ 25,800 పైన ఉన్నంతవరకు మార్కెట్ బుల్లిష్‌గానే ఉంటుంది. 26,000-26,300 స్థాయిని దాటితే సరికొత్త జీవనకాల గరిష్ఠాలను చూసే అవకాశం ఉందని వారు అంచనా వేశారు. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:45 గంటల వరకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈతో పాటు అన్ని ప్రధాన ఎక్స్ఛేంజీలలో ఈ ప్రత్యేక సెషన్ జరిగింది.

## 3నెలల కనిష్టానికి కీలకరంగాల ఉత్పత్తి!



**న్యూఢిల్లీ, అక్టోబరు 21:** భారత్‌లోని కీలకంగా ఉన్న ఎనిమిది రంగాల్లో వృద్ధి మూడునెలల కనిష్టానికి నమోదయింది. సెప్టెంబరులో 3శాతం వృద్ధినిమాత్రమే నమోదుచేసింది.వాణిజ్యశాఖ సవరించిన అంచనా లను మంగళవారం విడుదల చేసింది. గతంలో సవరించిన వృద్ధి అంచ నాలు 6.5శాతంగా ప్రకటించిన మంత్రిత్వశాఖ వాస్తవ గణాంకాలు విడు దలచేసింది. బొగ్గు ఉత్పత్తిలో మైనస్ 1.2శాతం, ముడిచమురు మైనస్ 1.3 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు మైనస్ 3.7శాతం, వరకూ క్షీణించాయి. ఇక సహజవాయు ఉత్పత్తి కూడా వరుసగా 15వనెలలో మైనస్ 3.8శాతం నమోదయింది. సెప్టెంబరులో ఎనిమిది కీలక రంగాలు అంటే ఐసిఐ ప్రకారం చూస్తే వృద్ధి 2.4శాతంగా ఉంది. మొదటి ఆరునెలల్లో అంటే ఏప్రిల్‌నుంచి సెప్టెంబరు వరకూ చూస్తే 2.9శాతంగా ఉంది. అంతకు ముందు ఏడాది 4.3శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. ఇతర మౌలికవనరుల రంగాల్లో ఎరువుల పరంగా 1.6శాతం, సిమెంట్ 5.3శాతం,విద్యుత్ 2.1శాతం చొప్పున నమోదయింది. సిమెంట్‌ఉత్పత్తి మాత్రం2024 అక్టోబరునుంచి మందగమనంగానే ఉంది.

## రూ.10 లక్షలు దాటిన డిపాజిట్లపైనా ఐటి నజర్!




**న్యూఢిల్లీ, అక్టోబరు 21:** ఆదాయపు పన్ను ఎగవేతలపై దృష్టిసారించే ఐటిశాఖ ఇపుడు సాధారణ పౌరుల డిపాజిట్ ఖాతాలపైనా నిఘా పెంచింది. నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువ ఉన్న ఆదాయం గుర్తించి భారీవ్యత్యాసం ఉంటే నోటీసులు జారీచేసి వివరణ కోరుతోంది. నగదు లావాదేవీల పరంగా ఒక ఏడాదిలో మీ అన్ని పొదుపు ఖాతాల్లో రూ.10 లక్షలకంటే ఎక్కువ నగదు జమచేస్తే బ్యాంకులు ఐటిశాఖ దృష్టికి తీసుకెళ తాయి. ఆసొమ్ము ఎక్కడినుంచి వచ్చిందో కూడా రుజువుచేయాల్సి వస్తోంది. అలాగే క్రెడిట్‌కార్డు వినియోగం రూ.10 లక్షలు దాటితే బ్యాంకులు క్రెడిట్‌కార్డు కంపెనీలు ఐటి దృష్టికి తెస్తాయి. అలాగే లక్ష రూపాయలకంటే ఎక్కువ చెల్లింపు నగదురూపంలో చేస్తే అదికూడా ఐటి నజర్ పడుతుంది. 30 లక్షలకంటే ఎక్కువ విలువైన స్థిరాస్థిని కొనుగోలుచేసినా, విక్రయించినా ఆ సమాచారం రిజిస్ట్రార్ ఆఫీసు ఐటి విభాగానికి పంపిస్తుంది. అలాగే కొంతకాలంగా నిష్క్రియగా ఉన్న బ్యాంకు ఖాతా తిరిగి యాక్టివ్ అయి మరిన్ని లావాదేవీలుచేస్తే ఐటి అధికారులకు అనుమానాలు పెరుగుతాయి. అధిక విలువలున్న విదేశీ కరెన్సీ లావాదేవీలు, ఐటిఆర్‌లో ప్రకటించిన సమాచారంలో వ్యత్యాసాలు, బ్యాంకు నివేదించిన వడ్డీ ఆదాయం తదితర పరిస్థితులుకూడా ఐటిశాఖ దృష్టిని ఆకర్షిస్తాయి.




## పనిఒత్తిడి, భారం వల్లే టిసిఎస్‌లో లేఆఫ్‌లు!

### కృత్రిమమేధ, ట్రేడ్ ట్యారిఫ్‌ల ప్రభావం

**హైదరాబాద్, అక్టోబరు 21:** ఐటిసేవల దిగ్గజం టిసిఎస్‌లో సెప్టెంబరు త్రైమాసికంలో 20 వేల మందికి ఉద్వాసన పలికింది. కంపెనీ గణాంకాలే ఇందుకు స్పష్టం అవుతున్నాయి. టిసిఎస్ చరిత్రలో ఇంత భారీ ఎత్తున హెడ్‌కౌంట్ తగ్గించిన చరిత్రలేదు. ఉద్యోగులు కంపెనీలు మారిపోతుండటంవల్లకొంద, స్వచ్ఛందంగా లేఆఫ్‌కు మ్మతించడం మరికొంతవల్ల ఉద్యోగులు 20 వేలమందివరకూ తగ్గినట్లు కంపెనీసైతం అంగీకరించింది. కంపెనీ వర్క్‌ఫోర్స్‌లో మొత్తం 19,755 మందిని తగ్గించింది. మధ్య, సీనియర్‌స్థాయి ఉద్యోగుల్లోనే ఈ తగ్గింపు ఉంది. కంపెనీ కొత్త ఫోకస్ ఏరియాలకు అనుగుణంగా వీరి పరిజ్ఞానం మెరుగుపడకపోవడం వల్లనే ఇలా జరిగిందని తెలుస్తోంది. కంపెనీపరంగా వాదన ఏమిటంటే ఈ తగ్గింపు వ్యూహాత్మక కృత్రిమమేధ వర్క్‌ఫోర్స్ పరివర్తనం కిందకు వస్తుందని, ప్రతిభను పునఃసమీక్షించడం వంటివాటికిందకు వస్తుందని చెపుతోంది. భావితరం టెక్నాలజీపై అంటే ఎఐ, డేటా, సైబర్ సెక్యూరిటీలపై ఎక్కువ ఫోకస్ ఉందని వివరించింది. అయితే నాస్కెంట్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్) మాత్రం టిసిఎస్ కావాలనే ఉద్యోగులను తగ్గిస్తోందని, కొంతమంది స్వచ్ఛందంగా వెళ్లిపోయేటట్లు చేస్తుంటే మరికొందరిని బలవంతంగా వెళ్లిపోయేవిధంగా పనిఒత్తిడి పెంచుతోందని, దీనివల్లనే ఉద్యోగులు వెళ్లిపోతున్నట్లు ఆరోపించింది. ఈ ఏడాదిజులైలోనే తమ వర్క్‌ఫోర్స్‌లో 2శాతం లేఆఫ్‌లు ఉంటాయని టిసిఎస్‌ప్రకటించింది. అంటే 12 వేలమందికి తక్కువ కాకుండా ఉంటుంది. కృత్రిమమేధ ఆధారిత ఎఫెక్ట్‌వల్ల ఈ లేఆఫ్‌లు తప్పవని వివరించింది. సీనియర్‌లెవల్ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా చెల్లింపు వ్యవస్థను తీసుకొచ్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.